ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం
శుక్రవారం 9, ఫిబ్రవరి 2024

మహీధర్ రెడ్డి దారెటు?

గతంలో ఒకసారి సీఎంను కలిసిన సందర్భంలో మహీధర రెడ్డి.. కందుకూరు సీటు మీ ఇష్టమని, మీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పినట్లు సమాచారం. నెల్లూరు లోక్‌సభ నుంచి పోటీ చేస్తారని భావించిన రాజ్యసభసభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి కందుకూరు మహీధరరెడ్డికే ఇవ్వాలని కోరినట్లు సమాచారం. దీంతో ఆయనకు అవకాశం వస్తుందని భావించారు. తాజా పరిణామాల్లో నెల్లూరు సిటీ స్థానం నుంచి తాను సూచించిన వారికి కాకుండా వేరేవారికి అవకాశం ఇవ్వటంతో పాటు ఆ విషయాన్ని తనకు కూడా చెప్పకపోవటంతో వేమిరెడ్డి అలకబూనారు. ఎంపీ స్థానం నుంచి పోటీ చేయలేనని చెప్పినట్లు తెలిసింది. ఆయన అందుబాటులో కూడా లేకుండా వెళ్లారు. ఈ నేపథ్యంలో మహీధరరెడ్డిని సీఎం జగన్ పిలిచి మీకు టికెట్ ఇవ్వటం లేదని చెప్పటమే గాక రంగంలోకి దింపనున్న వారిని కూడా పరిచయం చేయటం గమనార్హం. దీనికి షాక్ తిన్న ఆయన సీఎం వద్ద సానుకూలంగానే మాట్లాడి బయటకు వచ్చేశారు. తన రాజకీయ భవితవ్యంపై మహీధరరెడ్డి ఏ నిర్ణయం తీసుకుంటారనేందుకు వేచిచూడాల్సిందే. విషయం తెలిసిన కందుకూరు నియోజకవర్గంలోని ఆయన అభిమానులు కొందరు మహీధరరెడ్డికి ఫోన్‌చేయగా అందుబాటులో లేరని తెలుస్తోంది.


జగన్‌తో మహీధర్‌రెడ్డి, పెంచలయ్య, ఆయన కుమార్తెలు



మరో షాక్..!

ఉమ్మడి ప్రకాశం వైసీపీలో గందరగోళం

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మరో సీనియర్ ఎమ్మెల్యేకు ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి షాకిచ్చారు. అదే సమయంలో జగన్ ఏరికోరి తెచ్చుకున్న మాజీ ఎమ్మెల్యే ఆమంచి ఇచ్చిన షాక్ నుంచి ఆ పార్టీ ఇంకా తేరుకోలేదు. ఇప్పటికే ఎమ్మెల్యేలను అటుఇటు బదిలీలు చేసిన నియోజకవర్గాల్లో వైసీపీ పరిస్థితులు ఏ మాత్రం కుదుటపడలేదు. దీనికితోడు రానున్న రోజుల్లో అధికార వైసీపీకి మరి కొన్ని షాక్‌లు తగిలే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

- **ఎమ్మెల్యే మహీధర్‌కు నో టికెట్**
- **తాడేపల్లికి పిలిచి చెప్పిన సీఎం జగన్**
- **కందుకూరులో బీసీ మహిళకు అవకాశం**
- **పర్చూరులో పోటీ చేయలేనని తేల్చిన ఆమంచి**
- **అభ్యర్థి కోసం కొనసాగుతున్న అన్వేషణ**
- **మార్పులు చేసిన స్థానాల్లో కుదుటపడని పరిస్థితులు**

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ముందు నుంచి ఊహిస్తున్నట్లే కందుకూరు స్థానం నుంచి సీనియర్ ఎమ్మెల్యే మహీధరరెడ్డిని సీఎం జగన్ తప్పించి వేశారు. ఆయన స్థానంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన మహిళను రంగంలోకి తేనున్నారు. ఆ మేరకు గురువారం మహీధర్‌రెడ్డిని పిలిపించుకుని 'మీకు ఈసారి టికెట్ లేదు. కందుకూరు నుంచి బీసీ మహిళను రంగంలోకి దింపబోతున్నాం. మీరు సహకరించి గెలిపించండి' అంటూ తేల్చిచెప్పేశారు. అప్పటికే ఆయన వద్ద ఉన్న గూడూరుకు చెందిన ఆదిశంకర ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ పెంచలయ్యను ఆయనతోపాటు ఉన్న ఆయన ఇద్దరు కుమార్తెలను పరిచయం చేశారు. అంతకుముందే పెంచలయ్యను పార్టీలో చేర్చుకుని వైసీపీ కండువా మెడలో వేశారు. నెల్లూరుకు చెందిన మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ పెంచలయ్యను సీఎంకు పరిచయం చేసి పార్టీలో చేరతాడని అవకాశం ఇస్తే ఆయన లేక ఆయన కుమార్తెలలో ఒకరు కందుకూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా రంగంలో ఉంటారని చెప్పారు. చర్చల అనంతరం జగన్ వారికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. పెంచలయ్యతో పాటు ఆయన కుమార్తె అరవింద, మూడవ కుమార్తె డాక్టరు వి.ఐశ్వర్యలు జగన్‌ను కలిశారు. తాను లేకుంటే తన కుమార్తెల్లో ఒకరికి టికెట్ ఇవ్వాలని ఆయన కోరినట్లు తెలిసింది. మహిళా అభ్యర్థిని రంగంలో దింపాలని భావిస్తున్నామని మీ కుమార్తెలు అరవింద, ఐశ్వర్యలలో ఒకరిని మీరే ఎంపిక చేసుకుని రంగంలో దింపాలని జగన్ సూచించినట్లు తెలిసింది. ఆ తర్వాత మహీధరరెడ్డిని కూడా పిలిచి విషయం సూటిగా చెప్పేశారు. పెంచలయ్య కుమార్తెల్లో అరవిందకు వివాహం కాగా ఐశ్వర్యకు ఇంకా వివాహం కాలేదు. దీంతో అరవింద కుటుంబసభ్యులు అంగీకరిస్తే ఆమెను కానిపక్షంలో ఐశ్వర్యను రంగంలో దింపుతానని పెంచలయ్య చెప్పినట్లు తెలిసింది.

సర్దుబాటు కాని పరిణామాలు

ఇప్పటికే వైసీపీ అధికారికంగా నియోజకవర్గ ఇన్‌చార్జిలను ప్రకటించిన ప్రతి స్థానంలోనూ పరిస్థితులు కుదుటపడలేదు. మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జునలు ఇన్‌చార్జిలుగా ఉన్న కొండపి, సంతనూతలపాడుల్లో అటు మాగుంట, ఇటు బాలినేని అనుచరగణం పూర్తిగా వారి వెంట నడవటం లేదు. ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే సుధాకర్‌బాబు మంత్రి నాగార్జున నిర్వహించే కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్ నియోజకవర్గంలో పర్యటిస్తూ ఎమ్మెల్యే మధుసూదన్‌యాదవ్ అనుచరులను కూడా కలుస్తున్నారు. కొంతమంది ఆయన సమావేశానికి హాజరవుతుండగా, మరికొందరు దూరంగా ఉన్నారు. ఎమ్మెల్యే బుర్రా తనకే అవకాశం వస్తుందని, వేచి ఉండాలని అనుచరులతో చెబుతున్నారు. మధ్యలో వైసీపీ నాయకులు కదిరి బాబూరావు, పార్టీ అభ్యర్థిని ఇంకా అధికారికంగా ఖరారు చేయలేదని, మార్పు ఉండవచ్చని బహిరంగంగా ప్రకటించారు. తనకు పరిచయం ఉన్న కొంతమంది నేతలతో సమావేశమై వైసీపీలో పరిణామాలు మారే అవకాశం ఉందని తానూ రంగంలోకి వచ్చే అవకాశం లేకపోలేదని కొద్దిరోజులు వేచి ఉండాలని సూచించారు. దీంతో నియోజకవర్గంలో గందరగోళ పరిస్థితులు నెలకొని ఉండగా టీడీపీ ఇన్‌చార్జి ఉగ్ర ఆధ్వర్యంలో ఆ పార్టీలోకి భారీగా చేరికలు జరుగుతున్నాయి.

పర్చూరుపై ఆమంచి హ్యాండ్సప్



పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అక్కడ్నుంచి పోటీ చేయకూడదన్న ఆలోచనకు వచ్చినట్లు సమాచారం. ఆ మేరకు ఐప్యాక్ ప్రతినిధులకు ఆయన సమాచారం ఇచ్చినట్లు కూడా తెలిసింది. దీన్ని దృష్టిలో ఉంచుకునే పర్చూరుకు మరో అభ్యర్థి కోసం అధిష్ఠానం వెతుకులాట ప్రారంభించింది. నియోజకవర్గానికి చెందిన గొట్టిపాటి భరత్‌ను పిలిచి ఇప్పటికే జగన్ మాట్లాడి ఉన్నారు. అలాగే దర్శి ఎమ్మెల్యే వేణుగోపాల్, ఒంగోలుకు చెందిన వ్యాపారి కంది రవిశంకర్‌లను కూడా పర్చూరు నుంచి పోటీచేయాలని అధిష్ఠానంలోని నాయకులు సూచించారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి, వ్యాపారి రవిశంకర్‌ల నుంచి సానుకూలత వ్యక్తం కాలేదని సమాచారం. మంత్రి బొత్స ద్వారా పర్చూరుకు చెందిన ఎన్నారై రామాంజనేయులు అవకాశం ఇస్తే పోటీకి సిద్ధమని సమాచారం పంపినట్లు తెలుస్తోంది. సీఎం జగన్ సూచనల మేరకు కాపు సామాజికవర్గం వారినే రంగంలో దించే ఉద్దేశంతో అధిష్ఠానంలోని నాయకులు అన్వేషణ ప్రారంభించారు. సీఎం జగన్ ఢిల్లీ పర్యటన నుంచి వచ్చిన తర్వాత పర్చూరు అభ్యర్థిపై ఓ నిర్ణయానికి రావచ్చుని తెలుస్తోంది. ఆమంచి చీరాలలోని తన అనుచరులతో పదే పదే మంతనాలు జరుపుతూ ఉన్నారు. దీంతో ఆయన ఏ రూపంలో ముందడుగు వేస్తారనే విషయంపై కూడా వైసీపీ అధిష్ఠానం దృష్టిసారించి ఉంది. ఈనెల 14 తర్వాత ఆమంచి తన నిర్ణయాన్ని బహిరంగపరిచే అవకాశం కనిపిస్తోంది. దీంతో చీరాల, పర్చూరు నియోజకవర్గాల వైసీపీలో కూడా కొన్ని మార్పులు జరిగే అవకాశం కనిపిస్తుండగా, శ్రేణుల్లో అలజడి తీవ్రమైంది.

వైసీపీ శ్రేణులు పాలోమంటూ..


ఉగ్రనరసింహారెడ్డి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన వెలిగండ్ల వాసులు(ఫైల్)

ఎర్రగొండపాలెంలో వైసీపీ ఇన్‌చార్జి చంద్రశేఖర్ కూడా పార్టీలోని ద్వితీయ శ్రేణి నాయకులందరినీ కలుస్తున్నారు. టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు సమక్షంలో వైసీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీలో చేరుతుండటం విశేషం. మూడు నాలుగు రోజుల్లో పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల్లో చేరికలు భారీగా జరిగాయి. దర్శిలో బూచేపల్లి శివప్రసాదరెడ్డి ప్రచార కార్యక్రమాన్ని వేగవంతం చేయగా ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ఆ వైపు వెళ్లవద్దంటూ తన అనుచరులను కట్టడి చేశారు. గిద్దలూరు ఇన్‌చార్జిగా నియమితులైన మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి, మార్కాపురం ఇన్‌చార్జిగా నియమితులైన గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబులు ఇంకా కొత్త నియోజకవర్గాల్లో కాలు మోపలేదు. గిద్దలూరు నియోజకవర్గంలో గడిచిన రెండు రోజుల్లో వైసీపీకి చెందిన కాపు, బీసీ, ఆర్యవైశ్య సామాజిక వర్గాలకు చెందిన పలువురు పాలోమని మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. గ్రామాల్లో ఓటు బ్యాంకులుగా ఉన్న పలువురు నాయకులు వైసీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీలోకి వెళ్లటం విశేషం.


వైపాలెంలో ఎరిక్షన్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరికలు(ఫైల్)


మార్కాపురం నియోజకవర్గంలో కందుల సమక్షంలో టీడీపీలో చేరికలు(ఫైల్)



గిద్దలూరులో టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పుతున్నఅశోక్‌రెడ్డి(ఫైల్)

ఎయిడెడ్ నియామకాల్లో అక్రమాలు



- **ఏడుగురి ఎంపిక రద్దు**
- **ఉప విద్యాధికారికి సంజాయిషీ నోటీసు**

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 8 : జిల్లాలోని ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో భారీగా అక్రమాలు జరిగాయి. అర్హత లేని వారిని సైతం టీచర్ పోస్టులకు ఎంపిక చేశారు. టీచర్ల ఎంపికకు ఆమోదముద్ర వేసే అధికారి ఆఖరు నిమిషంలో జరిగిన అక్రమాలు గుర్తించి అర్హత లేని ఏడుగురు అభ్యర్థుల ఎంపికకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదు. అయితే ఆ ఏడుగురు అభ్యర్థులను టీచర్ పోస్టులకు ఎంపిక చేసి ఆమోదం కోసం ప్రతిపాదనలు పంపినందుకు ఒంగోలు ఉప విద్యాధికారి అనితా రోజ్‌రాణికి డీఈవో సంజాయిషీ నోటీసును జారీచేశారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లాలోని ఈతముక్కల ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల, నాగులుప్పలపాడు మండలం చేకూరపాడు ఓరియంటల్ హైస్కూలులో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రెండు పాఠశాలల్లో పోస్టుల భర్తీకి ప్రభుత్వ ప్రతినిధిగా ఒంగోలు ఉపవిద్యాధికారి అనితారోజ్‌రాణిని నియమిస్తూ డీఈవో సుబ్బారావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ప్రతినిధిగా నియమితులైన ఆ అధికారి 2022-23 విద్యా సంవత్సరం విద్యార్థుల నమోదు ఆధారంగా కొత్తగా పోస్టుల నియమించడమేగాక రోస్టర్ పాయింట్ల ప్రకారం రిజర్వేషన్ కూడా నిర్ధారించారు. ఈ పోస్టులకు డీఈవో అనుమతి ఇచ్చిన తర్వాత పత్రిక ప్రకటన ద్వారా అర్హులైన అభ్యర్థుల దరఖాస్తుల కోసం పత్రికా ప్రకటన ఇవ్వాలి. ఆ ప్రకారమే ప్రకటన జారీచేశారు. నిబంధనల ప్రకారం టెట్ ఉత్తీర్ణులైన వారు మాత్రమే అర్హులు. ఈతముక్కల, చేకూరపాడు పాఠశాలలకు ఏడేసి పోస్టులకు కొందరు టెట్ ఉత్తీర్ణులు కాని వారి దరఖాస్తులను సైతం ఆమోదించి వారితో కూడా రాతపరీక్ష రాయించారు. నిబంధనల ప్రకారం టెట్ అర్హత లేని అభ్యర్థుల దరఖాస్తులు తిరస్కరించి వారిని రాతపరీక్షకు అనుమతించకూడదు. అందుకు భిన్నంగా వారిని పరీక్షకు అనుమతించడంతోపాటు పోస్టులకు ఎంపిక చేసి ఆ ప్రతిపాదనలను డీఈవో ఆమోదానికి పంపారు. ఈ మొత్తం వ్యవహారంలో భారీగా అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. ఆ మేరకు ఈతముక్కల పాఠశాలలో ఇద్దరు, చేకూరపాడులో నలుగురు అభ్యర్థులను అనర్హులుగా గుర్తించి వారి ఎంపికను డీఈవో రద్దుచేశారు. మిగిలిన వారు విధుల్లో చేరారు. అక్రమాలు బయటపడడంతో ఒంగోలు ఉపవిద్యాధికారి అనితారోజ్‌రాణికి డీఈవో సంజాయిషీ నోటీసులను జారీచేశారు.

వెలిగొండ ప్రాజెక్టుపై కాగ్ అక్షింతలు

ఏళ్లు గడుస్తున్నా లబ్ధి చేకూరలేదు

బడ్జెట్‌లో కేటాయింపులు చేసినా ఖర్చు చేయలేదు

- **మాన్యువల్ డ్రిల్ విధానంపైనా అభ్యంతరం**
- **కాంట్రాక్టర్ల మార్పునకు ఖర్చుపెంచారు**

ఒంగోలు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం, పనులు నిర్వహిస్తున్న తీరు, బడ్జెట్ కేటాయింపుల వ్యయం ఇతరత్రా పలు అంశాల్లో ప్రభుత్వ తీరును కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) తప్పుబట్టింది. ఏళ్లు గడుస్తున్నా కరువు పీడిత ప్రాంత ప్రజలకు ప్రాజెక్టు లబ్ధి చేకూరలేదంటూ అసంతృప్తిని వ్యక్తం చేసింది. అసెంబ్లీ సమావేశాల ముగింపు సందర్భంగా గురువారం కాగ్ రిపోర్టును శాసనసభ్యులకు అందజేశారు. నీటి పారుదల రంగంలో రాష్ట్రంలోనే కీలకంగా ఉన్న వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి 2017-18 నుంచి 2020-21 వరకు చేపట్టిన పనులు, వాటి పురోగతి, బడ్జెట్ కేటాయింపు, వ్యయం, పనులు జరుగుతున్న తీరు, అసలు ప్రాజెక్టు నిర్మాణ లక్ష్యం ఇతరత్రా పలు అంశాలను కాగ్ పరిశీలన చేసి ప్రత్యేక నివేదిక ఇచ్చింది. ప్రాజెక్టు సమగ్ర స్వరూపాన్ని, ప్యాకేజీల వారీగా పనుల విభజన ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకొని పరిశీలించిన కాగ్ పలు అంశాలను తప్పుబట్టింది. ప్రధానంగా 2021 నాటికి ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించి 17 ఏళ్లు అయినా ఇంకా అసంపూర్తిగానే ఉండటం, కీలకమైన సొరంగాలు, కాలువల నిర్మాణాల్లో లోపాలతో అసంపూర్తిగా ఉన్నట్లు పేర్కొంది. ఏళ్లు గడుస్తున్నా నిర్మాణ లక్ష్యం నెరవేరలేదని నివేదికలో తెలిపారు. టన్నెల్ తవ్వకాల పనులను మిషన్‌తో కాకుండా మాన్యువల్‌గా డ్రిల్ చేయడం సరైంది కాదంది. ఇలా ప్రణాళిక లేకుండా పనులు చేయడంతో పరికరాలు నిరుపయోగంగా మారాయని, మరో వైపు కాంట్రాక్టర్లకు అదనపు పనులు మంజూరు, కొన్ని ప్యాకేజీల్లో మార్పుల వల్ల వ్యయం పెరిగిందని పేర్కొంది. అందులో అదనపు పనులతో రూ.339కోట్లు, అలాగే కాంట్రాక్టర్ల మార్పుతో మరో రూ.419 కోట్లు ఖర్చు పెరిగినట్లు పేర్కొన్నారు. కాంట్రాక్టర్లకు ముందస్తు చెల్లింపులు కాకుండా షెడ్యూళ్లను సమీక్షించాలని కాగ్ స్పష్టంగా సూచించింది. మరో వైపు వెలిగొండకు కేటాయింపులు పెరగ్గా, ఖర్చు మాత్రం తక్కువగా చేశారని అసంతృప్తి వ్యక్తం చేసింది. కాగ్ పరిశీలన చేసిన కాలంలో సుమారు రూ.2,190 కోట్లు కేటాయించినా ఖర్చు కేవలం రూ.1,270 కోట్లు మాత్రమే చేశారని పేర్కొంది. నాలుగేళ్ల వరుసగా ఆ ఏడాది ఎంత కేటాయించారు, ఎంత ఖర్చు చేశారన్నది సూచించగా వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా 2020-21లో రూ.918కోట్లు కేటాయించినా కేవలం రూ.318 కోట్లు మాత్రమే ఖర్చు చేసిన వైనం స్పష్టమైంది.


వెలిగొండ రెండో టన్నెల్ ముఖద్వారం



గతేడాది అక్టోబరుతోనే గడువు ముగిసిన మాత్రల అట్ట

రోగులకు కాలం చెల్లిన మందులు

ఒంగోలు నగరంలో అందజేస్తున్న వైద్యసిబ్బంది

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 8 : కాలం చెల్లిన మందులను వాడవద్దని నిపుణులు పదేపదే చెప్తున్నా.. వైద్యారోగ్యశాఖ పట్టించుకుంటున్న పరిస్థితి లేకుండాపోయింది. చేతికేమందులు(ట్యాబ్‌లెట్లు) వస్తే వాటిని రోగులకు ఇచ్చి పంపుతున్నారు. ఒంగోలు నగరంలోని ఒక అర్బన్ హెల్త్ సెంటర్‌లో రోగులకు కాలం చెల్లిన మాత్రలు ఇస్తున్న వైనం వెలుగులోకి వచ్చింది. ఒక షుగర్ పేషెంట్ క్రమంతప్పకుండా అర్బన్ హెల్త్ సెంటర్‌లో చూపించుకుంటారు. అక్కడ బ్లడ్ షుగర్‌ను పరిశీలించి నెలకు సరిపడా మందులను ఇస్తుంటారు. అలా ఆ వైద్యశాలకు వెళ్లిన పేషెంట్‌కు మాత్రలను అందజేశారు. వాటిని ఆమె ఐదారు రోజుల నుంచి వాడుతూ వచ్చారు. పెద్దగా చదువుకోకపోవడంతో ఆ మాత్రల గడువు ఏ సంవత్సరం వరకు ఉండేది చూసుకోలేదు. ఆమె కుటుంబ సభ్యులు ఆ మాత్రలను గురువారం పరిశీలించారు. అవి 2021 నవంబరులో తయారుచేయగా 2023 అక్టోబరుకు కాలం చెల్లుతాయని ఉంది. ఈ విషయాన్ని పట్టించుకోని వైద్యసిబ్బంది వారి వద్దకు వచ్చిన వారందరికీ ఆ మాత్రలనే పంపిణీ చేసినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకొని కొంతమంది వైద్యశాలకు వెళ్లి అడిగితే కనీసం సమాధానం కూడా చెప్పలేదని తెలిసింది. ప్రభుత్వ వైద్యశాల కదా వెళితే కాలం చెల్లిన మందులను తమకు అంటగడుతున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడువు మీరిన మందులను వాడితే ఏ ఇబ్బంది వస్తుందోనని వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని ఇటువంటి మందులను రోగులకు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డీఈవోగా సుభద్ర బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న డీఈవో

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 8 : జిల్లా విద్యాశాఖాధికారిగా దాట్ల సుభద్ర గురువారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడలో ఉప విద్యాధికారిగా పనిచేస్తున్న సుభద్ర డీఈవోగా ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి చేరుకున్న ఆమెకు కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఆ తర్వాత డీఈవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జవాబుదారీతనంతో బాధ్యతాయుతంగా పనిచేస్తానని తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ నుంచి తన ఉద్యోగ ప్రస్థానం మొదలైందని, అన్నిస్థాయిల్లో తనకు విషయ అవగాహన ఉందన్నారు. ఉద్యోగులు, అధికారులను సమన్వయం చేసుకుని మంచి ఫలితాలు సాధించేందుకు కృషిచేస్తానని తెలిపారు. కాగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సుభద్ర కలెక్టర్ దినేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం బండ్లమిట్టలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల స్థాయిని పరీక్షించారు. డీఈవోగా బాధ్యతలు స్వీకరించిన ఆమెను వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిసి అభినందించారు. జిల్లా హెచ్ఎంల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాంతారావు, వై.వెంకట్రావు, కోశాధికారి జీఎస్ఆర్ సాయి, మర్రి శ్రీనివాసరావులు ఆమెకు డైరీని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్టీయూ నాయకులు దాసరి శ్రీనివాసులు, కడియం ప్రసాద్, సీహెచ్ ఆదినారాయణ, ప్రసాదరాజు, కే ఏసునాథంలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ అస్తవ్యస్తం



నాయకులతో మాట్లాడుతున్న జయంత్‌బాబు

మద్దిపాడు, ఫిబ్రవరి 8 : వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ అస్తవ్యస్తంగా మారాయని తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షుడు మండవ జయంతిబాబు అన్నారు. బూరేపల్లి గ్రామంలో మనఊరు-మన టీడీపీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బూరేపల్లి గ్రామంలో ఎవరిపాలనలో అభివృద్ధి చెందిందో గమనించాలన్నారు. ప్రతి ఒక్కరూ టీడీపీ గెలుపునకు తమవంతు కృషి చేయాలని కోరారు. గ్రామంలో టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ-భవిషత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మహిళాశక్తి, అన్నదాత, బీసీ రక్షణచట్టం, తల్లికి వందనం, వృద్ధులకు మూడునెలల పింఛన్ తీసుకునే వెసులుబాటు తదితర పథకాల గురించి వివరించాలన్నారు. ఇల్లులేని ప్రతి ఒక్కరికి రెండు సెంట్లు స్థలం ఇస్తామని తెలిపారు. గ్రామాల్లో ప్రధాన సమస్యలు తెలియజేయాలని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు నారిపెద్ది అనీల్, బొడెంపూడి రామకృష్ణ, కొమ్మలపాటి సుబ్బారావు, రావిపాటి శేషారావు, శేషయ్య, మండవ గోపిచంద్ తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఎల్వోలు సమన్వయంతో పనిచేయాలి

మద్దిపాడు, ఫిబ్రవరి 8: బీఎల్వోలు సమన్వయంతో పనిచేయాలని తహసీల్దార్ శివశంకర్ పేర్కొన్నారు. గురువారం మద్దిపాడులోని తన కార్యాలయంలో బీఎల్వోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరిగే ఎన్నికలకు సంబంధించిన పనులు వేగంగా చేయాలనానరు. రాజకీయ పార్టీలకు దూరంగా ఎన్నికల నిర్వహణ ఉండాని సూచించారు. కనుక అధికారులు పలు జాగ్రత్తలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ అనూష పాల్గొన్నారు.

ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రాలను అందజేసిన డీఎం శ్రీనివాసులు

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 8: ఏపీఎస్ ఆర్టీసీ ఒంగోలు డిపో పరిధిలోని వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు గురువారం ప్రశంసాపత్రాలు, రివార్డులు అందజేశారు. ఒంగోలులోని డీఎం కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమలో ప్రతిభ కనబరచిన డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో డిపో మేనేజరు డి.శ్రీనివాసులు, అసిస్టెంట్ ఇంజనీర్ విజయ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగించుకోవాలి



సభ్యత్వాన్ని అందజేస్తున్న ఆదిలక్ష్మి

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 8: విజ్ఞానం కోసం విద్యార్థులు గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు ఆమె సభ్యత్వాలను అందజేశారు. ప్రముఖ సంఘ సేవకులు నున్నా ఆంజనేయులు సహకారంతో సభ్యత్వాలను అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. గ్రంథాలయంలో విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే అనేక పుస్తకాలు ఉన్నాయని, వాటిని ఉపయోగించుకోవటం ద్వారా ఉన్నత ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ తమ విదార్థినులకు సభ్యత్వం కల్పించటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపగ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, లైబ్రేరియన్ కె.సంపూర్ణ, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య, రాంబాబు, కూరపాటి శ్రీనివాసులు, స్టెలి, సిబ్బంది పాల్గొన్నారు.

నూరుశాతం ఫలితాలను సాధించాలి



మాట్లాడుతున్న మధుసూదన్‌రావు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 8 : జిల్లాలోని అన్ని కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో చదువుతున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులందరూ నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని కేజీబీవీ రాష్ట్ర సెక్రటరీ డి.మధుసూదన్‌రావు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో గురువారం జిల్లాలోని 28, బాపట్ల జిల్లాపరిధిలోని నాలుగు కస్తూర్బా బాలికా విద్యాలయాల ప్రిన్సిపాల్స్‌తో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పబ్లిక్‌పరీక్షల్లో జిల్లా విద్యార్థులు రాష్ట్రంలో టాప్ పదో స్థానంలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతేగాకుండా ఎక్కువ మంది 500లకు పైగా మార్కులు సాధించేలా కృషి చేయాలని చెప్పారు. సబ్జెక్టుల వారీగా అదనపు తరగతులు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అంశాలవారీగా సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో డీఈవో సుభద్ర, జీసీడీవో ఎం.ప్రమోద, బాపట్ల జీసీడీవో చారులత పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు అవగాహన

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 8: ఆటో డ్రైవర్లు విధిగా రోడ్డు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని డీటీసీ సుశీల జిల్లా రవాణాశాఖ అధికారులు ఆదేశించారు. ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన సదస్సును గురువారం ఒంగోలులోని రవాణాశాఖ కార్యాలయంలో ఉపరవాణా కమిషనర్ ఆర్.సుశీల ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్ వాహన తనిఖీ అధికారులు కిరణ్‌ప్రభాకర్, కె.రామచంద్రరావు, ఎల్.సురేంద్రప్రసాద్ తదితరులు రోడ్డు నిబంధనలు గురించి డ్రైవర్లకు వివరించి తప్పక పాటించాలని సూచించారు.

ఆశావర్కర్లను నిర్బంధించడం దారుణం



ధర్నా నిర్వహిస్తున్న యూనియన్ ప్రతినిధులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 8 : సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో ధర్నా చేపట్టిన ఆశా వర్కర్లను ప్రభుత్వం పోలీసుల ద్వారా నిర్బంధించడం దారుణంగా ఉందని యూనియన్ జిల్లా కార్యదర్శి పి.కల్పన విమర్శించారు. ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గురువారం చలో విజయవాడ ధర్నా కార్యక్రమానికి పిలుపునిచ్చారన్నారు. అయితే ఆశా వర్కర్లు విజయవాడ వెళ్లకుండా వెళ్లకుండా అనేక కుట్రలు పన్నారని విమర్శించారు. ఆశా వర్కర్ల సమస్య లను పరిష్కరించకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో కంకణాల రమాదేవి, టి.మహేష్, తంబి శ్రీనివాసులు, ఎస్‌డీ.హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మెప్మాలో రుణస్కాం ఒప్పుకున్నారు..

వైసీపీ నాయకులపై చర్యలేవి..?

• మేయర్‌ను ప్రశ్నించిన తెలుగు తమ్ముళ్లు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 8: ఒంగోలు నగరంలోని మెప్మాలో జరిగిన రుణస్కాంపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం ఒప్పుకున్న మేయర్ గంగాడ సుజాత, దోచుకున్న సొమ్ము రికవరీపై సమాధానం చెప్పాలని తెలుగుదేశం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ నగరంలో మెప్మాలోని ఆర్పీలు, సీవోలును బాధ్యులను చేస్తూ మాట్లాడిన మేయర్, అవినీతిలో భాగస్వాములైన వైసీపీ నాయకులు, మహిళా నాయకులను కాపాడే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న మేయర్, గతంలో కనిగిరిలో ఓ సిట్ కేసులో నిందితులుగా ఉన్నారని విమర్శించారు. ఇటీవల త్రోవగుంట వద్ద మండువవారిపాలెం రైతుల భూములను దోచుకున్నారన్నారు. మేయర్ జరిగిన వాస్తవాలను పక్కదారి పట్టించేందుకు ఆర్పీల్లో టీడీపీ వారు ఉన్నారని రాజకీయాలను ఆపాదిస్తున్నారని మండిపడ్డారు. బ్యాంకు రుణాల గోల్‌మాల్‌లో బాధితులైన మహిళలకు టీడీపీ అండగా ఉంటామని తాము చెబితే, టీడీపీ ఆఫీసును ముట్టడిస్తామని మేయర్ చెప్పడం విడ్డూరంగా ఉందని చెప్పారు. పట్టణ పేద మహిళల ఆర్థిక పురోభివృద్ధి కోసం నాడు చంద్రబాబు నాయుడు డ్వాక్రా గ్రూపులు ప్రవేశపెడితే నేడు వైసీపీ పాలనలో పొదుపు మహిళల పేరుతో భారీగా రూ.కోట్లు దండుకుంటున్నారని ధ్వజమెత్తారు. మెప్మాలో జరిగిన అవినీతిపై స్వయంగా ఒప్పుకున్న ఆమె ఈ కుంభకోణంలో తమ పార్టీకి చెందిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. మేయర్ వాఖ్యలు చూస్తుంటే సుమారు రూ.120కోట్లు అవినీతి జరిగినట్లు తెలుస్తుందన్నారు. సమగ్ర విచారణ జరిపించి తగిన చ ర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశం లో నాయకులు ఎద్దు శశికాంత్‌భూషణ్, కార్పొరేట ర్ అంబూరి శ్రీనివాసరావు, గోగినేని రామారావు, బండారు మదన్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

• దామచర్ల సత్య



మాట్లాడుతున్న సత్య

పొన్నలూరు (కొండపి), ఫిబ్రవరి 8 : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే సీఎంగా చంద్రబాబును గెలిపించాలని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య చెప్పారు. గురువారం ఆయన మన గ్రామానికి మన సత్య కార్యక్రమంలో భాగంగా విప్పగుంట, పెదవెంకన్నపాలెం, చౌటపాలెం, మాలెపాడు, లింగంగుంట, చెంచుపాలెం, మూలేవారిపాలెం, చెర్వుకొమ్ముపాలెం, పరుచూరివారిపాలెం, తిమ్మపాలెం, శివన్నపాలెం, మూలేవారిపల్లె, కొత్తపాలెం, రాజోలుపాడు, భోగనంపాడు తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. పలుగ్రామాల్లో పార్టీ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ టీడీపీ హయాంలో రాష్ట్రంతోపాటు కొండపి నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని చెప్పారు. తన తాత దామచర్ల ఆంజనేయులు, ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిల హయాంలోనే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిగాయన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా దెబ్బతినిపోయిందని చెప్పారు. గ్రామ పంచాయతీలు నిధులు లేక కునారిల్లిపోతున్నాయన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే తిరిగి గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతాయని చెప్పారు. పార్టీ ప్రకటించిన మ్యానిఫెస్టోను ప్రజలకు నాయకులు, కార్యకర్తలు వివరించాలన్నారు. అదేవిధంగా ఇతర రాష్ట్రాల్లో ఉంటున్న వలస కూలీలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల వివరాలు ఆయా గ్రామాల నాయకులు సేకరించి వారి ఓట్లు పార్టీకి పోలయ్యే విధంగా చూడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు అడకా స్వాములు, సీ నియర్ నాయకుడు బంగారయ్య, మండల పార్టీ అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, నాయకులు మండవ ప్రసాద్, కర్నా కోటిరెడ్డి, కొండ్రగుంట శ్రీనివాసరావు పాల్గొన్నారు. పలు గ్రామాల్లో పెద్ద సంఖ్యలో మహిళలు సమావేశాలకు హాజరవ్వడం గమనార్హం.

ఓటర్ల జాబితాపై ఫిర్యాదులను పరిష్కరిస్తాం

• కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 8: ఓటర్ల జాబితాలోని చేర్పులు, మార్పులపై రాత పూర్వకంగా వచ్చే అభ్యంతరాలను, ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తామని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో గురువారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాలపై రాజకీయ పార్టీలు సూచించిన అంశాలను పరిగణలోకి తీసుకొని తప్పొప్పులను సరిచేస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఫారం-7 దరఖాస్తులు 0.1 శాతం కన్నా ఎక్కువ వస్తే ఆ ఓట్లను తొలగించాలంటే రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అనుమతి తప్పని సరిగా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనల మేరకు ఎన్నికల ప్రక్రియపై సంపూర్ణ అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఓటర్ల జాబితాపై రాతపూర్వకంగా వచ్చే ఫిర్యాదులను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు. ముందుగా రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తేగా వాటిపై రాత పూర్వకంగా ఇస్తే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్వో ఆర్.శ్రీలత, ప్రతినిధులు డీఎస్.క్రాంతికుమార్, ఎం.కాలేషాబేగ్, స్వరూప్, రసూల్, సత్యనారాయణ, ఎర్రయ్య, సుదర్శన్, ఎన్నికల విభాగపు అధికారులు పాల్గొన్నారు.

వ్యాపారవేత్త శిద్దా సుబ్బారావుకు ఘన నివాళి





నివాళులర్పిస్తున్న విజయ్‌కుమార్, సుధీర్‌కుమార్, శిద్దా రాఘవరావు, ఎమ్మెల్యే బలరాం

చీమకుర్తి, ఫిబ్రవరి 8: ప్రముఖ వ్యాపారవేత్త శిద్దా సుబ్బారావుకు గురువారం పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. చీమకుర్తిలో జరిగిన శిద్దా సుబ్బారావు సంస్మరణ సభలో రాజకీయ నాయకులు, గ్రానైట్ వ్యాపారులు, బంధువులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన అందించిన సేవలను కొనియాడారు. కాగా మాజీ మంత్రి శిద్దా సుబ్బారావు సోదరుడు శిద్దా రాఘవరావు, టీటీడీ బోర్డు సభ్యుడు శిద్దా సుధీర్‌కుమార్, ఎమ్మెల్యే కరణం బలరాం, మాజీ ఎమ్మెల్యేలు బీఎస్.విజయ్‌కుమార్, జంకె వెంకటరెడ్డిలు వేర్వేరుగా విచ్చేసి నివాళులు అర్పించి సుబ్బారావు తనయులు శిద్దా సుధాకర్, హనుమంతరావు కుటుంసభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. అలాగే శిద్దా పాండురంగారావు, శిద్దా హనుమంతరావు, శిద్దా సూర్యప్రకాశరావు, సురేష్, బాలాజీ, వెంకటకృష్ణారావు, శిద్దా నాగేశ్వరరావు, ప్రసాద్, శ్రీనివాసరావు, మన్నం ఫణికుమార్, మారం వెంకారెడ్డి, పలువురు గ్రానైట్ వ్యాపారులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ఘుడియపూడికి శ్మశానస్థలం ఏర్పాటుకు కృషి

• భూసేకరణ స్పెషల్ కలెక్టర్ ఝాన్సీలక్ష్మి



కాలనీలోని సమస్యలను తెలుసుకుంటున్న స్పెషల్ కలెక్టర్ ఝాన్సీలక్ష్మి

మద్దిపాడు, ఫిబ్రవరి 8: ఘుడియపూడి కాలనీకి శ్మశాన స్థలం కల్పించేందుకు కృషి చేస్తామని భూసేకరణ స్పెషల్ కలెక్టర్ కె.ఝాన్సీలక్ష్మి పేర్కొన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు ప్రధాన ముంపు గ్రామమైన మద్దిపాడులోని ఘుడియపూడికాలనీని గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొమ్మల రామాంజనేయులు మాట్లాడుతూ గ్రామానికి శ్మశానం లేక దాదాపు దశాబ్దన్నర కాలంగా ఇబ్బందిపడుతున్నట్లు చెప్పారు. ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు గుండ్లకమ్మ కాలువ కట్టపైనే నిర్వహించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశాన స్థల సమస్యపై పలుసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. దీనిపై స్పందించిన స్పెషల్ కలెక్టర్ మాట్లాడుతూ శ్మశానం కోసం అవసరమైన స్థల సేకరణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే కాలనీలోని సమస్యలను ఆరా తీశారు. గ్రామంలో పలుచోట్ల గతంలో నిర్మించిన డ్రైనేజీ కాలువలు నాశిరకంగా నిర్మించడంతో చిధ్రమై అధ్వానంగా మారాయని, దీంతో మురుగు ప్రవహించక దోమలతో గ్రామస్థులు అల్లాడుతున్నారని చెప్పారు. అంతేగాకుండా పారిశుధ్యం లోపిస్తుందని, నూతనంగా డ్రైనేజీ కాలువలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కల్వర్టులు లోతట్టుగా ఉన్నాయని, వాటిని సీసీరోడ్డుకు సమాంతరంగా నిర్మించాలని చెప్పారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటసునీల్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కరిముల్లా, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు హబీబ్, ఇమ్మానియేల్, సర్వేయర్లు శ్రీనివాసులు, శ్రీరాములు, చరణం సురేష్, కనపర్తి వెంకట్రావు పాల్గొన్నారు.

ముగిసిన రిలే దీక్షలు



దీక్షలో పాల్గొన్న రిటైర్డ్ ఉద్యోగులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 8: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక కలెక్టరేట్ ఎదుట ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు గురువారంతో ముగిశాయి. సోమవారం నుంచి అసోసియేషన్ బాధ్యులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ రిలే దీక్షలను ప్రారంభించారు. ప్రతినెల 1వతేదీనే పెన్షన్లు చెల్లించాలని, పెన్షనర్లకు కనీసం డీఏతో కలిసి రూ.9 వేలుగా ప్రకటించాలని, రైల్వే రాయితీలను పునరుద్ధరించాలని, పీఆర్సీ, డీఏ బకాయిలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సింగరాజు శ్రీనివాసరావు, కె.దేవదానం, పి.నాగేశ్వరరావు, బొర్రా వెంకట్రావు, టి.పేరయ్య, ఎస్‌వీ.శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

నేడు గుర్రం జాషువ విగ్రహావిష్కరణ : కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 8 : స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గుర్రం జాషువ కాంస్య విగ్రహాన్ని శుక్రవారం సాయంత్రం ఆవిష్కరించనున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రమంత్రులు, పార్లమెంట్, శాసనమండలి, శాసనసభ సభ్యులు, జడ్పీ చైర్‌పర్సన్, ఒంగోలు మేయర్, డీవీఎంసీ సభ్యులు, జాషువా విగ్రహ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, దళిత, గిరిజన సంఘాల నాయకులను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్ బాధ్యతల స్వీకరణ



శ్రీకాంత్‌ను అభినందిస్తున్న అసోసియేషన్ నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 8: కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏవో)గా కేదారినాథ్ శ్రీకాంత్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసి బొకే అందజేశారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన శ్రీకాంత్‌ను ఏపీ రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆర్‌వీఎస్.కృష్ణమోహన్ ఆధ్వర్యంలో పలువురు బొకే అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ అధ్యక్షుడు ఊతకొలు శ్రీనివాసులు, కార్యదర్శి వెంకటేశ్వరరాజు, కొండపి వెంకటేశ్వర్లు, ప్రశాంత్, ఆదిత్య, తహసీల్దార్ సుజన్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో వ్యవసాయ రంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 8 : రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ బడ్జెట్‌లో వ్యవసాయ రంగాన్ని ప్రభుత్వం విస్మరించిందని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో తొలి మూడు నెలల కాలానికి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ బడ్జెట్‌లో వ్యవసాయ రంగాన్ని, సంక్షేమ రంగాన్ని, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, ప్రత్యేక హోదాను విస్మరించిందన్నారు. తన మాటల గారడి చేశారని విమర్శించారు. బడ్జెట్‌లో వ్యవసాయ, అనుబంధ రంగాల కోసం 2023-24లో 14,043 కోట్లు మాత్రమే కేటాయిస్తే అందులో కేవలం 12,282 కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1426 కోట్లు కేటాయించారని, గత ఏడాది కూాఅన కేవలం రూ.400 కోట్లు మాత్రమే అధికంగా పెంచారని ఆరోపించారు. ఈ నిధులతో వ్యవసాయ రంగం ఏ విధంగా అభివృద్ధి జరుగుతుందని ఆయన ప్రశ్నించారు.

వృద్ధులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 8: ఒంగోలు నగరం కమ్మపాలెంలోని ఆశయం వృద్ధాలయంలో గురువారం వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదాల రామయ్య జ్ఞాపకార్థం ఆయన భార్య విజయకుమారి, కుటుంబసభ్యులు అన్నదానం చేసినట్లు నిర్వాహకురాలు గొను లీలారాణి తెలిపారు. తమ వృద్ధాలయంలో ఎటువంటి ఆదరణ, ఆసరా లేని పలువురు మహిళలకు గత ఆరు సంవత్సరాలుగా ఆశ్రయం కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో దాతల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

10న సత్యహరిశ్చంద్ర నాటకం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ సుజాత

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 8: ఒంగోలు నగరం నెల్లూరు బస్టాండ్‌లోని మునిసిపల్ ఓపెన్ ఆడిటోరియంలో ఈ నెల 10వ తేదీ శనివారం సాయంత్రం సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం నగర మేయర్ గంగాడ సుజాత తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన జిల్లాలో బండారు రామారావు, డీవీ.సుబ్బారావు, చీమకుర్తి నాగేశ్వరరావు, అద్దంకి మాణిక్యాలరావు వంటి ఎంతోమంది పౌరాణిక రంగస్థల నటులు జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేశారని, ప్రస్తుతం పౌరాణిక నాటకాలకు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాల్సిన అవసరం ఉందన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ ప్రముఖ నటీనటులచే ప్రదర్శింపబడుతున్న ఈ నాటకానికి ప్రేక్షకులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అల్లూరు శాంతారావు, ఎం.జయరావు, కె.వెంకటేశ్వర్లు, పీడీ.రవికుమార్, ఉలిచి బాబూరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు నవోదయలో ప్రవేశానికి రాతపరీక్ష

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 8: ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరంలో 9, 11 తరగతులకు ఖాళీల భర్తీకి ఈనెల 10వ తేదీన రాతపరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. 9వ తరగతిలో ప్రవేశానికి 14 సీట్లు ఖాళీగా ఉండగా 727 మంది పరీక్షకు హాజరవుతారని, వీరికి ఒంగోలులోని డీఆర్ఆర్ఎం, రామనగర్ మునిసిపల్ స్కూలు, పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే 11వ తరగతిలో ప్రవేశానికి 664 మంది రాతపరీక్షకు హాజరుకానున్నారు. విద్యార్థులు తమ హాల్ టిక్కెట్లతో పరీక్షకు హాజరుకావాలని ఆయన కోరారు.

ట్యాబ్స్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న డీఈవో సుభద్ర

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 8: ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌లను వినియోగంపై అవగాహన పెంపొందించుకోవాలని డీఈవో డి.సుభద్ర సూచించారు. ఒంగోలులోని సాయిబాబా సెంట్రల్ స్కూలులో సహిత విద్యా టీచర్లకు ట్యాబ్‌ల వినియోగంపై నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిజిటల్ విద్యలో భాగంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు, రిసోర్స్ పర్సన్లకు ట్యాబ్‌ల వినియోగంపై ఒక రోజు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంఈవో కిషోర్‌బాబు, ఏడీ సురేఖ, కో ఆర్డినేటర్ ఎం.రమేష్, రిసోర్స్‌పర్సన్ కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐడీకార్డు లక్ష్యాలపై మాగుంట ప్రశ్న

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 8 : కేంద్రం ప్రవేశపెట్టిన ఒక దేశం ఒక విద్యార్థి ఐడీ కార్డు/ అపార్ కార్డు లక్ష్యాలు, ఆశయాలు, విద్యార్థుల స్వచ్ఛంద సమాచార గోప్యతపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుందని ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి డాక్టర్ సుభాస్‌సర్కార్ సమాధానం ఇస్తూ దేశంలోని విద్యార్థులకు ప్రత్యేకగుర్తింపు కార్డులను అందజేస్తున్నట్లు చెప్పారు. నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ-2020లో భాగంగా దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లోని విద్యార్థుల అకడమిక్ జర్నీ, విద్యాప్రమాణం, విజయాలను జీవితకాలం నమోదు చేసేదే ఒక దేశం ఒక విద్యార్థి ఐడీ కార్డు అని వివరణ ఇచ్చారు.

బ్రిడ్జి నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలి



పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

చీమకుర్తి, ఫిబ్రవరి 8 : చీమకుర్తి నుంచి కేవీపాలెంకు వెళ్లే రహదారిలో శిథిలావస్థకు చేరుకున్న బ్రిడ్జి పునర్నిర్మాణ పనులను దాదాపు రూ.60లక్షలతో చేపడుతున్నారు. ఈ పనుల నిర్వహణ సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు, తదితర సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలను పరిశీలించటానికి గురువారం ఎస్ఎస్‌పీ అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి బ్రిడ్జి, పరిసర ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు అధికారులతో మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరితగతంగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ కన్వీనర్లు పమిడి వెంకటేశ్వర్లు, క్రిస్టిపాటి శేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల నిరసన

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 8: విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు సకాలంలో చెల్లించకపోవడం అన్యాయమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ.కొండారెడ్డి విమర్శించారు. గురువారం ఒంగోలులోని విద్యుత్ భవన్ వద్ద విద్యుత్ సంఘాల స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు నెలాఖరులోగా పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఎస్ఈ సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు డి.రవికుమార్, సీహెచ్.లక్ష్మీనారాయణ, ఎస్.శివనాగబాబు, వి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

12న ఒంగోలు మండల సమావేశం

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి8: ఒంగోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 12న ఉదయం 10గంటలకు జరుగుతుందని ఎంపీడీవో కాపా శ్రీనివాసరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పల్లపోలు మల్లికార్జున రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

విద్యార్థులకు నగదు బహుమతులు



చెక్కును విద్యార్థులకు అందజేస్తున్న జయంత్‌బాబు

టంగుటూరు, ఫిబ్రవరి 8 : పారిశ్రామికవేత్త బెల్లం రామయ్య జ్ఞాపకార్థం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గురువారం నగదు బహుమతులు అందజేశారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన లేళ్లపల్లి అమృతకు రూ.11,116, బొడ్డపాటి సుభితకు రూ.9,116 ప్రముఖ పారిశ్రామికవేత్త బెల్లం జయంత్‌బాబు చెక్కు రూపంలో ఇచ్చారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం తులసీప్రభ, టీడీపీ రైతు నేత బెజవాడ వెంకటేశ్వర్లు, సెక్రటరీ యాకోబు పాల్గొన్నారు.

రేపు చలో పాయకరావుపేట

టంగుటూరు, ఫిబ్రవరి 8 : అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో ఈ నెల 10న జరగనున్న చలో పాయకరావుపేటను విజయవంతం చేయాలని అంబేడ్కర్ ఇండియా మిషన్ కొండపి నియోజకవర్గ ఇన్చార్జ్ నత్తల క్రాంతికుమార్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. అంబేడ్కర్ ఇండియా మిషన్ ఆధ్వర్యాన 10న మధ్యాహ్నం 3గంటలకు పాయకరావుపేట హైస్కూల్ గ్రౌండ్‌లో దళిత వాడ పంచాయతీ సాధన సంకల్ప సభ జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఏఐఎం కుటుంబ సభ్యులంతా తరలిరావాలని కోరారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 8 : బాపట్ల జిల్లాలో ఇటీవల జరిగిన అంతర్రాష్ట్ర తైక్వాండో కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో ఒంగోలులోని హైదరాబాద్ పబ్లిక్ స్కూలు విద్యార్థులు సత్తా చాటారు. వివిధ విభాగాలలో బంగారు పతకాలు, సిల్వర్, బ్రాంచ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక స్కూలులో డైరెక్టర్ జగదీష్, ట్రైనర్ విజయ్ విజేతలను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


బేళ్లలో అన్యపదార్థాలు రాకుండా చూడాలి



పొగాకును పరిశీలిస్తున్న బోర్డు అధికారులు

కొండపి, ఫిబ్రవరి 8 : గ్రేడింగ్ అనంతరం వేలం కేంద్రానికి పొగాకు బేళ్లలో అన్యపదార్థాలు కలవకుండా గ్రేడింగ్ జాగ్రత్తగా చూసుకోవాలని పొగాకు బోర్డు కార్యదర్శి, ఆక్షన్ మేనేజర్ దివి వేణుగోపాల్ సూచించారు. గురువారం కొండపి పొగాకు వేలం కేంద్రం పరిధిలోని ఇలవర (నేతివారిపాలెం) గ్రామంలో పొగాకు క్యూరింగ్, గ్రేడింగ్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పొగాకు రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బోర్డు మెంబర్ బొడ్డపాటి బ్రహ్మయ్య, వేలం నిర్వహణాధికారి గర్నిపూడి సునీల్‌కుమార్, ఎస్‌జీవో సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరు పోలీస్‌స్టేషన్‌లో ఆశావర్కర్లు



ఆశావర్కర్లతో మాట్లాడుతున్న ఎస్సై నాగేశ్వరావు

టంగుటూరు, ఫిబ్రవరి 8 : టంగుటూరు పోలీస్ స్టేషన్‌కు ఆశావర్కర్లను ఎస్సై నాగేశ్వరరావు గురువారం పిలిపించి హెచ్చరికలు చేసి పంపించారు. గురువారం చలో విజయవాడకు వారిని వెళ్లనివ్వకుండా చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వారిలో ఆశావర్కర్ల మండల నాయకురాలు ఏ పూర్ణకామేశ్వరి, టంగుటూరు ఆశావర్కర్లు ఎస్ సుభాషిణి, ఎం.సావిత్రి ఉన్నారు. వీరిచేత సంతకాలు పెట్టించుకొని పంపించారు.

కేంద్ర పథకాలపై ప్రచారం చేయాలి



మాట్లాడుతున్న దయాకరరెడ్డి

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి8: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని ఆ పార్టీ జోనల్ ఇన్‌చార్జి సన్నారెడ్డి దయాకరరెడ్డి పిలుపునిచ్చారు. ఒంగోలులోని బీజేపీ కార్యాలయంలో గురువారం ఒంగోలు, కొండపి, దర్శి అసెంబ్లీ నియోజకవర్గాల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దయాకరరెడ్డి మాటాడుతూ వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లోని ప్రజలను బీజేపీ వైపు మొగ్గు చూపేలా ప్రతి ఇంటికి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి వ్యక్తిని పరిచయం చేసుకొని వారి సమస్యలు తెలుసుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.శివారెడ్డి, నాయకులు రవిశంకర్, పి.కృష్ణారెడ్డి, శెగ్గెం శ్రీనివాసరావు, వైసీ.యోగయ్యయాదవ్, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లతో బదిలీల బంతాట!

నాలుగు రోజులలోపు సింగరాయకొండలో ముగ్గురు మార్పు ● వైసీపీ నేతల ఒత్తిళ్లలో భాగంగానేనని చర్చ



సింగరాయకొండ, ఫిబ్రవరి 8 : రానున్న ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో చేపడుతున్న తహసీల్దార్‌ల బదిలీలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత నాలుగు రోజులుగా జరుగుతున్న ఈ తతంగం చూస్తుంటే వారితో రాజకీయ బంతాట ఆడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొన్నటి వరకు సింగరాయకొండ తహసీల్దార్‌గా పనిచేసిన ఉష పల్నాడు జిల్లా సత్తెనపల్లెకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో తిరుపతి జిల్లా పెళ్లకూరు నుంచి వచ్చిన ఎస్. రామయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను మార్చాలని స్థానిక అధికారపార్టీ నేతలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మరలా ఆయన స్థానంలో గుంటూరు జిల్లా కాకుమాను తహసీల్దార్ జయప్రసాద్‌రావును సింగరాయకొండకు కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో ఆయన బుధవారం కార్యాలయానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మండల వైసీపీలో కీలక నేతను కలిశారు. దీంతో ఆ పార్టీలో ఉన్న రెండో వర్గం నాయకులు అతన్ను మార్చాలని మంత్రి దగ్గర పట్టుబట్టినట్లు సమాచారం. ఈ పరిణామాల నడుమ మద్దిపాడు నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన భవానీ శంకర్‌ను గురువారం సింగరాయకొండకు బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన సాయంత్రం కార్యాలయానికి వచ్చి బాధ్యతలు స్వీకరించకుండా సిబ్బందితో భేటీ అయ్యి వెనుదిరిగారు.

భూములు కొట్టేసేందుకేనని చర్చ..

సింగరాయకొండలో నాలుగురోజుల్లో వెంటవెంటనే ముగ్గురు తహసీల్దార్ల మార్పు జరగడం వెనక వైసీపీ నేతల పెద్ద కుట్రే ఉన్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. మండల కేంద్రంలో రూ.కోట్ల విలువచేసే ప్రభుత్వ భూములు ఉన్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వాటిని అధికారపార్టీ నేతలు హస్తగతం చేసుకోవటానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. పలుమార్లు వాటిని ఆక్రమించుకొని అమ్మకాలు చేపట్టానికి సిద్ధమయ్యారు. పత్రికల్లో కథనాలు రావడం, రెవెన్యూ అధికారుల జోక్యంతో అప్పట్లో వెనక్కి తగ్గారు. త్వరలో ఎన్నికల జరగనున్న నేపథ్యంలో ఈలోపు తమ మాట వినే అధికారులను తెచ్చుకొని భూములు కొట్టేసే పనిలో వైసీపీ నేతలు ఉన్నట్లు వినికిడి. అంతర్గత కుమ్ములాటలతో అతలాకుతలమవుతున్న వైసీపీ నేతల కోర్కెలను తీర్చి తనవైపు తిప్పుకోవటానికి వారి ప్రతిపాదనలకు మంత్రి సురేష్ సైతం తలొగ్గారని ప్రచారం నడుస్తోంది.

సాగర్ నీటి సరఫరాలో నిర్లక్ష్యం

- బడ్జెట్‌లో అంచనాలు కొండంత..
- రెట్టింపు అయిన అప్పులు
- గుండ్లకమ్మ ప్రాజెక్టు ముంపు గ్రామాల సమస్యలప్రస్తావనే లేకపోవటం బాధాకరం
- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్



అద్దంకి, ఫిబ్రవరి 8: సాగర్ నీటి సరఫరా ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతుందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ధ్వజమెత్తారు. బుధవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన రాష్ట్ర బడ్జెట్ పట్ల జగన్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో వ్యవహరించిందన్నారు. ఈమేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బడ్జెట్ ప్రసంగంలో అన్ని రంగాలలో ప్రగతి పురోగమిస్తుందని ప్రభుత్వం చెప్పు కోవటం సిగ్గుచేటన్నారు. బడ్జెట్ అంచనాలు కొండంత, ఖర్చులు పిసరంతగా ఉన్నాయన్నారు. రూ.13 వేల కోట్ల రెవెన్యూ లోటును రూ.44 వేల కోట్లకు, రూ.35 వేల కోట్ల ద్రవ్యలోటును రూ.60 వేల కోట్లకు పెంచిన ఘనత బుగ్గనదేనన్నారు. పన్నుల బాదుడు తప్ప బడ్జెట్‌లో కొత్త అంశాలు ఏమి లేవని చెప్పారు. వైసీపీ హయాంలో అప్పులు రెట్టింపు అయ్యాయన్నారు. రాష్ట్రాన్ని వైసీ పీ ప్రభుత్వం అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చిందన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి స్కీమ్ ఓ స్కామ్‌గా మారిందన్నారు. ధరల పెంపు, పన్నులు మోయలేని భారంగా మారాయన్నారు. రైతుల ఆత్మహత్యలలో దేశంలో మన రాష్ట్రం ముందు వరుసలో ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వ తప్పుడు విధానాల వల్ల తెలంగాణ రాష్ట్ర ఆదాయం పెరిగి, ఏపీ ఆదా యం తగ్గిందన్నారు. కేంద్రం నుంచివచ్చిన నిధులను దారి మళ్లిం చిందన్నారు. సాగర్ ఆయకట్టు పరిధిలో లక్షలాది ఎకరాలు బీడులుగా వదిలేసి రైతులు కూలీలుగా మారారని ఎమ్మెల్యే రవికుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. వెలుగొండకు నీరు వస్తే పశ్చిమ ప్రకాశం జిల్లా నీటి ఎద్దడి తీరుతుందని ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. అయితే, బడ్జెట్‌లో వెలుగొండ కు కేటాయింపులు తక్కువగా ఉండటంతో పూర్తిగా ప్రాజెక్టు మనుగడకే ముప్పు ఏర్పడిందన్నారు. వెలుగొండను పూర్తి చేయటంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు ముంపు గ్రామాల సమస్యల ప్రస్తావనే లేకపోవటం బాధాకరమని రవి కుమార్ పేర్కొన్నారు.

బడ్జెట్ కొండంత..విడుదల పిసరంత

- అప్పులాంధ్రప్రదేశ్‌గా మార్చిన వైసీపీ ప్రభుత్వం
- ఎమ్మెల్యే ఏలూరి ధ్వజం



సాంబశివరావు

పర్చూరు, ఫిబ్రవరి 8: ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్లో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అంకెలను మసిపూసి మారేడుకాయ చేసి అంకెల గారడి చేశారని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఈమేరకు గురువారం ఓప్రకట విడుదలచేశారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం గొప్పలు చెప్పేందుకు కొన్ని అంకెలు పెంచి చూపారన్నారు. ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తున్నామని చాటు కునేందుకు రెవెన్యూ లోటును తగ్గించి చూపారని ఏలూరి మండిపడ్డారు. చేసిన అప్పులను చెల్లించే పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేదన్నారు. రూ.13వేల కోట్ల రెవెన్యూ లోటును రూ.44 వేల కోట్లకు, రూ.35వేల కోట్ల ద్రవ్యలోటును రూ.60వేల కోట్లకు పెంచిన ఘనుడు బుగ్గన అన్నారు. వైసీపీ ప్రభుత్వం 2019-20లో రూ.1.80 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టారని, 2024-25కి రూ.2.86 లక్షల కోట్లు దాటడం అసమర్థ ఆర్థిక నిర్వహణకు నిదర్శనమన్నారు. అయిదేళ్లలో సగటు రెవెన్యూ ఆదాయం పెరిగినా, వైసీపీ ప్రభుత్వం చేతకాని తనం వల్ల రెవెన్యూ లోటు, ద్రవ్యలోటు భారీగా పెరిగాయని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. వాస్తవ మూలధన వ్యయం తక్కువగా ఉందని, ఆస్తుల కల్పనే లేదని చెప్పారు. అప్పులపై వడ్డీ కట్టలేని దుస్థితికి రాష్ట్రాన్ని తీసుకువచ్చారన్నారు. కార్పొరేషన్‌ల రుణాలు పెరిగినా ఆదాయాలు లేవన్నారు. పన్నుల బాదుడు తప్ప బడ్జెట్‌లో కొత్త అంశాలు ఏమీ లే వన్నారు. ప్రస్తుతం ఏపీ అప్పులు రూ.11.58 లక్షల కోట్లు అన్నారు. మద్యం బాండ్లు రూ.16,000 కోట్లు, కార్పొరేషన్ హామీలు రూ.1,10,603 కోట్లు, కార్పొరేషన్ తనఖాలు రూ.94,928 కోట్లు, డిస్కమ్ బకాయిలు రూ.27,284 కోట్లు, కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు 95,400 కోట్లు, అప్పులు రెట్టింపు అయ్యాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వం తీసుకున్న దానికంటే 4 రెట్ల అప్పు వైసీపీ చేసిందన్నారు. వైసీపీ హయాంలో అప్పుల భారం తప్ప మరీ ఏమీ లేదన్నారు. రిజిస్ట్రేషన్‌లు భారీగా పెంచిన జగన్ సర్కార్, విద్యుత్ చార్జీల వడ్డనలో కూడా ఎక్కడా రాజీపడలేదన్నారు. ఇప్పటికే విద్యుత్ చార్జీలను ఏడుసార్లు పెంచి, సర్‌చార్జీల పేరుతో మరింతగా వడ్డింపు వ డ్డించిందన్నారు. మద్యం మీద వచ్చే డబ్బుతో జగన్ ప్రభుత్వం నడుస్తుం దన్నారు. ఆరోగ్య శ్రీకి బడ్జెట్‌లో నిధులు అంతంత మాత్రమేనన్నారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను రద్దుచేసిందన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం రద్దుచేయటంతోపాటు, 35 లక్షల పొదుపు గ్రూపులకు బడ్జెట్‌లో మొండిచేయి చూపిందన్నారు. రైతు ప్రభుత్వ అని గొప్పలు చెప్పుకుంటూ రైతు భరోసా లబ్ధిదారుల సంఖ్యను తగ్గించి మోసం చేశారన్నారు. సబ్‌ప్లాన్ నిధులు రూ.75వేల కోట్లు దారి మళ్లించి, 30 పథకాల రద్దు చేసిన ఘనత జగన్ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు..యువకుడు మృతి

మార్టూరు, ఫిబ్రవరి 8: మండలంలోని బొల్లపల్లి కాలువ సమీపంలో జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాన్ని వెనుకనుంచి కారు ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతి చెందాడు. మరో ఇద్దరికి గాయాలైన సంఘటన గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఈప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకుల లో షేక్ నాగూర్‌వలి అలియాస్ గాంధీ(26) సంఘటనా స్థలంలో మృతి చెందాడు. మరో ఇద్దరు యువకులు ఎస్‌కే.నసీర్, టి.హరీష్‌కు గాయాలయ్యాయి. ఈ ముగ్గురు జె.పంగులూరు మండలం రామకూరు గ్రామానికి చెందిన వారు. అందిన సమాచారం మేరకు.. ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై రామకూరు నుంచి మార్టూరులో సినిమా చూడడానికి వెళ్తేక్రమంలో సాగర్ కాలువ పక్కన రోడ్డు గుండా జాతీయ రహదారిపైకి వచ్చారు. అదే సమయంలో ఒంగోలు వైపు నుంచి బొల్లాపల్లి టోల్‌గేట్ దాటిన కారు వేగంగా వస్తూ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈప్రమాదంలో ముగ్గురు యువకులు రోడ్డుపై పడిపోయారు. వారిలో నాగర్ వలి తల రోడ్డు బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నాగూర్ వలి తండ్రి గతంలోనే చని పోగా, తల్లి దివ్యాంగురాలు. అతను గుంటూరులోని ఒక ప్రైవేట్ బ్యాంక్‌లో పని చేస్తున్నాడు. గాయపడిన నసీర్ అనే యువకుడు ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ప్రమాదానికి గురైన కారులో గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం జగ్రవూరుకు చెందిన ఎస్.జయన్నారాయణ, కొండపి మండలం పోరిరెడ్డిపాలెంకు చెందిన కె.శివన్నారాయణ ప్రయాణిస్తున్నారు. సమాచారం అందగానే ఏఎస్ఐ సైదా, బాషా సంఘటనాస్థలాన్ని పరిశీలించి 108లో మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. నాగూరువలి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు వైద్యశాలకు పోలీసులు తరలించారు.

ఎర్రగొండపాలెంలో వృద్ధురాలి దారుణ హత్య

● రాళ్లవాగు పొదల మధ్య మృతదేహం

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 8: వృద్ధమహిళ హత్యకు గురైన ఘటన ఎర్రగొండపాలెంలోని అంబేడ్కర్‌నగర్ సమీపంలో చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అంబేడ్కర్‌నగర్‌కు చెందిన తూమాటి చెన్నమ్మ(82) బుధవారం సాయంత్రం నుంచి ఇంటిలో కన్పించలేదు. దీంతో కుటుంబ సభ్యులు బుధవారం రాత్రంతా పరిసరాలలో వెతికారు. అయితే అంబేడ్కర్‌నగర్ పక్కనే ఉన్న రాళ్లవాగు చెట్ల మధ్య ఆమె విగతజీవిగా పడి ఉంది. దీన్ని గుర్తించిన స్థానికులు గురువారం ఉదయం పోలీసులకు తెలిపారు. ఘటన స్థలంలో చెన్నమ్మ తలపై రాళ్లదెబ్బలు ఉన్నాయి. దుస్తులు కూడా సక్రమంగా లేవు. దీంతో ఆమెను ఎవరో హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఘటనా స్థలంలో చెన్నమ్మ తలపై, ముఖంపై గాయాలున్నాయి. ఎవరైనా మద్యం మత్తులో హత్య చేసి ఉంటారా..? అని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు చెన్నకేశవులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేసినట్లు సీఐ రాములునాయక్ తెలిపారు. ఈ ఘటనపై మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి పర్యవేక్షణలో సీఐలు రాములునాయక్, ఎ.వెంకటేశ్వర్లు, ఎస్ఐ సుదర్శన్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వైద్యశాలకు తరలించి మార్చురి గదిలో ఉంచారు. శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. జిల్లాకేంద్రం నుంచి క్లూస్ టీంలను, డాగ్‌స్క్వాడ్‌ను పిలిపించి ఘటనా స్థలంలో పరిశీలించారు. పోస్టుమార్టం అనంతరం పూర్తి విషయాలు వెలుగులోనికి వస్తాయని డీఎస్పీ తెలిపారు.

దళారుల చేతిలో రైతులు మోసపోవద్దు : జేసీ



మాట్లాడుతున్న జేసీ మురళీకృష్ణ

పొదిలి, ఫిబ్రవరి 8 : రైతులు పండించిన పంటను దళారుల చేతిలోపెట్టి మోసపోవద్దని జేసీ గోపాలకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని పాములపాడులో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ఆరు గాలం కష్టించి పండించిన పంటను అమ్ముకునే సమయంలో దళారులను ఆశ్రయించి నష్టపోవద్దన్నారు. జిల్లాలో ఎక్కువ కందిపైరు పొదిలి ప్రాంతంలోనే సాగు చేస్తున్నారన్నారు. దీంతో మండలంలో మొదటిగా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. త్వరలో జిల్లాలో అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ప్రారంభిస్తామన్నారు. నాణ్యమైన పంటను రైతులు ప్రభుత్వానికి అందించడం ద్వారా ప్రభుత్వం సరఫరా చేసే కేంద్రాలకు మంచి పుష్టికరమైన పప్పును ప్రజలకు అధించేందుకు వీలుంటుదన్నారు. 'సీడ్ టూ సేల్' ద్వారా కందులు కొనుగోలు చేసి వాటిని శుద్ధిచేస్తామని చెప్పారు. అనంతరం సివిల్ సప్లై ద్వారా కందిపప్పును ప్రజలకు పంపిణీ చేయడంతోపాటు, అంగన్‌వాడీ, ప్రభుత్వం హాస్టల్స్‌కు అందజేస్తామన్నారు. ప్రభుత్వ రేటుగా రూ.7500 చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆరబెట్టుకొని రైతులు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. తేమ 12శాతంగా, దెబ్బతిన్న గింజలు 2శాతంగా, ఇతరపప్పు గింజలు 3 శాతంగా ఉండవచ్చన్నారు. అంతేగాకుండా నాణ్యమైన పంటను అమ్ముకునే సమయానికి బహి రంగ మార్కెట్‌లో ఎంత ధర ఉంటే ఆ ధరను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.7500లు అయినా ఈరోజు ప్రారంభ సమయానికి బహిరంగ మార్కెట్ రూ.10295 ఉందని ఆ ధర ప్రకారం రైతులుకు చెల్లిస్తామని చెప్పారు. కావున దళారుల వద్దకు వెళ్లి నష్టపోకుండా కేంద్రాల్లోనే పంటను అమ్ముకోవాలని సూచించారు. ప్రకృతివైపరిత్యాలు, ధరల్లో వ్యత్యాసం ఉన్నప్పుడు ధాన్యాన్ని నిల్వలు చేసుకునేందుకు ప్రభుత్వ గోడౌన్‌లు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో ఉదయబాస్కర్, సివిల్‌సప్లై డీఎం సత్యనారాయణ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు, సీఈవో పోలిశెట్టి రాజశేఖర్, ఏడీఏ బాలాజీనాయక్, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు కందుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

29లోపు కార్మికశాఖ లైసెన్సులు పొందాలి

● సహాయ కార్మిక కమిషనర్ కనకదుర్గాభవానీ

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 8: రాష్ట్ర కార్మిక చట్టాల ప్రకారం కార్మికులు ఉన్న, సొంత వ్యాపారాలు కలిగిన వారు ఈ నెల 29వ తేదీలోపు కార్మిక శాఖ నుంచి తప్పనిసరిగా లైసెన్సులు పొదాలని సహాయ కార్మిక కమిషనర్ కె.కనకదుర్గాభవానీ సూచించారు. గురువారం ఒంగోలులోని బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌లో మార్కెట్ కమిటీ ప్రెసిడెంట్ కోడూరి సత్యనారాయణ, సెక్రటరీ ఎస్.ఆర్.యం.శ్రీనివాసరావు, బియ్యపు వరదరాజం, టౌన్ కిరాణా, ప్రొవిజన్ మర్చంట్స్ అసోసియేషన్, ఎలక్ట్రానిక్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ తదితర వ్యాపార సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపార సంస్థల యజమాని నేరుగా తమ కార్యాలయం, లేదా దగ్గరలోని సచివాలయం, మీ సేవ కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకుని లైసెన్స్ పొంద వచ్చన్నారు. కార్యక్రమంలో సహాయ కార్మిక శాఖ అధికారులు ఎం.వెంకటేశ్వర్లు, ఎం.ఎలిజబెత్తమ్మ, వివిధ సంఘాల ప్రతినిధులు ఎం.తిరుపాలు, సీహెచ్.రాధాకృష్ణ, బియ్యపు వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టిన కేంద్రం

దొనకొండ, ఫిబ్రవరి 8 : వ్యవసాయ రంగాన్ని కాపాడుతామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం కార్పొరేటర్లకు అప్పజెప్పి సంక్షోభంలోకి నెట్టిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కర్నా హనుమయ్య అధ్యక్షతన దొనకొండలో గురువారం గ్రామీణ బంద్ సన్నాహక సమావేశం నిర్వహించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని అధికారంలోకి వచ్చిన మోదీ అన్నదాతల ఆత్మహత్యలను పెంచారని కంకణాల ఆరోపించారు. రైతు వ్యతిరేఖ చట్టాలు తెచ్చిన కేంద్రంపై ఏడాదికిపైగా రైతులు పోరాడితే మోదీ తలవంచారన్నారు. ఈనెల 16న చేపట్టే గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కంకణాల పిలుపునిచ్చారు. సమావేశంలో చిరుపల్లి అంజయ్య, ఎం.అంజిబాబు, ఎం.సంతోష్ పాల్గొన్నారు.

నగదు బ్యాగు అపహరణ

అద్దంకి, ఫిబ్రవరి 8: కలెక్షన్ బాయ్ వద్ద బ్యాగ్‌ను దొంగ చోరీ చేశాడు. స్థానికుల కథనం మేరకు.. అద్దంకి పట్టణంలోని పాత గాంధీబొమ్మ సెంటర్‌లో చిన్ని ప్రసాద్ దుకాణంలో గుమస్తాగా పనిచేసే గార్లపాటి శ్రీనివాసరావు గురువారం రాత్రి షాపుల వద్ద బకాయిల వసూలు కోసం భవానీసెంటర్‌లో ఓ దుకాణం వద్దకు వెళ్ళాడు. దుకాణం వ్యక్తి వద్ద నగదుకు సంబంధించి ఓచర్ పరిశీలిస్తుండగా వెనుక నుంచి నెత్తిన టోపి పెట్టుకున్న యువకుడు వచ్చి క్యాష్ బ్యాగ్‌ను లాక్కొని మోటార్‌సైకిల్‌పై దర్శి రోడ్డులో వెళ్ళిపోయాడు. వెంటనే కేకలు వేసినప్పటికి అప్పటికే అక్కడ నుంచి పారిపోయాడు. దుకాణంలో అమర్చిన సీసీ కెమెరాలలో చోరీకి సంబంధించిన దృశ్యాలు రికార్డు అయ్యాయి. క్యాష్ బ్యాగ్‌లో సుమారు రూ.20 వేలు ఉన్నాయి. ఇదే తరహాలో గత ఏడాది ఆయిల్ మిల్ రోడ్డు, ఎస్‌బీఐ రోడ్డులో కూడా కలెక్షన్ బాయ్స్ వద్ద క్యాష్ బాగ్‌ల చోరీలు జరిగాయి.

పొలాల్లోకి దూసుకుపోయిన కారు

అద్దంకి, ఫిబ్రవరి 8: కారు అదుపుతప్పి పల్టీలు కొడుతూ పొలాల్లోకి దూసుకుపోయింది. అందులో ఉన్న తల్లీకొడుకులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. ముండ్లమూరు మండలం మారెళ్లకు చెందిన చుండి విజయభాస్కరరెడ్డి అద్దంకిలో స్థిరపడి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. తల్లి సీతారావమ్మ(94)ను కారులో ఒంగోలులో వైద్య శాలలో పరీక్షలు చేయించుకొని తిరిగి అద్దంకి వస్తున్నారు. ఈక్రమంలో గురువారం సాయంత్రం బలరామకృష్ణాపురం పునరావాసకాలనీ క్రాస్‌రోడ్డు సమీపంలో నామ్ రోడ్డుపై ఒక్కసారిగా కారు అదుపుతప్పి పల్టీలు కొడుతూ రోడ్డు మార్జిన్‌లో గుండా పొలాల్లోకి దూసుకెళ్లి ఆగిపోయింది. కారులో ఉన్న ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వెంటనే స్నేహితులకు సమాచారం ఇవ్వటంతో వేరొక వాహనంలో అద్దంకిలోని ప్రయివేట్ వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందారు. కారు పూర్తిగా దెబ్బతినగా, ఇద్దరికి స్వల్ప గాయాలతో బయటపడటంతో ఊపిరిపీల్చుకున్నారు.

బాధ్యతలు స్వీకరించిన సొసైటీ పాలకవర్గం

పంగులూరు, ఫిబ్రవరి 8: జాగర్లమూడివారిపాలెం పీఏసీఎస్ అధ్యక్షుడిగా జాగర్లమూడి వెంకటరత్నం బాధ్యతలు స్వీకరించారు. గురువారం ముప్పవరంలోని సొసైటీ కార్యాలయంలో ఇన్‌చార్జ్ సీఈవో మోహనకృష్ణ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. పాలకవర్గ సభ్యులుగా పూసల హనుమంతరావు, బండి ఓబుల్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో పానెం నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ముప్పవరం సర్పంచ్ రౌతు సాంబశివరావు, ఎంపీటీసీ పూసల గంగాధర్, జాగర్లమూడి యల్లమందరావు పాల్గొన్నారు.

సెయింట్‌ఆన్స్ అధ్యాపకుడికి డాక్టరేట్

చీరాల, ఫిబ్రవరి 8: సెయింట్ ఆన్స్ కళాశాల ట్రిపుల్‌ఈ విభాగ అ ధ్యాపకుడు ఆంతోనిరాజ్ డాక్టరేట్ పొందారు. గురువారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు మాట్లాడుతూ ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించేవిధంగా చేపడుతున్న చర్యలను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణుగోపాలరావు మాట్లాడుతూ ఏ మాగ్జిమమ్ పవర్ హార్వె స్టింగ్ ఫర్ ఫోటో వోల్టాయిక్ సిస్టమ్ అండర్ పేస్టల్ షేడింగ్ కండిషన్స్ యూ జింగ్ ఏఐ టెక్నిక్స్ అనే అంశంపై పరిశోధన చేసి ఆంతోనిరాజ్ డాక్టరేట్ పొందారన్నారు.

71 విద్యుత్ కేసుల నమోదు

మేదరమెట్ల, ఫిబ్రవరి 8: విద్యుత్ శాఖ అధికారులు తనిఖీలు చేసి 71 కేసులు నమోదు చేసి రూ.5లక్షల 84 వేలు అపరాధ రుసుం విధించినట్లు ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. కొరిశపాడు మండలంలోని 12 గ్రామాలలో విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఒకరు దొంగతనంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు గుర్తించి రూ.లక్ష, 2 బాక్ బిల్లింగ్ కేసులకు రూ.లక్ష, అదనపు లోడు వాడుతున్న 64 సర్వీసులకు రూ.3 లక్షల నాలుగు వేలు, శాంక్షనేతర కేటగిరీలో విద్యుత్ వినియోగిస్తున్న నలుగురికి రూ.80 వేలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈఈలు సత్యనారాయణ, సు రేంద్రబాబు, డివిజన్ పరిధిలోని ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

కాకాని హనుమంతరావుకు నివాళి

అద్దంకి, ఫిబ్రవరి 8: ప్రముఖ వ్యాపారి కాకాని హనుమంతరావుకు పలువురు నివాళులర్పించారు. అద్దంకి పట్టణం కాకానిపాలెంలో హనుమంతరావు దశదిన కర్మ జరిగింది. అద్దంకి, చీరాల ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, కరణం బలరామ కృష్ణమూర్తి, వైసీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్, శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య కాకాని చిత్ర పటం వద్ద నివాళులర్పించారు.

మీ బిడ్డగా ఆశీర్వదించండి

- టీడీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి
- వీరన్నబావి వీధిలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం


ఆర్యవైశ్యుల సమావేశంలో అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 8 : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తాను తెలుగుదేశం, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేయనున్నాని, 'మీ బిడ్డగా నన్ను ఆదరించండి' అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని వీరన్నబావి వీధిలోని సీతారాముల వారి ఆలయంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పాల్గొన్న అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో తాను గిద్దలూరు పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, తాగునీటి సమస్య పరిష్కారానికి చొరవచూపానన్నారు. ఫించన్లు, రేషన్‌కార్డులు, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సహాయం చేసినట్లు తెలిపారు. తాను ఎల్లప్పుడూ గిద్దలూరులోనే నివాసం ఉంటానని, మీ ఇంటి బిడ్డగా ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తానని పేర్కొన్నారు. తనకు మద్దతుగా నలిచి సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు చీతిరాల నాగార్జున, శివపురం అనంత రామయ్య, శివపురం వెంకటరామమయ్య, చీతిరాల రవి, ప్రసాద్, విఠా సుబ్బారావు, విఠా రాజారావు, విఠా సుబ్బరత్నం, దమ్మాల నాగయ్య, గంగిశెట్టి రామయోగయ్య, చీతిరాల ప్రభాకర్, నటుకుల శ్రీను, తుమ్మలపెంట శ్రీనివాసులు, ఊటుకూరి గోపాలక్రిష్ణ, పట్టణ మాజీ అధ్యక్షులు దప్పిలి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పాలుగుళ్ళ ప్రతాపరెడ్డి, వైసీపీ నాయకులు దుత్తా బాలీశ్వరయ్య, పాముల వెంకటరమణయాదవ్, పట్టణ కౌన్సిలర్లు బిల్లా రమేష్‌యాదవ్, చంద్రశేఖర్‌యాదవ్, మండ్ల శ్రీను, చుండి వెంకటరమణ, ఆరవీటి సుబ్రహ్మణ్యం, వాడకట్టు శివప్రసాద్, గర్రె సాయినాథ్ పాల్గొన్నారు.

అంకెల గారడీగా బడ్జెట్

గిద్దలూరు టౌన్ : శాసనసభలో రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రరెడ్డి ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా అంకెల గారడీగా ఉందని, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆరోపించారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత లేకుండా బడ్జెట్ అంకెల గారడీగా ఉందని పేర్కొన్నారు. రూ.13వేల కోట్ల రెవెన్యూ లోటును రూ.44వేల కోట్లకు, రూ.35వేల కోట్ల ద్రవ్యలోటును రూ.60వేల కోట్లకు పెంచిన ఘనత ఈ ప్రభుత్వానిదే అన్నారు. పన్నుల బాదుడు తప్ప బడ్జెట్‌లో కొత్త అంశాలు కానరాలేదని, ఆంధ్రప్రదేశ్ అప్పులు రూ.11.58 లక్షల కోట్లుగా ఉందన్నారు. మద్యం బాండ్లు రూ.16వేల కోట్లు, కార్పొరేషన్ హామీలు రూ.1,10,603 కోట్లు, కార్పొరేషన్ తనఖాలు రూ.94,928 కోట్లు, డిస్కమ్ బకాయిలు రూ.27,284 కోట్లు, కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు రూ.95,400 కోట్లు ఉన్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర అప్పులు రెట్టింపు అయ్యాయన్నారు. 2019 టీడీపీ ప్రభుత్వ హయాంలో తీసుకున్న దాని కంటే నాలుగురెట్లు అప్పు అధికంగా ప్రస్తుత వైసీపీ చేసిందన్నారు. పన్నుల భారం ప్రజలనెత్తిన పెట్టారన్నారు. రిజిస్ట్రేషన్, విద్యుత్‌చార్జీల పెంపులో రాష్ట్ర సర్కారు ముందుందన్నారు. జగనన్న విద్యాదీవెనలో 7లక్షల మంది విద్యార్థుల కోత విధించిందన్నారు. నాశిరకం మద్యంతో 30వేల మందిని దుర్మార్గపు సర్కారు పొట్టనబెట్టుకుందన్నారు. అంతేకాక ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం రద్దు, 35లక్షల పొదుపు గ్రూపులకు బడ్జెట్‌లో మొండిచేయి చూపారన్నారు. రైతుభరోసా ద్వారా లబ్ధిదారుల సంఖ్య తగ్గింపు, సున్నావడ్డీ, పంట రుణాలను 5 లక్షల మంది నుంచి 3లక్షలకు కుదించారన్నారు. ఇలా బడ్జెట్‌లో ప్రజా సంక్షేమానికి తూట్లు పొడిచి రాష్ట్ర ప్రజలపై భారం మోపడమే ప్రస్తుత ప్రభుత్వ విధానమని విమర్శించారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్ యాదవ్, టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, సయ్యద్‌షాన్వావలి, రాష్ట్ర బీసీ కార్యదర్శి బైల డుగు బాలయ్యయాదవ్, రాష్ట్ర కాపుసంఘం పొలిటికల్ కన్వీనర్ దుత్తా బాలీశ్వరయ్య, కౌన్సిలర్లు చంద్రశేఖర్ యాదవ్, బిల్లా రమేష్, మైనారిటీ నాయకులు షేక్ జాఫర్, వేములపాటి చంటి, తదితరులు పాల్గొన్నారు.


భవిష్యత్ గ్యారెంటీ బాండ్లు అందజేస్తున్న విఘ్నేష్‌రెడ్డి

మాలపాటిపల్లిలో భవిష్యత్‌కు గ్యారెంటీ

మార్కాపురం రూరల్: మండలంలోని మాలపాటిపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం టీడీపీ ఆధ్వర్యంలో 'బాబుష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుమారుడు విఘ్నేష్‌రెడ్డి కార్యకర్తలతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. యువతకు ఉద్యోగాలు రావాలన్నా, రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలన్న టీడీపీ జనసేన ప్రభుత్వం రావాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జవ్వాజి రామానుజులరెడ్డి, టీడీపీ నాయకులు జంకె రమణారెడ్డి, దూదేకుల మస్తాన్, గ్రామ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

పొదిలి, ఫిబ్రవరి 8 : రెండు వేర్వేరు కేసుల్లో జామీను పొందేందుకు తప్పుడు ఆస్తి ధ్రువపత్రాలు సమర్పించారని తేలడంతో న్యాయవాదిపై పొదిలి పోలీస్ స్టేషన్‌లో మరో మూడుకేసులు నమోదు చేసినట్లు, ఏఎస్ఐ రంగారావు గురువారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గతంలో తప్పుడు ఆస్తి ధ్రువపత్రాలు సమర్పించిన న్యాయవాది మరోసారి తప్పుడు పత్రాలు సమర్పించారు. పొదిలి పోలీస్ స్టేషన్‌లో ఒకకేసు, మర్రిపూడిపోలీస్ స్టేషన్‌లో ఒకకేసుకు సంబంధించి నిందితులు జామీను పొందేందుకు జామీనుదారుల తప్పుడు ఆస్తి ధ్రువపత్రాలు పొదిలి జేఎఫ్‌సీఎం కోర్టులో న్యాయవాది సమర్పించారు. అవి ఇటీవల విచారణలో తప్పుడు ఆస్తిపత్రాలుగా తేలింది. దీంతో పొదిలి కోర్ట్ సూపరింటెండెంట్ ఫిర్యాదు మేరకు మూడు క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. న్యాయవాదితోపాటు, మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలి

గిద్దలూరు, ఫిబ్రవరి 8 : ఆర్టీసీ బస్సులు, ఆటోల కారణంగా ఏర్పడుతున్న ట్రాఫిక్‌కు ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని బీజేపీ నాయకులు స్థానిక పోలీసులను కలిసి వినతిపత్రం అందజేశారు. కంభం, ఆకవీడు, తదితర రూట్లకు వెళ్లే బస్సులు, ఆటోలు కృష్ణథియేటర్ సమీపంలో రివర్స్ చేసుకుని అక్కడే రోడ్డుపైనే నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవడంతో తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో మార్కెట్‌యార్డు సమీపంలోని బస్, ఆటో స్టాపులను ఏర్పాటు చేయించాలని కోరారు. అలాగే రాజుపాలెం, కొమరోలు ప్రాంతాలకు వెళ్లే బస్సులు సైతం పట్టణంలోని నరవ బస్టాండ్‌లో ఆగడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో కాశిరెడ్డికుంట సమీపంలో స్టాపింగ్ ఏర్పాటు చేయాలని కిసాన్‌మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పిడతల రమేష్‌రెడ్డి, అసెంబ్లీ కోకన్వీనర్ రాములు, ఓబీసీ మోర్చ కార్యదర్శి బాదుల్లా, ఉపాధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, సీఐని కలిసి వినతిపత్రం అందజేశారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యం పట్టివేత


వాహనాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 8 : అక్రమంగా తరలిస్తున్న 27 క్వింటాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు గ్రామ సమీపంలో గురువారం సీజ్ చేశారు. పెద్దారవీడు మండలం సుంకేసుల గ్రామం నుంచి త్రిపురాంతకం వైపునకు వెళుతున్న వాహనంలో 54 పీడీఎస్ బియ్యం బస్తాలను అక్రమంగా తరలిస్తున్న సమాచారంతో తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్నారు. రేషన్‌బియ్యం అక్రమంగా తరలిస్తున్న వారిపై పెద్దారవీడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలో సివిల్ సప్లై ఈడీటీ ఏ తిరుపతిరెడ్డి, విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ రాఘవరావు, ఎస్సై నాగేశ్వరరావు, వెంగల్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

యడవల్లి సర్పంచ్ పేరమ్మ మృతి


నివాళి అర్పిస్తున్న అశోక్‌రెడ్డి

రాచర్ల, ఫిబ్రవరి 8 : మండలంలోని యడవల్లి సర్పంచ్ భవనం పేరమ్మ (80) మృతి చెందారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న పేరమ్మ గురువారం తెల్ల వారుజామున మృతిచెందారు. మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేరమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళ్లు అర్పించారు. ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

నాటుసారా స్వాధీనం

- అదుపులో ముగ్గురు నిందితులు


పట్టుబడ్డ నల్లబెల్లం, నాటుసారా

కొమరోలు, ఫిబ్రవరి 8 : కారులో తరలిస్తున్న నాటుసారాను, నల్లబెల్లాన్ని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు గురువారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని తాటిచెర్ల మోటు వద్ద ఎస్ఈబీ సీఐ ఎస్.కొండారెడ్డి, ఎస్సై ఫణికుమార్‌లు వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా కారు వెళుతోంది. కారు తనిఖీ చేయగా, 400 కిలోల నల్లబెల్లం, 5 లీటర్ల నాటుసారా, 5కిలోల పటికను పట్టుకున్నారు. కొమరోలు వైపు నుంచి మార్కాపురం వైపుకు కారు వెళుతున్నట్లు గుర్తించారు. నిందితులు రఘు, దేశావత్ భాస్కర్‌నాయక్, కొమ్ము పేద ముత్తయ్యలను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ కొండారెడ్డి తెలిపారు.

ఆంజనేయస్వామి గుడిలో చోరీ

- హుండీ మాయం


ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

కొమరోలు, ఫిబ్రవరి 8: స్థానిక ఆంజనేయస్వామి దేవాలయంలో గుర్తుతెలియని దుండగలు గేటు తాళం పగులకొట్టి హుండీని తీసుకెళ్లారు. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమరోలు పట్టణంలోని రాష్ట్రీయ రహదారి వెంబడి పట్టణంలోని నడిబోడ్డున శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ఉంది. రోజూ మాదిరిగానే రాత్రివేళలో తాళాలు వేసుకొని సిబ్బంది వెళ్లారు. గురువారం వేకువజామున దేవాలయంలో పని చేస్తున్న మహిళ దేవాలయం తాళం తీద్దామని వచ్చింది. అప్పటికే తాళం తీసినట్లు ఉండటంతో ఆలయ ధర్మకర్త మానుకొండు ఆదిశేషయ్య, పూజారి ఆచారిలకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు దేవాలయంలోకి వెళ్లి చూశారు. ఆలయం తూర్పుదిశలోని గేటు తాళం పగులగొట్టి ఉంది. స్వామి గర్భగుడి గేటు బయట ఉన్న హుండీ మాయం అయ్యింది. గర్భగుడి గేటు పగులగొట్టడం కష్టతరం కావడంతో దానిని పగులగొట్టలేదు. దీంతో ప్రధాన దేవాలయంలోని విలువైన వస్తువులు సురక్షితంగా ఉండడంతో భక్తులు ఊపిరిపీల్చుకున్నారు. దొంగలు దోచుకున్న హుండీలో సుమారు రూ.6వేలు నగదు ఉండవచ్చునని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ, ప్రస్తుతం పనిచేయడం లేదని తెలిసింది.

దళారుల చేతిలో రైతులు మోసపోవద్దు

జేసీ గోపాలకృష్ణ


మాట్లాడుతున్న జేసీ మురళీకృష్ణ

పొదిలి, ఫిబ్రవరి 8 : రైతులు పండించిన పంటను దళారుల చేతిలోపెట్టి మోసపోవద్దని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని పాములపాడు గ్రామంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ఆరు గాలం కష్టించి పండించిన పంటను అమ్ముకునే సమయంలో దళారులను ఆశ్రయించి నష్ట పోవద్దన్నారు. జిల్లాలో ఎక్కువ కందిపైరు పొదిలి ప్రాంతంలోనే సాగు చేస్తున్నారన్నారు. దీంతో మండలంలో మొదటిగా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. త్వరలో జిల్లాలో అన్ని రైతుభరోసా కేంద్రాల్లో ప్రారంభిస్తామన్నారు. నాణ్యమైన పంటను రైతులు ప్రభుత్వానికి అందించడం ద్వారా ప్రభుత్వం సరఫరా చేసే కేంద్రాలకు మంచి పుష్టికరమైన పప్పును ప్రజలకు అదించేందుకు వీలుంటుదన్నారు. 'సీడ్ టూ సేల్' ద్వారా కందులు కొనుగోలు చేసి వాటిని శుద్ధిచేస్తామన్నారు. అనంతరం సివిల్ సప్లై ద్వారా కందిపప్పును ప్రజలకు పంపిణీ చేయడంతోపాటు, అంగన్‌వాడీ, ప్రభుత్వం హాస్టల్స్‌కు అందజేస్తామన్నారు. ఆవిధంగా బాలింతలు, పిల్లలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించడం లో ప్రజలు భాగస్వాములు అవుతారన్నారు. ప్రభుత్వ రేటుగా రూ.7500 చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకా రం ఆరబెట్టుకొని రైతులు కేంద్రానికి తీసుకు రావాలని సూచించారు. తేమ 12 శాతంగా, దెబ్బతిన్న గింజలు 2శాతంగా, ఇతరపప్పు గింజలు 3 శాతంగా ఉండవచ్చున్నారు. అంతే కాకుండా నాణ్యమైన పంటను అమ్ముకునే సమయానికి బహిరంగ మార్కెట్‌లో ఎంత ధర ఉంటే ఆధరను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుం టుందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.7500లు అయినా ఈరోజు ప్రారంభ సమయానికి బహిరంగ మార్కెట్ రూ.10295 ఉందని ఆ ధర ప్రకారం రైతులుకు చెల్లిస్తామన్నారు. కావున దళారుల వద్దకు వెళ్లి నష్టపోకుండా కేంద్రాల్లోనే పంటను అమ్ముకో వాలని సూచించారు. ప్రకృతివైపరిత్యాలు, ధరల్లో వ్యత్యాసం ఉన్నప్పుడు ధాన్యాన్ని నిల్వలు చేసుకు నేందుకు ప్రభుత్వ గోడౌన్‌లు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో ఉదయ భాస్కర్, సివిల్‌సప్లై డీఎం సత్యనారాయణ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాసరావు, సీఈవో పోలిశెట్టి రాజశేఖర్, ఏడీఏ బాలాజీ నాయక్, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు కందుల వెంకటేశ్వర్లు, బీవీఎస్ శాస్త్రీ, తహసీల్దార్ మహమ్మద్ జియా, ఏవో జైన్‌లూబ్దీన్ ప్రజలు పాల్గొన్నారు.

మిరపసాగులో మెలకువలపై అవగాహన


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఎంఐపీ పీడీ రమణారావు

మార్కాపురం రూరల్ ఫిబ్రవరి 8: మిరపసాగులో మెలకువలపై రైతులకు అవగాహన కల్పించాలని ఆర్‌బీకే సిబ్బందిని ఏపీఎంఐపీ పీడీ రమణారావు కోరారు. పట్టణంలోని ఎస్సీ బీసీ కాలనీలోని డ్వాక్రా బజార్‌లోని మీటింగ్ హాలులో మార్కాపురం సబ్‌డివిజన్‌లోని ఆర్‌బీకేలలోని గ్రామ వ్యవసాయ సహాయకులకు మార్కాపురం ఉద్యానవన శాఖ జిల్లా అధికారి వైఎంఎస్ గోపీచంద్ ఆధ్వర్యంలో ఈ మిర్చి ప్రాజెక్టుపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిరప నాణ్యత పరీక్షా కేంద్రాలలో పరీక్షించుకొని వచ్చిన ఫలితాల ఆధారంగా పంటలను అమ్మడం ద్వారా రైతులు గిట్టుబాటు ధర పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. మిరపపైరు పరీక్ష విధానంపై రైతులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆర్‌బీకేల సిబ్బందిదేనని అన్నారు. డిజిటల్ గ్రీన్ సంస్థ సమన్వయకర్త కమలాకర్ మాట్లాడుతూ ఈ మిర్చి ప్రాజెక్టు టెక్నాలజీ సహ కారంతో మిరపపైరులో నాణ్యత ప్రమాణాలను, దిగుబడులను పెంచే విషయాలను తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ రమాదేవి, మార్కాపురం, గిద్దలూరు ఉద్యానవన శాఖ అధికారులు రమేష్ బాబు, విష్ణుప్రియ, మార్కాపురం, పెద్దారవీడు ఏవోలు దేవిరెడ్డి శ్రీనివాసులు, బుజ్జిబాయ్, మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు, కంభం, అర్ధవీడు, కొనకనమిట్ల మండలాల ఆర్‌బీకే గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

వృద్ధురాలి దారుణ హత్య

- ఎర్రగొండపాలెం అంబేడ్కర్ నగర్‌లో ఘటన
- రాళ్లవాగు చెట్ల పొదల మధ్య మృతదేహం

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 8 : వృద్ధమహిళ హత్యకు గురైన ఘటన ఎర్రగొండపాలెంలోని అంబేడ్కర్‌నగర్ సమీపంలో చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అంబేడ్కర్‌నగర్‌కు చెందిన తూమాటి చెన్నమ్మ(82) బుధవారం సాయంత్రం నుంచి ఇంటిలో కన్పించ లేదు. దీంతో కుటుంబ సభ్యులు బుధవారం రాత్రంతా పరిసరాలలో వెతికారు. అయితే అంబేద్కర్‌నగర్ పక్కనే ఉన్న రాళ్లవాగు చెట్ల మధ్య ఆమె విగతజీవిగా పడి ఉంది. దీన్ని గుర్తించిన స్థానికులు గురువారం ఉదయం పోలీసులకు తెలిపారు. ఘటన స్థలంలో చెన్నమ్మ తలపై రాళ్లదెబ్బలు ఉన్నాయి. దుస్తులు కూడా సక్రమంగా లేవు. దీంతో ఆమెను ఎవరో హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఘటనా స్థలంలో చెన్నమ్మ తలపై, ముఖంపై గాయాలున్నాయి. దీంతో ఎవరైనా మద్యం మత్తులో హత్య చేసి ఉంటారా..? అని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు చెన్నకేశవులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేసినట్లు సీఐ రాములునాయక్ తెలిపారు. ఈ ఘటనపై మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి పర్యవేక్షణలో ఎర్రగొండపాలెం సీఐ రాములునాయక్, మార్కాపురం సీఐ ఏ.వెంకటేశ్వర్లు, ఎర్రగొండపాలెం ఎస్.ఐ సుదర్శన్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వైద్యశాలకు తరలించి మార్చురి గదిలో ఉంచారు. శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. జిల్లాకేంద్రం నుంచి క్లూస్ టీంలను, డాగ్‌స్క్వాడ్‌ను పిలిపించి ఘటనా స్థలంలో పరిశీలించారు. పోస్టుమార్టం అనంతరం పూర్తి విషయాలు వెలుగులోనికి వస్తాయని డీఎస్పీ తెలిపారు.

పాలకపక్షాల చేతకానితనంతో ప్రత్యేక హోదా కోల్పోయాం

- మాజీ ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు


ప్రచారంలో భాగంగా డప్పు కళాకారుల విన్యాసం

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 8 : టీడీపీ, వైసీపీ ప్రభుత్వాల తప్పిదాలవల్లే రాష్ట్రానికి సాధించుకోవాల్సిన ప్రత్యేకహోదాను కోల్పోయాం అని కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు అన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ప్రచారంలో భాగంగా, గురువారం ఎర్రగొండపాలెం ప్రధాన కూడలిలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ప్రత్యేకహోదా సాధన కోసం టీడీపీ, వైసీపీ పార్టీల నాయకుల కృషి చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశారన్నారు. రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెసు పార్టీ వల్లే సాధ్యమన్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గాన్ని గతంలో తాను ఎమ్మెల్యేగా ఉండి ఎన్నో అభివృద్ధి పనులు చేశానని అన్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గం నుంచి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెసుపార్టీ అభ్యర్థిగా తన కుమారుడు విజేష్‌రాజు పోటీలో ఉంటారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు విజేష్‌రాజు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మెడబలిమి వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి బాలకిష్టారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్బంధంపై ఆశాల ఆగ్రహం

- ఛలో విజయవాడను భగ్నం చేస్తూ ఎక్కిడక్కడ ఆశా కార్యకర్తల అరెస్టు

మార్కాపురం రూరల్ ఫిబ్రవరి 8: ఆశావర్కర్ల అక్రమ అరెస్టుకు నిరసనగా పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద యూనియన్ నాయకులతో కలిసి ఆశాలు గురువారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆశావర్కర్లు మాట్లాడుతూ ప్రభుత్వానికి తమ సమస్యలను తెలియజేసేందుకు 'ఛలో విజయవాడ' కార్యక్రమం చేపట్టామన్నారు. వారిని వెళ్లకుండా అడ్డుకోవడం సరికాదన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. సీపీఎం నాయకులు సోమయ్య మాట్లాడుతూ ఆశవర్కర్లను ఛలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీస్‌స్టేషన్‌లలో నిర్బంధించడం ప్రభుత్వానికి సరైన పద్ధతి కాదన్నారు. ఆశావర్కర్లకు పనిభారం తగ్గించి, కనీస వేతనం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి రూబెన్, నాగరాజు, గుమ్మ బాలనాగయ్య, ఏఐటీయూసీ నాయకులు అందె నాసరయ్య, ఆశావర్కర్ల సంఘం నాయకులు ఎం.మరియమ్మ, కమలమ్మ, మహాలక్ష్మీ, పద్మ, గీత, వెంకట రమణ, జ్యోతి పాల్గొన్నారు.

పొదిలి : ఆశాల న్యాయపరమైన సమస్యలు పరిష్కరించమంటే ప్రభుత్వం వారిని అరెస్ట్ చేయడం నిర్బంధించడం దుర్మార్గమైన చర్య అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ తీవ్రంగా ఖండించారు. మండలంలోని ఉప్పలపాడు పీహెచ్‌సీ ఆవరణలో ఆశా కార్యకర్తలు తలపెట్టిన నిరసన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తోపాటు మెడికల్‌లీవ్‌లు కల్పించాలన్నారు. మహిళలు అనికూడా చూడకుండా గృహనిర్బంధం, రాత్రి వేళలో అరెస్టు చేయడం, బస్సుల్లో తనిఖీలు నిర్వహించడం ఎంత వరకు సమంజసమన్నారు. నా అక్కచెల్లెమ్మలు అంటూ వైసీపీ ప్రభుత్వం చిరుద్యోగులైన మహిళలపట్ల వ్యవహరిస్తున్న తీరును చూస్తుంటే సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. ధర్నాలు చేస్తే విధుల నుంచ తప్పిస్తామనే హక్కు ఎవరికి లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆశాల సమస్యలు గుర్తించి పరిష్కరించాలని వారు కోరారు.

పోలీసుల అదుపులో ఆశ వర్కర్లు

రాచర్ల : రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఆశావర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోసం ఛలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. అందులో భాగంగా రాచర్ల మండలంలోని ఆశావర్కర్లు విజయవాడ వెళ్లేందుకు సంసిద్ధం కాగా, గురువారం పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 31 మంది ఆశావర్కర్లు ఉండగా కొంతమందిని పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. మండల ఆశవర్కర్ల అధ్యక్షురాలు జ్యోతి మాట్లాడుతూ డిమాండ్ల పరిష్కారం కోసం పోరాటం చేస్తామన్నారు.


మార్కాపురంలో పోలీసు స్టేషన్ వద్ద ఆశా కార్యకర్తల నిరసన

ఆశావర్కర్ల అరెస్టు

గిద్దలూరు : సమస్యల పరిష్కారం కోసం విజయవాడలోని ధర్నా చౌక్‌లో ఆందోళన చేసేందుకు అనుమతి లేదని పేర్కొంటూ ఆశాలను పోలీసులు అడ్డుకున్నారు. గిద్దలూరు నుండి విజయవాడ వెళుతున్న 35 మంది ఆశ వర్కర్లను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌లో ఉంచారు. ఆశ వర్కర్ల యూనియన్ ప్రతినిధులు విశ్రాంతమ్మ, సరోజ, సీఐటీయూ నాయకులు ఆవులయ్య మాట్లాడుతూ నాలుగేళ్లగా, వైసీపీ ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుండా కనీసం ఆందోళన కూడా చేయనివ్వకుండా అరెస్టు చేసి నిర్బంధించడం శోచనీయమన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, మెటర్నటి లీవ్‌లు కేటాయించాలని కోరారు.



గిద్దలూరు పోలీసుస్టేషన్ వద్ద ఆశాల ధర్నా, రాచర్లలో పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న ఆశాలు

అవీ..ఇవీ..

బీజేపీ కార్యాలయం ప్రారంభం


ప్రారంభోత్సవంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 8 : రానున్న ఎన్నికల నిర్వహణ కోసం పట్టణంలో భారతీయ జనతాపార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. పట్టణంలోని గణేష్ నగర్‌లో కార్యాలయాన్ని గురువారం ఆ పార్టీ నాయకులు పిడతల రమేష్‌రెడ్డి, భవనాశి వెంకటరామాంజనేయులు, డాక్టర్ జేవీ.నారాయణ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. పార్టీ పటిష్టతకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కోకన్వీనర్ గుమ్మా రాముడు, బీజేపీ పట్టణ అధ్యక్షులు అబ్బిశెట్టి ఉదయ్‌శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ముప్పూరి శ్రీనివాసులు, జిల్లా ఓబీసీ కార్యదర్శి బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ రవికుమార్ బాధ్యతలు



మార్కాపురం రూరల్ ఫిబ్రవరి 8: మార్కాపురం మండల తహసీల్దార్‌గా కే.రవికుమార్ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల బదిలీలో భాగంగా తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నుంచి మార్కాపురానికి బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన మంజునాథరెడ్డి మాచర్ల మండలానికి బదిలీపై వెళ్లారు.

కంభం తహసీల్దార్‌గా రామయ్య



కంభం, ఫిబ్రవరి 8 : కంభం తహసిల్దార్‌గా ఎస్.రామయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. కంభం తహసిల్దార్‌గా పని చేస్తున్న శైలేంద్రనాథ్‌ను నెల్లూరు జిల్లాక బదిలీ చేయగా ఆయన స్థానంలో తిరుపతి జిల్లా తెల్లకూరు రూరల్ తహసిల్దార్‌గా పని చేస్తున్న రామయ్యను కంభంకు బదిలీ చేయడంతో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల విధుల్లో భాగంగా బదిలీపై వ చ్చానని, ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు.

ఎంపీడీవోగా మస్తాన్‌వలి



కంభం, ఫిబ్రవరి 8 : కంభం ఎంపిడిఒగా సయ్యద్ మస్తాన్‌వలి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కంభం ఎంపిడిఒగా ఉన్న ప్రసాద్ గతనెల 31వ తేది పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో అర్ధవీడు మండల ఎంపిడిఒగా పని చేస్తున్న మస్తాన్‌వలిని ఎన్నికల విధుల్లో భాగంగా కంభంకు బదిలీ చేయగా అర్ధవీడు మండల ఇఒఆర్‌డి సాంబశివరావుకు పదోన్నతిపై అర్ధవీడు ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించారు.

తహసీల్దారుగా ఎస్ఎం హమీద్



పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 8 : దోర్నాల మండలం నూతన తహసీల్దారుగా ఎస్ఎం హమీద్ గురువారం పదవీబాధ్యతలు చేపట్టారు. ఈయన నెల్లూరు జిల్లా విడవలూరు మండలంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ సెలవుల్లో ఉన్నారు.ఎన్నికల బదిలీల్లో భాగంగా దోర్నాలకు వచ్చారు. కాగా దోర్నాల తహసీల్దారుగా పని చేస్తున్న వేణుగోపాలరావు మార్కాపురం ఆర్‌డీవో కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

గిద్దలూరు తహసీల్దార్‌గా సిద్ధార్థ

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 8 : గిద్దలూరు తహసిల్దార్‌గా జి.సిద్దార్థ నియమితులయ్యారు. గుంటూరులో తహసిల్దార్‌గా పని చేస్తున్న సిద్దార్థ గిద్దలూరు తహసిల్దార్‌గా నియమితులయ్యారు. గతంలో తహసిల్దార్‌గా పని చేస్తున్న సీతారామయ్య బదిలీపై వెళ్ళారు.

వైభవంగా ఉరుసు

గిద్దలూరు, ఫిబ్రవరి 8 : పట్టణంలోని కొంగలవీడు రహదారిలో వెలసిన ఖాజా నాయబ్‌రసూల్ దర్గా ఉరుసు వైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా జరుగుతున్న ఉరుసులో ముస్లిం మతపెద్దలు గంధంతోపాటు చద్దర్‌ను కప్పి పూలమాలలు వేసి ఫాతేహార్ నిర్వహించారు. తెలుగు సినిమా హీరో రాజ్‌పాలా హాజరై దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎన్.ఖాశిం, హాజీజ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

డాక్టర్ జాకీర్ హుస్సేన్ ఆదర్శనీయుడు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 8: భారతదేశ మూడో రాష్ట్రపతిగా సేవలందించిన భారతరత్న డాక్టర్ జాకీర్ హుస్సేన్ ఆదర్శనీయుడని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితీ మార్కాపురం కమిటీ అధ్యక్షులు మొఘల్ జాబీర్ హుస్సేన్ బేగ్ అన్నారు. స్థానిక సమితీ కార్యాలయంలో డాక్టర్ జాకీర్ హుస్సేన్ జయంతి పురస్కరించుకుని గురువారం ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జాకీర్ హుస్సేన్ బేగ్ మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీతో కలిసి డాక్టర్ జాకీర్ హుస్సేన్ స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నారని, భారతదేశం నా ఇల్లు, భారతీయులంతా నా కుటుంబం అని చెప్పిన గొప్ప దేశభక్తుడు అన్నారు. తన సంపదనంతా దాన ధర్మాలు చేసిన దానకర్ణుడని ఆయన ఆదర్శాలు మనమంతా పాటించాలన్నారు. కార్యక్రమాలో తాజ్ హుస్సేన్, కబీర్, మున్వర్, షాదా, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పల్లెకు పోదాం కార్యక్రమం

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 8: బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో నేటి నుంచి పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు గండి వీరారెడ్డి తెలిపారు. స్థానిక శివసదన్‌లో గురువారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు ఈ నెల 9, 10, 11 తేదీల్లో మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ స్థాయిలో కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పదకాలపై ప్రజలకు తెలియజెప్పి చైతన్య పరచనున్నట్లు ఆయన చెప్పారు. కావున బీజేపీ మండల నాయకులు కార్యకర్తలు విజయవంతం చేయాలన్నారు.


బ్యారన్ నుంచి వస్తున్న పొగ

పొగాకు బ్యారన్ దగ్ధం

పీసీపల్లి, ఫిబ్రవరి 8 : ప్రమాద వశాత్తు పొగాకు బ్యారన్ దగ్ధమైన సంఘటన మండలంలోని రామాపురంలో గురువారం జరిగింది. అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. ఏనుగంటి వెంకటసుబ్బయ్యకు చెందిన బ్యారన్‌ను గ్రామానికి చెందిన మక్కెన శ్రీను లీజుకు తీసుకుని పొగాకు కాల్చుకు వేశారు. గురువారం సాయంత్రం బ్యారన్ పై నుంచి పొగలు బయటకు వస్తుండడం గమనించిన స్థానికులు బ్యారన్ లోపల నిప్పంటుకుని మంటలు వ్యాపించడం చూశారు. వెంటనే కనిగిరి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. బ్యారన్ వద్దకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. ప్రమాదంలో కాల్పు కోసం ఉంచిన 6 క్వింటాల పొగాకు కాలి బూడిదయింది. బ్యారన్‌లోపల ఉన్న గొట్టాలు, టైర్లు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.2లక్షల వరకు రైతుకు నష్టం వాటిల్లిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

వలంటీర్లను అడ్డుకోండి

ఎన్నికల అధికారి లోకేశ్వరరావు

దర్శి, ఫిబ్రవరి 8 : ఎన్నికల ప్రక్రియలో వలంటీర్ల ప్రమేయం లేకుండా అడ్డుకట్ట వేయాలని నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కు సంబంధించిన పనుల్లో ఎక్కడైనా వలంటీర్లు జోక్యం చేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని లోకేశ్వరరావు హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరిగేందుకు అధికారులు నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. సమశ్యాత్మక పోలింగ్ బూత్‌లను గుర్తించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఎలాంటి ప్రలోభాలకు, అధికార ఒత్తిడికి లొంగకుండా నిష్పక్షపాతంగా పనిచేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలకు పాల్పడితే సంబంధిత అధికారుల పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని లోకేశ్వరరావు హెచ్చరించారు. సమావేశంలో దర్శి, దొనకొండ, కురిచేడు, ముండ్లమూరు మండలాల తహసీల్దార్‌లు జీ సుజాత, కే సుజాత, ఎంవీ సుధాకర్, జీ మధుబాబు, షేక్ మహమ్మద్‌హుస్సేన్, డిప్యూటీ తహసీల్దార్ ఏవీ రవిశంకర్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ దేవప్రసాద్, పోలీస్, ఎస్ఈబీ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దర్శి నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి లోకేశ్వరరావు

నేడు స్పందన

కురిచేడు, ఫిబ్రవరి 8: కురిచేడు మండలంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు గుంటక నాసర రెడ్డి కల్యాణ మండపంలో స్పందన కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ ఏవీ సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని రెవెన్యూ సమస్యలపై ప్రజలు దరఖాస్తులు ఇవ్వాలని ఆయన కోరారు. కలెక్టరు ఈ స్పందన కార్యక్రమానికి హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.


మురుగును తొలగిస్తున్న యువకులు

కదిలిన యువకులు

- వైసీపీకి వ్యతిరేకులన్న సాకుతో పారిశుధ్య చర్యలు చేపట్టని పంచాయతీ పాలకులు
- మురుగును స్వచ్ఛందంగా తొలగించిన స్థానికులు

తాళ్లూరు, ఫిబ్రవరి 8 : అధికార పార్టీకి వ్యతిరేకంగా ఉన్నారన్న సాకుతో దోసకాయలపాడు ఎస్సీకాలనీలో కాలువలో మురుగు తొలగింపు పనులను చేపట్టలేదు. దీంతో దుర్గంధంతో కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యను పలుమార్లు పంచాయతీ అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో స్థానిక యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి కాలువలను శుభ్రం చేశారు. గత పంచాయతీ ఎన్నికల్లో అధికారపార్టీ సర్పంచ్‌కు వ్యతిరేకంగా ఓట్లు వేశారన్న అక్కసుతో మా కాలనీపై చిన్న చూపు చూస్తు ఇబ్బందులు పెడుతున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కాలనీలో పారిశుధ్య పనులు చేపట్టడం లేదని, కాలువల్లో పేరుకున్న మురుగును తొలగించడం లేదని, కంపుతో నరకం చూస్తున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్య పనులు చేపట్టాలని పంచాయతీ అధికారులకు, మండల స్థాయి అధికారులకు విన్నవించగా నామకే వాస్తిగా పనులు చేపట్టగా మళ్లీ కాలువలు చెత్తతో నిండిపోయాయన్నారు. అధికారపార్టీ నేతల కనుసన్నల్లో పని చేస్తున్న గ్రామపంచాయతీ అధికారులు ఎస్సీ కాలనీ వాసుల కష్టాలను పట్టించుకోలేదని వాపోతున్నారు. కాలనీలోని మురుగు నీటి సమస్యను అనేకమార్లు గ్రామ పంచాయతీ, మండల స్థాయి అధికారులకు విన్నవించినా పట్టించుకోక పోవడంతో కాలనీలోని యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కా లనీలో పూడికతీత పనులు చేపట్టారు. అధికారులు కూడా ఎస్సీ కాలనీ వాసులపై వివక్ష ఎందుకు చూపుతున్నారో అర్థంకావడంలేదని ప్రశ్నిస్తున్నారు.

పశు బీమాను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న పశు వైద్యాధికారి శ్రీ సాయి

పామూరు, ఫిబ్రవరి 8 : పశు బీమా పథకాన్ని పోషకులు వినియోగించుకోవాలని వైద్యాధికారి ఈమని శ్రీ సాయి కోరారు. మండలంలోని కంభాదిన్నె గ్రామ సచివాలయంలో పశు బీమాపై పోషకులకు గురువారం అవగాహన కల్పించారు. ప్రమాదం, జబ్బులబారిన పడి మృతి చెందిన గేదెలకు రూ.30వేలు అందుతాయన్నారు. రైతు మూడేళ్లకుగాను రూ.399 ప్రీమియాన్ని కట్టాలని సూచించారు. నాటు గేదెకు రూ.15వేలు గాను రూ.196 కట్టాలన్నారు. 50 గొర్రెలు, మేకలకు ఏడాదికి రూ.40, రెండవ ఏడాదికి రూ.54, మూడో ఏడాదికి రూ.94 ప్రీమియం చెల్లించాలని సూచించారు. సచివాల యాల్లో పశుపోషకులు తమ ఆధార్ కార్డుతో ప్రీమియం చెల్లించాలని కోరారు. సమావేశంలో ఏహెచ్‌ఏ సిద్దయ్య, పశుపోషకులు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి


ఏవో కిషోర్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కనిగిరి, ఫిబ్రవరి 8 : రైతులు పండించిన పంటకలు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఏపీ రైతు సంఘం కనిగిరి సమితి కన్వీనర్ రఘునాథరెడ్డి అన్నారు. ఆర్డీవో కార్యాలయం ఎందుట రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రైతులకు సకాలంలో సాగునీరు అందక పోయినా రైతులు వ్యయ ప్రయాసలతో పంటలు పండించారన్నారు. కానీ ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వక పోవడం బాధాకరమన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు సబ్సిడీ లేకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. రైతులకు, కౌలు రైతులకు పూర్తిస్థాయిలో రుణాలు అందించటం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవో కే కిషోర్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు యాసిన్, జీపీ రామారావు, ఏఐటీయూసీ నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, పోతుల ప్రభాకర్, పీ మోహన్, ప్రసాద్, ఖాసింవలి, సుబ్బారావు, కోటయ్య, అంకమ్మ పాల్గొన్నారు.


గ్రామస్థులతో మాట్లాడుతున్న పరిటాల

టీడీపీతోనే బీసీలకు అండ

దొనకొండ, ఫిబ్రవరి 8 : రాష్ట్రంలో బీసీలకు అన్ని విధాలా అండగా నిలచి వారి అభ్యున్నతే లక్ష్యంగా కృషి చేసింది తెలుగుదేశం పార్టీ అని టీడీపీ లీగల్‌సెల్ మాజీ అధ్యక్షుడు పరిటాల సురేష్ తెలిపారు. మండలంలోని కొచ్చెర్లకోట గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రతిపల్లెకు ప్రజాయాత్ర కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిటాల సురేష్ మాట్లాడుతూ వైసీపీ బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని, రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగులను అన్ని విధాల వేధింపులకు గురిచేస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌రెడ్డికి గుణపాఠం చెప్పేందుకు అన్నీ వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కొచ్చెర్లకోట పంచాయతీలోని ప్రజలు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజలకు సరిపడా ట్యాంకర్లను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తాం


కాల్వల నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ పిచ్చయ్య

దర్శి ఫిబ్రవరి 8 : పట్టణంలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో మెరుగుపరుస్తామని నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తెలిపారు. 19వ వార్డులో మురుగు కాల్వల నిర్మాణానికి అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా గృహాలను నిర్మించుకున్న అనేక ప్రాంతాల్లో ఏళ్ల తరబడి కాల్వలను నిర్మించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్ని ప్రాంతాల్లో కాల్వలు నిర్మించి వసతులు పెంపొందిస్తామన్నారు. కార్యక్రమంలో డీఈ రహీమ్, ఏఈ శ్రీనివాస్, దర్శి పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు దారం సుబ్బారావు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి ఎదగాలి

ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ కోటయ్య



ప్రకాష్‌ను సన్మానిస్తున్న అధ్యాపక బృందం

దొనకొండ, ఫిబ్రవరి 8 : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ కోటయ్య సూచించారు. కాలేజీ ఆవరణలో వార్షికోత్సవ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు గత ఏడాది ఫలితాల మాదిరిగానే ఈ ఏడాది ఉ త్తమ ఫలితాలు సాధించాలని కోరారు. జడ్పీ పాఠశాల హెచ్‌ఎం రామాంజనేయు లు మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులు కాలేజీ చదువులకు దూరప్రాంతాలకు వెళ్లి ఇ బ్బందులు పడకుండా అందుబాటులో ఉన్న ప్ర భుత్వ కాలేజీలో చదువుకోవాలని సూచించారు. తమ పాఠశాలలో 10 చదివిన వి ద్యార్థులు ప్రభుత్వ కాలేజీలో చేరేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం కాలేజీ అభివృద్ధికి సహకరిస్తున్న కాలేజీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మాడిశెట్టి ప్రకాష్‌ను, రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయుడుగా అవార్డు పొందిన హెచ్‌ఎం రామాంజనేయులును, కాలేజీ సీనియర్ అధ్యాపకుడు ఖాదర్‌వలిని ఘనంగా సన్మానించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బ హుమతులను అందజేశారు. కార్యక్రమంలో సుందర్, మహలక్ష్మీ, బ్రహ్మం, బాలునాయక్, ఛత్రపతినాయక్, మల్లికార్జున, విద్యార్థులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని నెంబర్ 1గా తీర్చిదిద్దుతాం

ముండ్లమూరు, ఫిబ్రవరి 8 : దర్శి నియోజక వర్గాన్ని నెంబరు - 1 తీర్చిదిద్దుతామని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పసుపుగల్లులో మన ఊరికి మన శివన్న కార్యక్రమం నిర్వహించారు. పసుపుగల్లు, చింతలపూడి గ్రామాల్లో జరిగిన కార్యక్రమాని కి వైసీపీ మండల కన్వీనర్, పసుపుగల్లు గ్రామ వాసి బిజ్జం వెంకట సుబ్బారెడ్డి, సర్పంచ్ వరగాని బాల సుందరరావు, ఎంపీటీసీ దాసరి పెద అంజయ్య గైర్హాజరయ్యారు. పలు గ్రామాలకు చెందిన ఎమ్మెల్యే మద్దిశెట్టి వర్గీయులు కూడా హాజరు కాలేదు.

వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టిన కేంద్రం


మాట్లాడుతున్న కంకణాల

దొనకొండ, ఫిబ్రవరి 8 : వ్యవసాయ రంగాన్ని కాపాడుతామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం కార్పొరేటర్లకు అప్పజెప్పి సంక్షోభంలోకి నెట్టిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం నా యకుడు కర్నా హనుమయ్య అధ్యక్షతన దొనకొండలో గురువారం గ్రా మీణ బంద్ సన్నాహక సమావేశం నిర్వహించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చే స్తామని అధికారంలోకి వచ్చిన మోదీ అన్నదాతల ఆత్మహత్యలను పెంచారని కంకణాల ఆరోపించారు. రైతు వ్యతిరేఖ చట్టాలు తెచ్చిన కేంద్రంపై ఏడాదికిపైగా రై తులు పోరాడితే మోదీ తలవంచారన్నారు. ఈనెల 16న చేపట్టే గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కంకణాల పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, సీపీ ఎం కార్యకర్తలు ఎం.అంజిబాబు, ఎం సంతోష్ పాల్గొన్నారు.





కేకును కట్ చేస్తున్న టీడీపీ నాయకులు.. ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో.. పీసీపల్లి ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంచుతున్న శ్రేణులు

ఘనంగా డాక్టర్ ఉగ్ర పుట్టినరోజు వేడుకలు

కనిగిరి, ఫిబ్రవరి 8 : మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పుట్టినరోజు వేడుకలు కనిగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరావతి గ్రౌండ్స్‌లో పుట్టినరోజు కేక్ కట్ చేసి టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం నిర్వహించారు. 40 మంది పేద చిరు వ్యాపారులకు తోపుడు బళ్లను ఉచితంగా అందచేశారు. వివిధ మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు తరలివచ్చి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారు. దీంతో అమరావతి గ్రౌండ్స్‌లో పండుగ వాతావరణం చోటు చేసుకుంది. టీడీపీ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకట సుబ్బారెడ్డి ఉగ్ర పుట్టినరోజు కేకును కట్ చేసి శ్రేణులకు పంచి పెట్టారు. ఉగ్ర సేవాభావంతో ముందుకు వెళ్తూ ప్రతి ఒక్కరికీ వైద్య సహాయంతో పాటు, కంటి ఆపరేషన్లు చేయించి ఆరాధ్యుడయ్యారని దొడ్డా కొనియాడారు. కనిగిరి ప్రాంతంతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు కూడా ఉగ్ర పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం అభిమానానికి నిదర్శనమన్నారు. ఈ ప్రాంతం అన్నివిధాలా అభివృద్ధి జరగాలంటే వచ్చే ఎన్నికల్లో ఉగ్రను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, గుదే రమణయ్య, ముచ్చుమారి చెంచిరెడ్డి, గాయం తిరుపతిరెడ్డి, నారపరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, భేరి పుల్లారెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, షేక్ ఫిరోజ్, గుటిపాటి ఖాదర్, రోషన్ సంధాని, తెలుగు మహిళలు కరణం అరుణ, మాజీ కౌన్సిలర్ షేక్ వాజిదాబేగం, తులసి, దొరసాని పాల్గొన్నారు. దివ్యాంగులకు అన్నదానం చేసినవారిలో ము త్తుముల రమణారెడ్డి, మూలె బ్రహ్మారెడ్డి, తాతిరెడ్డి ప్రసాద్ రెడ్డి, వెంకటేశ్వర్లు, గజ్జెల రవి ఉన్నారు.

ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో

ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఉగ్ర పుట్టినరోజు కేక్‌ను కట్ చేసి ఘనంగా నిర్వహించారు. క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు యస్థానిబాషా (పులి), తాతపూడి ఐజాక్, జై భీం నాయకులు సూరె రాజు, తాతపూడి బ్రాక్, ఉంగరాల బాషా, బడేబాయ్, నన్నేబాయి, నీ లా, సిద్ధాంతి బారాయిమాం, ఈదర వెంకయ్యచౌదరి, సానికొమ్ము బ్రహ్మారెడ్డి, ఐవీ నారాయణ, టీకాల పెద్దన్న, ఆర్టీసీ గౌస్‌బాషా, నర్సారెడ్డి, దింటకుర్తి సుబ్రమణ్యం, గిఫ్ట్ ఆర్టికల్స్ కొండలు, తమ్మినేని చినరామిరెడ్డి పాల్గొన్నారు.

హనుమంతునిపాడు : టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్టీఆర్) ఆధ్వర్యంలో ఉగ్ర పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్టీఆర్, ఆయన సతీమణి రజని కేకును కట్ చేసి శ్రేణులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో మురహరి నరసయ్య, రెడ్డెం తిరుపతిరెడ్డి, గాయం రామిరెడ్డి, కందుల వెంకటసుబ్బారెడ్డి, చావలి వెంకటేశ్వర్లు, చీకటి వెంకటసుబ్బయ్య, రామకృష్ణ, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, వెంకటనారాయణ పాల్గొన్నారు.

ఉగ్రకు పుట్టినరోజు శుభాకాంక్షలు

పామూరు : మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి పు ట్టినరోజు వేడుకలను టీడీపీ మండల నాయకుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయంలో టీడీపీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, బర్తడే కేక్‌ను కట్ చేసి శ్రేణులకు పంచి పెట్టారు. అనంతరం టీడీపీ ఒంగోలు పార్లమెంట్ జిల్లా కార్యదర్శి సయ్యద్ అమీర్‌బాబు ఆర్థిక సహకారంతో ఇద్దరు దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అం దచేసి, ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఉగ్ర ఆర్మి ఆధ్వర్యంలో క లాం సెంటర్‌లో ఏర్పాటు చేసిన బర్తడే కేక్‌ను పువ్వాడి కట్ చేశారు. కమ్మవారిపల్లి సెంటర్ లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద అచ్చమాంబ దేవస్థానం చైర్మన్ అడుసుమల్లి నరసింహులు కేక్ కట్ చేసి ఉగ్రక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మాచర్ల రహీమాన్ అమారావతి గ్రౌండ్స్‌లో సాగుతున్న అన్నా క్యాంటీన్ నిర్వహణకు రూ.5 వేల నగదును పువ్వాడి వెంకటేశ్వర్లుకు అందచేసారు. కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర నాయకుడు ఎం.గంగరాజుయాదవ్, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, జిల్లా కమిటీ నాయకులు షేక్ ఖాజారహంతుల్లా, సయ్యద్ అమీర్‌బాబు, వై.ప్రసాద్‌రెడ్డి, ఆర్‌ఆర్ రఫి, పట్టణ కమిటీ సభ్యుడు ఉప్పలపాటిహరిబాబు, షేక్ గౌస్‌బాషా, ఇర్రి కోటిరెడ్డి, పందిటి హరీష్, బద్ధిపూడి మార్క్, పాలపర్తి వెంకటేశ్వర్లు, పులి నాయభ, ముబినామౌలాలి, దేవరపు మాల్యాద్రి, బీ సత్యం, ఎన్.సాంబయ్య, పువ్వాడి వెంకట్‌చౌదరి, జాజం, వెంకటేశ్వర్లు, దైండే శివశంకర్, డీ రామాంజనేయులు, డోలా శేషాద్రి, పువ్వాడి రామారావు, కమ్మ బాలకృష్ణ, చినహజరత్, కౌలూరి రహంతుల్లా, కే రాజేంద్ర, గిడ్డయ్య, రమణయ్య, ఫత్తు మస్తాన్, ఎం.మహేష్, మన్నె నరసింహులు, కావేరి రసూల్, పీ తిరుపతయ్య, వీ నవీన్, ఎం.నరసింహారావు, వినోద్ మోషే పాల్గొన్నారు.


దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తున్న పువ్వాడి

ఐటీడీపీ అధ్యక్షుడు మార్నేని రామకృష్ణ ఆధ్వర్యంలో అయ్యవారిపల్లి గ్రామంలో ప్ర భుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రానికి భోజనం ప్లేట్లు, గ్లాసులు, వాటర్ బాటిళ్లను బహూకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మార్నేని మాలకొండరాయుడు పాల్గొన్నారు.

హేపీ బర్త్ డే

పీసీపల్లి : మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి ఉగ్ర నరసింహారెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు మండలంలో గురవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా తయారు చేయించిన కేక్‌ను కట్‌చేసి కార్యకర్తలకు, ప్రజలకు పంచిపెట్టారు. అనంతరం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి రోగులకు పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో బీసీసెల్ ప్రధానకార్యదర్శి కోమటిగుంట్ల వీరయ్య, మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, కరణం బల్లయ్య, కే నారాయణ, మాదాసి రమేష్‌బాబు పిచ్చిరెడ్డి, చినబ్రహ్మాయ్య, ప్రసాద్, రత్తయ్యయాదవ్, మహేంద్రరెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు రులు ఉన్నారు.

డాక్టర్ ఉగ్రకు టీడీపీ నాయకులు ఫోన్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యంతో భవిష్యత్‌లో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. టీడీపీ బీసీసెల్ నాయకులు చెన్నుబోయిన మాలకొండయ్య, గుదే నాగేశ్వరరావు, వేమూరి సుబ్బారావు, మోతుకూరి బ్రహ్మయ్య, నాయకులు, కార్యకర్తలు ఉగ్ర హేపీ బర్త్ డేని చెప్పారు.

మహిళలకు చీరల పంపిణీ


పేదలకు చీరలను పంపిణీ చేస్తున్న పోకా

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పుట్టిన రోజును టీఎన్ఎస్ఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి పోకా నాయుడుబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నర్రమారెళ్ల పంచాయతీ, చెం చిరెడ్డిపల్లి గ్రా మంలో సుమారు 100 మంది మహిళలకు పోకా ఆర్థిక సాయంతో సుబ్బక్కపల్లి తెలుగు మహిళా నాయకులు పోకా జ యమ్మ, చెంచమ్మ చేతుమీదుగా చీరలను పంచిపెట్టారు. అనంతరం శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో ఉగ్ర కుటుంబ సభ్యుల పేర్లతో ప్రత్యేక పూజలు చేయించారు. పోకా మాట్లాడుతు రానున్న ఎన్నికల్లో ఉగ్రకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టితో గె లిపించుకొని ఈ ప్రాంత అభివృద్ధిలో అందరం భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉగ్ర చిత్ర పటానికి పాలభిషేకం చేశారు.

మాట తప్పిన జగన్‌రెడ్డి


నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు

పామూరు, ఫిబ్రవరి 8 : పాదయాత్రలో జగన్‌రెడ్డి ఆశాల సమస్యలు పరిష్కరిస్తానని మాటిచ్చి మడమతిప్పారని సీఐటీయూ కార్యదర్శి మాల్యాద్రి ఆరోపించారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడకు వెళ్లి ఆశా కార్యకర్తలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ మమ్మీడాడీ సెంటర్‌లో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. పోలీసు బలగాలతో కార్మికుల హక్కులు కాలరాస్తున్న జగన్‌రెడ్డికి గట్టి గుణపాఠం చెప్తామన్నారు. కార్యక్రమంలో షేక్ అల్లాభక్ష్, గౌస్‌బాషా, సావిత్రి, రజియా, నారాయణమ్మ పాల్గొన్నారు.

కురిచేడు : ఆశా కార్యకర్తలపై ప్రభుత్వం నిరంకుశత్వం సరికాదని సీఐటీయూ కురిచేడు మండల కమిటీ గౌరవాధ్యక్షుడు సందు వెంకటేశ్వరరావు విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికై ప్ర భుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు విజయవాడ ధ ర్నా చౌక్ వద్ద ధర్నా చేసేందుకు అనుమతించి న ప్రభుత్వం అక్కకు వెళ్లకుండా ఆశాలను అడ్డుకోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ముందస్తుగా పోలీసులు వారిని బెదిరించడం, నోటీసులు ఇవ్వడం, నిర్బంధించడం, ఫొటోలు తీసి భయభ్రాంతులకు గురి చేయడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఇటువంటి అనైతిక చర్యలు ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకువస్తాయన్నారు. ప్రభుత్వం తన నిరంకుశత్వం విడనాడి ఆశాలతో చర్చలు జరిపి వారి డిమాండ్లను ఆమోదించాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న రవికుమార్

దర్శి, ఫిబ్రవరి 8 : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ పీ రవికుమార్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం దర్శి - కురిచేడు రోడ్డులో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, అతివేగం ప్రమాదమనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్లు ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

తెనాలి: కొలకలూరులో జరిగిన రచ్చబండలో ప్రసంగిస్తున్న షర్మిల



కష్టాల్లో తోడుంటాం

- బాధిత కుటుంబాలకు అండగా పార్టీ
- మృతుల కుటుంబీకులకు ఆర్థిక సహాయం
- తాడికొండ నియోజకవర్గంలో భువనేశ్వరి నిజం గెలవాలి యాత్ర



ఫిరంగిపురం: రేగులగడ్డ గ్రామంలో రూ.3లక్షల చెక్కును అందిస్తున్న భువనేశ్వరి



తాడికొండ: బండారుపల్లిలో బాలయ్య కుటుంబసభ్యులను ఓదార్చుతూ..



తుళ్లూరు: రాయపూడిలో మృతుని కుటుంబసభ్యులకు రూ.3లక్షల చెక్కును అందించి పరామర్శిస్తూ..

తాడికొండ, ఫిరంగిపురం, తుళ్లూరు, ఫిబ్రవరి 8: కార్యకర్తలు, నాయకుల కుటుంబాలు కష్టాల్లో ఉంటే వారికి ఎల్లప్పుడు పార్టీ తోడుగా ఉంటుంది. అధైర్య పడ వద్దు. అండగా ఉంటాం.. అని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి తెలిపారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా గురువారం ఆమె తాడికొండ నియోజకవర్గంలో పర్యటించారు. గతంలో చంద్రబాబు అరెస్టుతో మనస్తాపంతో మృతి చెందిన వారి కుటుంబాలను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పి పార్టీ తరఫున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వారి నివాసాలకు వెళ్లిన భువనేశ్వరి వారి చిత్ర పటాల వద్ద నివాళులు అర్పించారు. ఉండవల్లి నుంచి రోడ్డు మార్గంలో ఆమె తాడికొండ, ఫిరంగిపురం, తుళ్లూరు మండలాల్లో పర్యటించారు. తాడికొండ మండలం బండారుపల్లిలో తూమాటి బాలయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఫిరంగిపురం మండలం కండ్రిక శివారు రేగులగడ్డకు చెందిన నల్లజర్ల పెదచెన్నకేశవరావు కుటుంబాన్ని పరామర్శించి ఆయన భార్య లక్ష్మి, కుమారుడు పెదబంగారయ్య, కుమార్తె బాలనరసమ్మలకు రూ.3 లక్షల చెక్కు అందజేశారు. తుళ్లూరుకు చెందిన మోరం సాంబశివరావు, రాయపూడికి చెందిన గోరగంటి మల్లికార్జునరావు, వెంకటపాలేనికి చెందిన లంకా నరసింహారావు కుటుంబాలను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు.

ఘన స్వాగతాలు.. ఆప్యాయంగా పలకరింపులు

నిజం గెలవాలి యాత్రలో భాగంగా పర్యటిస్తున్న భువనేశ్వరికి దారిపొడవునా మహిళల నుంచి ఆత్మీయ స్వాగతం లభించింది. ఆయా గ్రామాల్లో భువనేశ్వరని చూసేందుకు మహిళలు పూలు చల్లి తమ అభిమానాన్ని చాటుకున్నారు. తుళ్లూరు వెళ్లే క్రమంలో గరికపాడులో మహిళలు, వృద్ధులను ఆమె పలకరించి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. గరికపాడు నుంచి వస్తున్న క్రమంలో పనుల్లో నిమగ్నమైన మహిళా కూలీలు భువనేశ్వరి రాకను గమనించి ఆమెను చూసేందుకు పరుగులు తీశారు. పొలాల్లో నుంచి వస్తున్న వారిని గమనించిన భువనేశ్వరి కారును ఆపి వారితో కొద్దిసేపు గడిపారు. పొన్నెకల్లులో మహిళలు భువనేశ్వరికి హారతులతో స్వాగతం పలికారు. తాడికొండ అడ్డరోడ్డు వద్ద నిడుముక్కల, మోతడక గ్రామానికి చెందిన మహిళలు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. తాడికొండలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద, అమరావతి దీక్షా శిబిరం వద్ద మహిళలు, రైతులు, భువనేశ్వరికి పూలతో స్వాగతం పలికారు. ఫిరంగిపురం మండలం కండ్రిక శివారు రేగులగడ్డలో షిరిడీసాయి ఆలయంలో పూజల్లో పాల్గొన్నారు. తుళ్లూరు, రాయపూడి, వెంకటపాలెం గ్రామాల్లో రాజధాని మహిళలు, రైతులు, రైతు కూలీలు భువనేశ్వరికి పూలతో స్వాగతం పలికారు. కార్యక్రమాల్లో భువనేశ్వరి వెంట ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, గుంటూరు జిల్లా, నగర టీడీపీ అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్, డేగల ప్రభాకర్, గుంటూరు జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు అన్నాబత్తుని విజయలక్ష్మి అమరావతి రైతు జేఏసీ నేతలు పువ్వాడ సుధాకరరావు, గుర్రం చంటి తదితరులు పాల్గొన్నారు.

మంచి చేస్తా..

- రచ్చబండ ద్వారా ప్రజలు కష్టాలు తెలుసుకునేందుకే వచ్చా..!
- నాన్న నడిపిన పార్టీ పగ్గాలు పట్టుకుని మీ సేవకే వచ్చా
- జగనన్న వచ్చాక పరిశ్రమలు లేవు.. ఉద్యోగాలు లేవు
- ఇదే పాలన కొనసాగితే యువకులు రాష్ట్రం విడిచి వెళ్లాల్సిందే
- సంక్షేమం పేరుతో మట్టికుండ ఇస్తూ వెండి కుండ లాగుతున్న ప్రభుత్వం
- రాష్ట్రంలో లిక్కర్, మట్టి మాఫియా, భూదందాలు తప్ప పాలనేలేదు
- కాంగ్రెస్ గెలిస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తాం
- కొలకలూరు రచ్చబండ కార్యక్రమంలో కాంగ్రెస్ ఏపీ చీఫ్ షర్మిల

తెనాలి రూరల్, ఫిబ్రవరి 8: తన తండ్రి మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి రచ్చబండ ద్వారా నేరుగా ప్రజల కష్టాలు తెలుసుకున్నారని, అదే బాటలో తాను కూడా పయనిస్తూ మీ ముందుకు వచ్చానని కాంగ్రెస్ పార్టీ ఏపీ చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. గురువారం మండలంలోని కొలకలూరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమానికి షర్మిల హాజరయ్యారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం షర్మిల మాట్లాడుతూ తన తండ్రి దివంగత రాజశేఖర్ రెడ్డి ప్రజల కోసం ఎన్నో మంచి కార్యక్రమాలు చేసి ప్రజానాయకుడిగా మిగిలారన్నారు. నాన్న నడిచిన బాటలోనే నడుస్తూ కాంగ్రెస్ పార్టీతో ప్రజలకు మంచి చేస్తానన్నారు. రచ్చబండ కార్యక్రమం ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వారి నోటితోనే విని పరిష్కరించేందుకు తన వంతు కృషి చేయాలని వచ్చానని తెలిపారు. వైసీపీ సర్కార్ ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చలేకపోయిందని ఆరోపించారు. జగనన్న పాలనలో లిక్కర్, మట్టి, ఇసుక, భూదందాలు పెరిగిపోయాయని ప్రజాపాలన గాలికొదిలేశారని విమర్శించారు. తక్కువ ధరలకు భూములు కొని వాటిని పేదల ఇళ్ల పట్టాల పేరుతో వేల కోట్లు కొట్టేశారు. వేలమంది లబ్ధిదారులకు ఇల్లు ఇచ్చామని ప్రచారం చేస్తున్నారు క్షేత్రస్థాయిలో మాత్రం ఇల్లు రాలేదు.. పట్టాలు ఇవ్వలేదని ప్రజలు చెబుతున్నారని అన్నారు. అమ్మఒడి పథకం ద్వారా చదువుకునే ప్రతి బిడ్డకు రూ.15,000 ఇస్తానని ఆ నాడు చెప్పిన జగన్ అధికారంలోకి వచ్చి తరువాత ఒక్క బిడ్డకే ఇస్తామని అది కూడా సంవత్సరానికి రూ.12,000 ఇస్తూ తల్లులను మోసం చేశాడని దుయ్యబట్టారు. మహిళలందరూ గమనించాలని సంవత్సరానికి ఇచ్చే రూ.10వేలు కనీసం కుటుంబ ఖర్చులకైనా సరిపోతాయా.. మరో బిడ్డ ఉన్న తల్లులు ప్రైవేటు స్కూల్‌లో చదివించాలంటే ఫీజులు ఎంత ఖర్చు అవుతాయో ఆలోచించాలన్నారు. జగనన్న ఇచ్చే సంక్షేమ పథకాల లబ్ధి మట్టి కుండ చేతిలో పెట్టి వెండికుండ లాక్కునట్లు ఉందన్నారు. అందుకు పెంచిన ధరలే సాక్ష్యమన్నారు. రాష్ట్రంలో ప్రత్యేక హోదా తెస్తానని చెప్పిన జగనన్న కనీసం పోలవరం ప్రాజెక్టును కొంచెం కూడా ముందుకు నడపలేకపోయారన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యారని, ఫలితంగా యువకుల నిరుద్యోగులుగా రాష్ట్రం విడిచిపెట్టి వెళ్ళాల్సి వస్తున్నదన్నారు. ఇదే ప్రభుత్వం కొనసాగితే రాష్ట్రంలో యువకులు పొరుగు రాష్ట్రాల్లో బతుకుదెరువుకు వెళ్లే పరిస్థితి ఉందన్నారు. మెగా డీఎస్సీ అని చెప్పి దగా డీఎస్సీగా చూపారని జగనన్న పాలనను ఎండగట్టారు. రాష్ట్రంలో లిక్కర్, భూదందాలు, ఇసుక మాఫియాలతో రాష్ట్రం అట్టుడుకుతోందని అన్నారు. ఇదే పాలన కొనసాగితే రాష్ట్ర భవిష్యత్తు కనుమరుగైపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ పాలనను జనం గమనించి వచ్చే ఎన్నికల్లో రాజన్న, ఇందిరమ్మ రాజ్యాన్ని అధికారంలోకి తెచ్చుకుందామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ప్రారంభమయ్యే రోజే రాహుల్‌గాంధీతో తొలిసంతకం రాష్ట్రానికి ప్రత్యేక హోదామీద పెట్టిస్తానని ఆమె హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు చాలా గొప్పదని మంచి చేసే వారికే ఓటు వేయాలన్నారు. ప్రజల నుంచి దోచుకున్న డబ్బులను ఎన్నికల్లో ఖర్చు చేసేందుకు వెనుకాడని అవినీతి పార్టీల నుంచి ప్రజలు నిస్సందేహంగా వారు ఇచ్చే డబ్బులు తీసుకోవచ్చన్నారు. అవి మీ నుంచి దోచుకున్న డబ్బేనని వివిధ రకాల పన్నులు, పెంచిన నిత్యావసరాల ధరలు, కరెంట్ ఇతర వాటి నుంచి వసూలు చేసినవేనని అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాజన్నబిడ్డగా తనను గెలిపించుకోవాలని ఆమె కోరారు. తొలుత దివంగత రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి షర్మిల, కాంగ్రెస్ నాయకులు పుష్పాంజలి ఘటించారు. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీమంత్రి కనుమూరి బాపిరాజు, గుంటూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావు, మాజీ మంత్రి కేవీపీ రామచంద్రరావు, మాజీ ఎంపీ జేడీ శీలం, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు కొప్పుల రాజు స్థానిక పార్టీ నాయకులు చందు సాంబశివుడు, దారా రామకృష్ణ, పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న షర్మిల

ఆశాలపై ఉక్కుపాదం

- ఎక్కడికక్కడ నోటీసులు.. అరెస్టులు
- చలో విజయవాడను అడ్డుకున్న పోలీసులు
- ఎన్నారై సమీపంలో జాతీయ రహదారిపై మెరుపు ధర్నా
- బైఠాయించిన మహిళలను ఈడ్చివేసి స్టేషన్లకు తర లింపు
- వడ్డేశ్వరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆశాల నిర్బంధం



ఆశా కార్యకర్తలను లాగి పడేస్తున్న పోలీసులు



విజయవాడ-గుంటూరు హైవేపై కొలనుకొండ వద్ద రాస్తారోకో చేస్తున్న ఆశా కార్యకర్తలు

మంగళగిరి సిటీ, తాడేపల్లి, ఫిబ్రవరి 8: సమస్యలు పరి ష్కరించాలని కోరుతూ ఆశావర్కర్లు చేపట్టిన ఆందోళనపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. సీఐటీయూ అనుబంధ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ గురువారం చలో విజ యవాడకి పిలుపునిచ్చింది. ఈ ఆందో ళనకు అనుమతి లేదని ఎక్కడికక్కడ ఆశా వర్కర్లు, సీఐటీయూ నేతలకు పోలీసులు తొలుత నోటీసులు జారీ చేశారు. అయినా చలో విజయవాడకు బయల్దేరగా అరెస్టు చేసి వారిని స్టేషన్లలో నిర్బంధించారు. ఈ క్రమంలో పలుచోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నా యి. ఉదయం 9 గంటల సమ యంలో ఆశా వర్కర్లు వందల సంఖ్య లో మంగళగిరి మండలం చినకాకాని హైజంక్షన్ వద్దకు చేరుకుని ప్రదర్శనగా ఏపీఐఐసీ భవన్‌లోని కార్యాలయం వద్ద ఆందోళనకు సిద్ధ మయ్యారు. వీరి ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో ఎన్నారై ఆస్పత్రి వద్ద గౌతమ బుద్ధ రోడ్డుపై ఆశా వర్క ర్లు బైఠాయించి మెరుపు ధర్నాకు దిగారు. మధ్యా హ్నం ఒకటిన్నర వరకు ధర్నా కొనసాగడంతో జాతీయ రహదారిపై పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వారిని బలవంతంగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్లు, కల్యాణ మండపాలకు తరలించారు. ఆశా వర్కర్లు ప్రతిఘటించడంతో తోపులాట చోటుచేసుకుంది. దీంతో పలువురు సొమ్మసిల్లి పడిపోగా, గాజులు తదితరాలు గుచ్చుకోవడంతో పలువురి చేతులకు రక్తగాయాలయ్యాయి.

ప్రభుత్వ తీరు దుర్మార్గం

ఆశా వర్కర్ల ఆందోళనపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపి బలవంతంగా అరెస్టులు చేయడం దుర్మార్గమని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశాలచే వెట్టిచాకిరీ చేయించుకుంటున్న ప్రభుత్వం వారి సమస్యల పరిష్కారానికి చొరవచూపడంలేదని విమర్శించారు. వేతనాలు పెంచాలని కోరుతున్న ఆశావర్కర్లను, సీఐటీయూ నాయకురాలు ధనలక్ష్మిని చర్చలకు పిలిచి అరెస్టు చేయడం అన్యాయమని సీఐటీయూ రాష్ట్రకార్యదర్శి సుబ్బరావమ్మ అన్నారు. తాడేపల్లి వద్ద అరెస్టు చేసి దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌కు తరలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ అర్ధరాత్రి ఇళ్లలో ఉన్న వారిని మగపోలీసులతో అరెస్టు చేసి తీసుకురావడం దారుణమన్నారు. తమ నాయకురాలు ధనలక్ష్మి ఏమైందో ఇంత వరకూ చెప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళగిరి పోలీసు స్టేషన్‌లో నిర్బంధించిన ఆశా వర్కర్లను టీడీపీ నాయకులు పరామర్శించి సంఘీభావం తెలిపారు. ఆశా వర్కర్లను పోలీసులు అడ్డుకుని అక్రమంగా నిర్బంధించడం దుర్మార్గమైన చర్య అని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య అన్నారు.

గేట్లకు తాళాలు వేసి నిర్బంధం..

చలో విజయవాడలో భాగంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆశా వర్కర్లు తాడేపల్లి మండలం వడ్డేశ్వరం ప్రాంతానికి వచ్చి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆగారు. సమాచారం తెలిసిన పోలీసులు విజ్ఞాన కేంద్రం గేటుకు తాళాలు వేసి సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ సహా ఆశా వర్కర్లందరినీ నిర్బంధించారు. దీంతో సీపీఎం నేత దొంతిరెడ్డి వెంకటరెడ్డి, వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వర్లు అక్కడకు వచ్చి తాళాలు తీయాలని పోలీసులతో వాదులాటకు దిగారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని అనంతరం గేటు తాళాలు తీశారు. ఈ మధ్యలో కొందరు ఆశాలు గేటు దూకి జాతీయ రహదారిపైకి చేరుకుని వాహనాలను అడ్డుకుని నినాదాలు చేశారు. పోలీసుల తీరును నిరసిస్తూ వడ్డేశ్వరం వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఎంత సేపటికి వారు నిరసన విరమించక పోవడంతో పోలీసులు బలవంతంగా ఈడ్చివేశారు. శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన కార్యకర్త లక్ష్మి స్పృహతప్పి పడిపోయింది. అనంతరం వారిని తాడేపల్లి పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్లకు తరలించి సాయంత్రం విడుదల చేశారు.



పోలీసులు అరెస్టు చేస్తున్న క్రమంలో సొమ్మసిల్లిన ఆశ కార్యకర్త



భట్టిప్రోలు పోలీస్ స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న ఆశ కార్యకర్తలు

ఎక్కడికక్కడ నిర్బంధకాండ

బాపట్ల, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్ల ఛలో విజయవాడ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ఎక్కడికక్కడ నిర్బంధకాండకు తెగబడ్డారు. ఆశాలలో క్రియాశీలకంగా ఉండే వారి కదలికల మీద బుధవారం నుంచే నిఘా పెట్టారు. మార్టూరు, చినగంజాం, వేమూరు, కొల్లూరు ఇలా దాదాపు అన్ని మండలాల్లో ఆశాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. బస్టాండ్, రైల్వే స్టేషన్లతోపాటు కీలకమైన చెక్‌పోస్టుల దగ్గర గురువారం నిఘా పెట్టి విజయవాడకు వెళ్లకుండా అడ్డుకున్నారు. నోటీసులు జారీచేసి ఛలో విజయవాడకు అనుమతి లేదని, కాదని వెళితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వేమూరులో దాదాపు 50మందిని పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కొల్లూరు, చినగంజాం పరిధిలోని ఆశాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విజయవాడ బయలుదేరిన ఆశాలను పోలీసులు అరెస్టు చేసి బాపట్ల స్టేషన్‌కు తరలించగా జీబీసీరోడ్డుపై రాస్తారోకో చేశారు. రేపల్లె బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో చేశారు.

రోడ్డు నిర్మాణం పేరుతో

మట్టి దోపిడీ

- చోద్యం చూస్తున్న ఆర్అండ్‌బీ అధికారులు





చుండూరు ఫిబ్రవరి 8: రోడ్డు నిర్మాణం పేరుతో కాంట్రాక్టర్ పెద్దఎత్తున మట్టి తరలించి అమ్మకాలు సాగిస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు చోద్యం చూస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అంగలకుదురు-చండమూడి (ఏడీ రోడ్డు) మార్గంలో చుండూరు-మోదుకూరు మధ్య రోడ్డు నిర్మాణానికి రూ.3.28 కోట్లు వర్కు ఆర్డర్ విడుదలైంది. ఇందులో మోదుకూరు గ్రామంలో సిమెంటు రోడ్డు, సైడ్ డ్రైన్స్ నిర్మాణం చేపట్టాలి. ఊరిలో రోడ్డుకు ఇరువైపులా మాత్రమే సైడ్ డ్రైన్స్ నిర్మించాల్సి ఉండగా ఊరు పొలిమేరలు దాటి కిలోమీటర్ల మేర ఎక్స్‌కవేటర్‌తో పెద్దఎత్తున సైడ్ కాల్వలు తవ్వించి వచ్చిన నల్లమట్టిని ట్రాకర్లతో తెనాలిలోని ప్లాట్స్‌కు తరలించి అమ్మకాలు సాగిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పెద్ద సైడ్ కాల్వలు తవ్వి నిర్లక్ష్యంగా వదలి వేయడంతో ఇటీవల చిన్నారులు ఆడుకుంటూ దాంట్లో పడి ప్రమాదాలకు గురయ్యారు. నియోజకవర్గంలో రూ.36 కోట్ల మేర రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ రాకపోయినా ఇక్కడ మాత్రం పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్ ముందుకు రావడం మట్టి తవ్వకాలు జరిపి అమ్మకాలు చేపట్టడంపై గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పనులు జరుగుతున్న ప్రాంతానికి వచ్చి పరిశీలించాలని కోరుతున్నారు.

టీడీపీ వైపు కౌన్సిలర్ల చూపు?

- వైసీపీలో గుర్తింపులేదని ఆవేదన
- అద్దంకిలో మారుతున్న సమీకరణలు

అద్దంకి, ఫిబ్రవరి 8: అద్దంకి మున్సిపాలిటీలోని పలువురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీ వైపు చూస్తున్నట్లు సమాచారం. ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్ది నియోజకవర్గంలో రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. ఈక్రమంలో మున్సిపాలిటీలో కూడా కొంతమంది కౌన్సిలర్లు టీడీపీలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తుంది. ప్రధానంగా ఆయా వార్డులలో పెద్దగా అభివృద్ధి పనులు చేపట్టకపోవటం, వైసీపీలో తగిన గుర్తింపు లేదని టీడీపీలోకి చేరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తుంది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత చేరాలన్న ఉద్దేశంతో వారున్నట్లు సమాచారం. నోటిఫికేషన్ రాకముందే పార్టీ మారితే ఇబ్బంది పెడతారన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. 20 మంది కౌన్సిలర్లకు వైసీపీ నుంచి 13 మంది, టీడీపీ నుంచి ఏడుగురు గెలుపొందారు. ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పాటుఖాయమని పలు సర్వేలు చెప్తుండటంతో అందుకనుగుణంగా సమీకరణలు మారుతున్నాయి. ఎన్నికల్లో టీడీపీకి మద్దతుగా నిలిస్తే ప్రభుత్వం మారిన తర్వాత వార్డుల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయింపజేసుకోవచ్చన్న ఆలోచనతో కొందరు వైసీపీ కౌన్సిలర్లు ఉన్నట్లు తెలుస్తోంది. బాచిన కృష్ణచైతన్యతో అడుగులు వేసేందుకు మరికొంత మంది కౌన్సిలర్లు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది. ఈ విషయాలు వైసీపీ నేతల దృష్టికి పోవడంతో ఇటీవల కౌన్సిలర్లను పిలిపించుకుని వ్యక్తిగతంగా మాట్లాడినట్లు సమాచారం. ఈసందర్భంగా పలువురు కౌన్సిలర్‌లు తమకు జరిగిన, జరుగుతున్న అన్యాయాన్ని ఏకరువు పెట్టినట్లు తెలిసింది. అయితే, ఒకరిద్దరు కౌన్సిలర్‌లను పార్టీలోకి చేర్చుకునే విషయంలో టీడీపీ నాయకత్వం కూడా విముఖత చూపించినట్లు తెలుస్తుంది.

రోగులకు కాలం చెల్లిన మందులు

ఒంగోలు నగరంలో అందజేస్తున్న వైద్యసిబ్బంది



ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 8 : ఒకవైపు కాలం చెల్లిన మందులను వాడవద్దని పదే పదే చెప్తున్నా వైద్యారోగ్యశాఖ పట్టించుకుంటున్న పరిస్థితి లేకుండాపోయింది. చేతికేది వస్తే ఆ మందులు (ట్యాబ్లెట్లు) రోగులకు ఇచ్చి పంపుతున్నారు. ఒంగోలు నగరంలోని ఒక అర్బన్ హెల్త్ సెంటర్‌లో రోగులకు కాలం చెల్లిన ట్యాబెట్లు ఇస్తున్న వైనం వెలుగులోకి వచ్చింది. ఒక షుగర్ పేషెంట్ క్రమంతప్పకుండా అర్బన్ హెల్త్ సెంటర్‌లో చూపించుకుంటారు. అక్కడ బ్లడ్ షుగర్‌ను పరిశీలించి నెలకు సరిపడా మందులను ఇస్తుంటారు. అలా ఆ వైద్యశాలకు వెళ్లిన పేషెంట్‌కు నెలకు సరిపడా ట్యాబ్‌లెట్లను అందజేశారు. వాటిని ఆమె గత ఐదారు రోజుల నుంచి వాడుతూ వచ్చారు. పెద్దగా చదువుకోకపోవడంతో ఆ మందుల సమయం ఏ సంవత్సరం వరకు ఉండేది చూసుకోలేదు. ఆమె కుటుంబ సభ్యులు ఆ ట్యాబెట్లను గురువారం పరిశీలించారు. అవి 2021 నవంబరులో తయారుచేయగా 2023 అక్టోబరుకు కాలం చెల్లుతాయని ఉంది. అయితే ఈ విషయాన్ని పట్టించుకోని ఆ వైద్యసిబ్బంది వారి వద్దకు వచ్చిన వారందరికి ఆ ట్యాబ్‌లెట్లనే పంపిణీ చేసినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకొని కొంతమంది వైద్యశాలకు వెళ్లి అడిగితే కనీసం సమాధానం కూడా చెప్పలేదని తెలిసింది. ప్రభుత్వ వైద్యశాల కదా వెళితే కాలం చెల్లిన మందులను తమకు అంటగడుతున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్స్‌పైర్ అయిన మందులను వాడితే ఏ ఇబ్బంది వస్తుందోనని వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని ఇటువంటి మందులను రోగులకు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కదిలిన యువకులు



మురుగును తొలగిస్తున్న యువకులు

- వైసీపీకి వ్యతిరేకులన్న సాకుతో పారిశుధ్య చర్యలు చేపట్టని పంచాయతీ పాలకులు
- మురుగును స్వచ్ఛందంగా తొలగించిన స్థానికులు

తాళ్లూరు, ఫిబ్రవరి 8 : అధికార పార్టీకి వ్యతిరేకంగా ఉన్నారన్న సాకుతో దో సకాయలపాడు ఎస్సీకాలనీలో కాలువలో మురుగు తొలగింపు పనులను చే పట్టలేదు. దీంతో దుర్గంధంతో కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యను పలుమార్లు పంచాయతీ అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో స్థానిక యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి కాలువలను శుభ్రం చేశారు. గత పంచాయతీ ఎన్నికల్లో అధికారపార్టీ సర్పంచ్‌కు వ్యతిరేకంగా ఓట్లు వేశారన్న అక్కసుతో మా కాలనీపై చిన్న చూపు చూస్తు ఇ బ్బందులు పెడుతున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కాలనీలో పారిశు ధ్య పనులు చేపట్టడం లేదని, కాలువల్లో పేరుకున్న మురుగును తొలగించడం లేదని, కంపుతో నరకం చూస్తున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. పా రిశుధ్య పనులు చేపట్టాలని పంచాయతీ అధికారులకు, మండల స్థాయి అధికారులకు విన్నవించగా నామకే వాస్తిగా పనులు చేపట్టగా మళ్లీ కాలువలు చె త్తతో నిండిపోయాయన్నారు. అధికారపార్టీ నేతల కనుసన్నల్లో పని చేస్తున్న గ్రామపంచాయతీ అధికారులు ఎస్సీ కాలనీ వాసుల కష్టాలను పట్టించుకోలేద ని వాపోతున్నారు. కాలనీలోని మురుగు నీటి సమస్యను అనేకమార్లు గ్రామపంచాయతీ, మండల స్థాయి అధికారులకు విన్నవించినా పట్టించుకోక పోవడంతో కాలనీలోని యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కా లనీలో పూ డికతీత పనులు చేపట్టారు. అధికారులు కూడా ఎస్సీ కాలనీ వాసులపై వివక్ష ఎందుకు చూపుతున్నారో అర్థం కావడంలేదని ప్రశ్నిస్తున్నారు.

రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి



ఏవో కిషోర్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కనిగిరి, ఫిబ్రవరి 8 : రైతులు పండించిన పంటకలు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఏపీ రైతు సంఘం కనిగిరి సమితి కన్వీనర్ రఘునాథరెడ్డి అన్నారు. ఆర్డీవో కార్యాలయం ఎందుట రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రైతులకు సకాలంలో సాగునీరు అందక పోయినా రైతులు వ్యయ ప్రయాసలతో పంటలు పండించారన్నారు. కానీ ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వక పోవడం బాధాకరమన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు స బ్సిడీ లేకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. రైతులకు, కౌలు రైతులకు పూర్తిస్థాయిలో రుణాలు అందించటం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి రైతాంగాన్ని ఆదుకోవాలని డి మాండ్ చేశారు. ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవో కే కిషోర్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు యాసిన్, జీపీ రామారావు, ఏఐటీయూసీ నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, పోతుల ప్రభాకర్, పీ మోహన్, ప్రసాద్, ఖాసింవలి, సుబ్బారావు, కోటయ్య, అంకమ్మ పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టిన కేంద్రం

దొనకొండ, ఫిబ్రవరి 8 : వ్యవసాయ రంగాన్ని కా పాడుతామని చెప్పిన కేం ద్ర ప్రభుత్వం కార్పొరేటర్లకు అప్పజెప్పి సంక్షోభంలోకి నెట్టిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం నా యకుడు కర్నా హనుమ య్య అధ్యక్షతన దొనకొండలో గురువారం గ్రా మీణ బంద్ సన్నాహక సమావేశం ని ర్వహించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చే స్తామని అధికారంలోకి వచ్చిన మోదీ అన్నదాతల ఆత్మహత్యలను పెంచారని కంకణాల ఆరోపించారు. రైతు వ్యతిరేఖ చట్టాలు తెచ్చిన కేంద్రంపై ఏడాదికిపైగా రై తులు పోరాడితే మోదీ తలవంచారన్నారు. ఈనెల 16న చేపట్టే గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కంకణాల పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, సీపీ ఎం కార్యకర్తలు ఎం.అంజిబాబు, ఎం సంతోష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కంకణాల

ఏళ్లు గడుస్తున్నా చేకూరని లబ్ధి

- కేటాయింపులిచ్చి ఖర్చు చేయలేదు
- వెలిగొండ ప్రాజెక్టుపై కాగ్ అక్షింతలు
- మాన్యువల్ డ్రిల్‌పైనా అభ్యంతరం
- కాంట్రాక్టర్ల మార్పునకు ఖర్చుపెంచారు



ఒంగోలు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం, పనులు నిర్వహిస్తున్న తీరు, బడ్జెట్ కేటాయింపుల వ్యయం ఇతరత్రా పలు అంశాల్లో ప్రభుత్వ తీరును కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) తప్పుపట్టింది. ఏళ్లు గడుస్తున్న కరువు పీడిత ప్రాంత ప్రజలకు ప్రాజెక్టు లబ్ధి చేకూరలేదంటూ అసంతృప్తిని వ్యక్తం చేసింది. అసెంబ్లీ సమావేశాల ముగింపు సందర్భంగా గురువారం కాగ్ రిపోర్టును శాసన సభ్యులకు అందజేశారు. నీటి పారుదల రంగంలో రాష్ట్రంలోనే కీలకంగా ఉన్న వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి 2017-18 నుంచి 2020-21 వరకు చేపట్టిన పనులు, వాటి పురోగతి, బడ్జెట్ కేటాయింపు, వ్యయం, పనులు జరుగుతున్న తీరు, అసలు ప్రాజెక్టు నిర్మాణ లక్ష్యం ఇతరత్రా పలు అంశాలను కాగ్ పరిశీలన చేసి ప్రత్యేక నివేదికను ఇచ్చింది. వెలిగొండ ప్రాజెక్టు సమగ్ర స్వరూపాన్ని, ప్యాకేజీల వారీగా పనుల విభజన ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకొని పరిశీలించిన కాగ్ పలు అంశాలను తప్పుబట్టింది. ప్రధానంగా 2021 నాటికి ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించి 17 ఏళ్లు అయినా ఇంకా అసంపూర్తిగానే ఉండటం, కీలకమైన సొరంగాలు, కాలువల నిర్మాణాల్లో లోపాలతో అసంపూర్తిగా ఉన్నట్లు పేర్కొంది. దీంతో ఏళ్లు గడుస్తున్నా నిర్మాణ లక్ష్యం నెరవేరలేదని నివేదికలో పేర్కొన్నారు. టన్నెల్ తవ్వకాల పనులను మిషన్‌తో కాకుండా మాన్యువల్‌గా డ్రిల్ చేయడం సరైంది కాదంది. ఇలా ప్రణాళిక లేకుండా పనులు చేయడంతో పరికరాలు నిరుపయోగంగా మారాయని, మరో వైపు కాంట్రాక్టర్లకు అదనపు పనులు మంజూరు, కొన్ని ప్యాకేజీల్లో మార్పుల వల్ల వ్యయం పెరిగిందని పేర్కొంది. అందులో అదనపు పనులతో రూ.339కోట్లు, అలాగే కాంట్రాక్టర్ల మార్పుతో మరో రూ.419 కోట్లు ఖర్చు పెరిగినట్లు పేర్కొన్నారు. కాంట్రాక్టర్లకు ముందస్తు చెల్లింపులు కాకుండా షెడ్యూళ్లను సమీక్షించాలని కాగ్ స్పష్టంగా సూచించింది. మరోవైపు వెలిగొండకు కేటాయింపులు పెరగ్గా ఖర్చు మాత్రం తక్కువగా చేశారని కాగ్ అసంతృప్తి వ్యక్తం చేసింది. కాగ్ పరిశీలన చేసిన కాలంలో సుమారు రూ.2,190 కోట్లు కేటాయించినా ఖర్చు కేవలం రూ.1,270 కోట్లు మాత్రమే చేశారని పేర్కొంది. నాలుగేళ్ల వరుసగా ఆ ఏడాది ఎంత కేటాయించారు, ఎంత ఖర్చు చేశారన్నది సూచించగా వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా 2020-21లో రూ.918కోట్లు కేటాయించినా కేవలం రూ.318 కోట్లు మాత్రమే ఖర్చుచేసిన వైనం స్పష్టమైంది.

డీఈవోగా సుభద్ర బాధ్యతల స్వీకరణ



ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 8 : జిల్లా విద్యాశాఖాధికారిగా దాట్ల సుభద్ర గురువారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడలో ఉప విద్యాధికారిగా పనిచేస్తున్న సుభద్ర డీఈవోగా ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి చేరుకున్న సుభద్రకు కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఆ తర్వాత డీఈవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జవాబుదారితనంతో బాధ్యతాయుతంగా పనిచేస్తానని తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ నుంచి తన ఉద్యోగ ప్రస్థానం మొదలైందని, అన్నిస్థాయిల్లో తనకు విషయ అవగాహన ఉందన్నారు. ఉద్యోగులు, అధికారులను సమన్వయం చేసుకుని మంచి ఫలితాలు సాధించేందుకు కృషిచేస్తానని తెలిపారు. కాగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సుభద్ర కలెక్టర్ దినేష్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం బండ్లమిట్టలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల స్థాయిని పరీక్షించారు. డీఈవోగా బాధ్యతలు స్వీకరించిన ఆమెను వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిసి అభినందించారు. జిల్లా హెచ్ఎంల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాంతారావు, వై .వెంకట్రావు, కోశాధికారి జీఎస్ఆర్ సాయి, మర్రి శ్రీనివాసరావులు కలిశారు. డైరీని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్టీయూ నాయకులు దాసరి శ్రీనివాసులు, కడియం ప్రసాద్, సీహెచ్.ఆదినారాయణ, ప్రసాదరాజు, కే.ఏసునాధంలు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ఎయిడెడ్ నియామకాల్లో అక్రమాలు

- ఏడుగురి ఎంపిక రద్దు
- ఉప విద్యాధికారికి సంజాయిషీ నోటీసు



ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 8 : జిల్లాలోని ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో భారీగా అక్రమాలు జరిగాయి. అర్హత లేని వారిని సైతం టీచర్ పోస్టులకు ఎంపిక చేశారు. అయితే టీచర్ల ఎంపికకు ఆమోద ముద్ర వేసే అధికారి ఆఖరు నిమిషంలో జరిగిన అక్రమాలు గుర్తించి అర్హత లేని ఏడుగురు అభ్యర్థుల ఎంపికకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదు. దీంతో వీరి ఎంపిక రద్దయినట్లైంది. అర్హత లేని ఏడుగురు అభ్యర్థులను టీచర్ పోస్టులకు ఎంపిక చేసి ఆమోదం కోసం తనకు ప్రతిపాదనలు పంపినందుకు ఒంగోలు ఉప విద్యాధికారి అనితా రోజ్‌రాణికి డీఈవో సంజాయిషీ నోటీసును జారీచేశారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లాలోని ఈతముక్కల ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల, నాగులుప్పలపాడు మండలం చేకూరపాడు ఓరియంటల్ హైస్కూలులో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రెండు పాఠశాలల్లో పోస్టుల భర్తీకి ప్రభుత్వ ప్రతినిధిగా ఒంగోలు ఉపవిద్యాధికారి అనితారోజ్‌రాణిని నియమిస్తూ డీఈవో వీఎస్ సుబ్బారావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ప్రతినిధిగా నియమితులైన అధికారి 2022-23 విద్యా సంవత్సరం విద్యార్థుల నమోదు ఆధారంగా కొత్తగా ఎన్ని పోస్టుల నియమించాలో నిర్ధారించాలి. ఆదేవిధంగా ఆ పోస్టులకు రోస్టర్ పాయింట్ల ప్రకారం రిజర్వేషన్ కూడా నిర్ధారించారు. ఈ పోస్టులకు డీఈవో అనుమతి ఇచ్చిన తర్వాత పత్రిక ప్రకటన ద్వారా అర్హులైన అభ్యర్థుల దరఖాస్తుల కోసం పత్రికా ప్రకటన ఇవ్వాలి. ఆ ప్రకారమే ప్రకటన జారీచేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టుకు, స్కూలు అసిస్టెంట్ పోస్టులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఉత్తీర్ణులైన వారు మాత్రమే అర్హులు. ఈతముక్కల, చేకూరపాడు పాఠశాలలకు ఏడు చొప్పున పోస్టుల భర్తీకి అనుమతించిన నేపథ్యంలో కొందరు టెట్ ఉత్తీర్ణులు కాని వారి దరఖాస్తులను సైతం ఆమోదించి వారితో కూడా రాత పరీక్ష రాయించారు. నిబంధనల ప్రకారం టెట్ అర్హత లేని అభ్యర్థుల దరఖాస్తులు తిరస్కరించి వారిని రాత పరీక్షకు అనుమతించకూడదు. అయితే అందుకు భిన్నంగా వారిని పరీక్షకు అనుమతించడంతోపాటు పోస్టులకు ఎంపిక చేసి ఆ ప్రతిపాదనలను డీఈవో ఆమోదానికి ప్రభుత్వ ప్రతినిధి పంపారు. ఈ మొత్తం వ్యవహారంలో భారీగా అక్రమాలు జరిగినట్లు గుర్తించి ఈతముక్కల పాఠశాల ఎంపికలో ఇద్దరు, చేకూరపాడు ఎంపిక జాబితాలోని నలుగురు అభ్యర్థులను అనర్హులుగా గుర్తించి వారి ఎంపికను డీఈవో రద్దుచేశారు. మిగిలిన వారు విధుల్లో చేరారు. ఈ నేపథ్యంలో ఒంగోలు ఉపవిద్యాధికారి అనితారోజ్‌రాణికి డీఈవో సంజాయిషీ నోటీసులను జారీచేశారు. క్షేత్రస్థాయి నుంచే ఈ ప్రక్రియలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఆయా పోస్టుల భర్తీలో క్షేత్రస్థాయిలోనే అక్రమాలు జరిగితే ఆ తప్పులను విద్యాశాఖ కార్యాలయంపై నెట్టివేసే ప్రయత్నం చేశారనే విమర్శలు ఉన్నాయి.



రాచర్ల పీఎస్‌లో ఆశా కార్యకర్తలు

ఆశావర్కర్లపై పోలీసు ఉక్కుపాదం

- విజయవాడ వెళుతున్న వారిని అరెస్టు చేసిన పోలీసులు
- గిద్దలూరు పోలీసు స్టేషన్‌లో వద్ద ఆందోళన

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 8: ఆశావర్కర్లను పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. వారు విజయవాడ వెళ్లకుండా కట్టడి చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కరించాలంటూ గురువారం ఆశాలు విజయవాడలో తలపెట్టిన ఆందోళనను భగ్నం చేసేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. సుమారుగా 120మందికి పైగా నాయకులకు నోటీసులు జారీ చేసి విజయవాడ వెళితే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. అదేక్రమంలో సీఐటీయూ నాయకులు చీకటి శ్రీనివాసరావు, పెండ్యాల కల్పనలను హౌస్ అరెస్టు చేశారు. అలాగే గిద్దలూరు నుంచి విజయవాడ వెళుతున్న ఆశాలను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీంతో వారు స్టేషన్‌లోనే ఆందోళన కొనసాగించారు. రైల్వేస్టేషన్, బస్టాండ్లలో పోలీసు పికెట్లు ఏర్పాటు చేసి బస్సులు, రైళ్లు తనిఖీ చేశారు. ఒంగోలు డీఎస్పీ కిషోర్ బాబు బుధవారం అర్ధరాత్రి ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో స్వయంగా బస్సులను తనిఖీ చేశారు. నెల్లూరు నుంచి విజయవాడ వెళుతున్న ఏడుగురు ఆశాలను అదుపులోకి తీసుకొన్నారు. సాయంత్రం వరకు వన్‌టౌన్ స్టేషన్‌లో ఉంచి పంపించి వేశారు. బుధవారం ఉదయం నుంచి గురువారం మధ్యాహ్నం వరకు బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో పోలీసుల హడావుడే కనిపించింది. హైవేపై కూడా వాహనాలను తనిఖీ చేసి ఆశాలు విజయవాడ వెళ్లకుండా అడ్డగించారు.

పొగాకు బ్యారన్ దగ్ధం



బ్యారన్ నుంచి వస్తున్న పొగ

పీసీపల్లి, ఫిబ్రవరి 8 : ప్రమాద వశాత్తు పొగాకు బ్యారన్ దగ్ధమైన సంఘటన మండలంలోని రామాపురంలో గురువారం జరిగింది. అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. ఏనుగంటి వెంకట సుబ్బయ్యకు చెందిన బ్యారన్‌ను గ్రామానికి చెందిన మక్కెన శ్రీను లీజుకు తీసుకుని పొగాకు కాల్చుకు వేశారు. గురువారం సాయంత్రం బ్యారన్ పై నుంచి పొగలు బయటకు వస్తుండడం గమనించిన స్థానికులు బ్యారన్ లోపల నిప్పంటుకుని మంటలు వ్యాపించడం చూశారు. వెంటనే కనిగిరి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. బ్యారన్ వద్దకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. ప్రమాదంలో కాల్పు కోసం ఉంచిన 6 క్వింటాల పొగాకు కాలి బూడిదయింది. బ్యారన్‌లోపల ఉన్న గొట్టాలు, టైర్లు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.2లక్షల వరకు రైతుకు నష్టం వాటిల్లిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

వలంటీర్లను అడ్డుకోండి

ఎన్నికల అధికారి లోకేశ్వరరావు



మాట్లాడుతున్న దర్శి నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి లోకేశ్వరరావు

దర్శి, ఫిబ్రవరి 8 : ఎన్నికల ప్రక్రియలో వలంటీర్ల ప్రమేయం లేకుండా అడ్డుకట్ట వేయాలని నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని అధికారులతో ఆయన స మీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన పనుల్లో ఎక్కడైనా వలంటీర్లు జోక్యం చేసుకుంటే కఠిన చర్యలు తీ సుకుంటామని లోకేశ్వరరావు హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరిగేందుకు అధికారులు నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించా రు. సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను గుర్తించి ఎలాం టి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఎలాంటి ప్రలోభాలకు, అధికార ఒత్తిడికి లొంగకుండా నిష్పక్షపాతంగా పనిచేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియ లో అవకతవకలకు పాల్పడితే సంబంధిత అధికారుల పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని లోకేశ్వరరావు హెచ్చరించారు. సమావేశంలో దర్శి, దొనకొం డ, కురిచేడు, ముండ్లమూరు మండలాల తహసీల్దార్‌లు జీ సుజాత, కే సుజాత, సుధాకర్, జీ మధుబాబు, షేక్ మహమ్మద్‌హుస్సేన్, డి ప్యూటీ తహసీల్దార్ ఏవీ రవిశంకర్, ఎన్నికల డి ప్యూటీ తహసీల్దార్ దేవప్రసాద్, పోలీస్, ఎస్ఈబీ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మెప్మాలో అవినీతి ఒప్పుకున్నారు సరే..

వైసీపీ నాయకులపై చర్యలేవి..?

- మేయర్‌ను ప్రశ్నించిన తమ్ముళ్లు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 8: ఒంగోలు నగరంలోని మెప్మాలో జరిగిన అవినీతిపై ఆంధ్ర జ్యోతిలో వచ్చిన కథనం ఒప్పుకున్న మేయర్ గంగాడ సుజాత, దోచుకున్న సొమ్ము రికవరీపై సమాధానం చెప్పాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావే శంలో వారు మాట్లాడుతూ నగరంలో మెప్మాలోని ఆర్పీలు, సీవోలును బాధ్యులను చేస్తూ మాట్లాడిన మేయర్, అవినీతిలో భాగస్వాములైన వైసీపీ నా యకులు, మహిళా నాయకులను కాపాడే ప్రయ త్నాలు చేస్తున్నారని ఆరోపించారు. అవినీతికి కేరా ఫ్ అడ్రస్‌గా ఉన్న మేయర్, గతంలో కనిగిరిలో ఓ సిట్ కేసులో నిందితులుగా ఉన్నారని విమర్శించారు. ఇటీవల త్రోవగుంట వద్ద మండువవారిపాలెం రైతుల భూములను దోచుకున్నారన్నారు. మేయర్ జరిగిన వాస్తవాలను పక్కదారి పట్టించేందుకు ఆ ర్పీల్లో టీడీపీ వారు ఉన్నారని రాజకీయాలను ఆపాదిస్తున్నారని మండిపడ్డారు. బ్యాంకు రుణాల గోల్‌మాల్‌లో బాధితులైన మహిళలకు టీడీపీ అం డగా ఉంటామని తాము చెబితే, టీడీపీ ఆఫీసును ముట్టడిస్తామని మేయర్ చెప్పడం విడ్డూరంగా ఉందని చెప్పారు. పట్టణ పేద మహిళల ఆర్థిక పురోభివృద్ధి కోసం నాడు చంద్రబాబు నాయుడు డ్వాక్రా గ్రూపులు ప్రవేశపెడితే నేడు వైసీపీ పాలనలో పొదుపు మహిళల పేరుతో భారీగా రూ.కో ట్లు దండుకుంటున్నారని ధ్వజమెత్తారు. మెప్మాలో జరిగిన అవినీతిపై స్వయంగా ఒప్పుకున్న ఆమె ఈ కుంభకోణంలో తమ పార్టీకి చెందిన వారిపై ఎ లాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. మేయర్ వాఖ్యలు చూస్తుంటే సుమారు రూ.120కోట్లు అవినీతి జరిగినట్లు తెలుస్తుంద న్నారు. సమగ్ర విచారణ జరిపించి తగిన చ ర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశం లో నాయకులు ఎద్దు శశికాంత్‌భూషణ్, కార్పొరేట ర్ అంబూరి శ్రీనివాసరావు, గోగినేని రామారావు, బండారు మదన్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై ఫిర్యాదులను పరిష్కరిస్తాం

కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 8: ఓటర్ల జాబి తాలోని చేర్పులు, మార్పులపై రాత పూర్వకంగా వచ్చే అభ్యంతరాలను, ఫిర్యాదులను క్షుణ్ణంగా పరి శీలించి పరిష్కరిస్తామని కలెక్టర్ దినేష్‌కుమార్ పే ర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో గురువారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆ యన మాట్లాడారు. ఓటర్ల జాబితాలపై రాజకీయ పార్టీలు సూచించిన అంశాలను పరిగణలోకి తీసుకొని తప్పొప్పులను సరిచేస్తున్నట్లు తెలిపారు. అ సెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఫారం-7 దరఖాస్తు లు 0.1 శాతం కన్నా ఎక్కువ వస్తే ఆ ఓట్లను తొలగించాలంటే రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

వైసీపీలో గందరగోళం

- ఎమ్మెల్యే మహీధర్‌కు నో టికెట్
- తాడేపల్లికి పిల్చి చెప్పిన సీఎం జగన్
- పోటీ చేయలేనని తేల్చిన మాజీ ఎమ్మెల్యే
- మహీధరరెడ్డి స్థానంలో బీసీ మహిళ
- పర్చూరులో అభ్యర్థి కోసం కొనసాగుతున్న అన్వేషణ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మరో సీనియర్ ఎమ్మెల్యేకు ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి షాకిచ్చారు. అదే సమయంలో జగన్ ఏరికోరి తెచ్చుకున్న మాజీ ఎమ్మెల్యే ఆమంచి ఇచ్చిన షాక్ నుంచి ఆ పార్టీ ఇంకా తేరుకోలేదు. అదే సమయంలో ఇప్పటికే ఎమ్మెల్యేలను అటుఇటు బదిలీలు చేసిన నియోజకవర్గాల్లో వైసీపీ పరిస్థితులు ఏ మాత్రం కుదుటపడలేదు. దీనికితోడు రానున్న రోజుల్లో అధికార వైసీపీకి మరికొన్ని షాక్‌లు తగిలే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ముందు నుంచి ఊహిస్తున్నట్లే కందుకూరు స్థానం నుంచి సీనియర్ ఎమ్మెల్యే మహీధరరెడ్డిని సీఎం జగన్ తప్పించి వేశారు. ఆయన స్థానంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన మహిళను రంగంలోకి తేనున్నారు. ఆ మేరకు గురువారం మహీధర్‌రెడ్డిని పిలిపించుకుని 'మీకు ఈసారి టికెట్ లేదు. కందుకూరు నుంచి బీసీ మహిళను రంగంలోకి దింపబోతున్నాం. మీరు సహకరించి గెలిపించండి' అంటూ తేల్చిచెప్పేశారు. అప్పటికే ఆయన వద్ద ఉన్న గూడూరుకు చెందిన ఆదిశంకర ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ పెంచలయ్యను ఆయనతోపాటు ఉన్న ఆయన ఇద్దరు కుమార్తెలను పరిచయం చేశారు. అంతకుముందే పెంచలయ్యను పార్టీలో చేర్చుకుని వైసీపీ కండువా మెడలో వేశారు. నెల్లూరుకు చెందిన మాజీ మంత్రి అనిల్ కుమార్‌యాదవ్ పెంచలయ్యను సీఎంకు పరిచయం చేసి పార్టీలో చేరతాడని అవకాశం ఇస్తే ఆయన లేక ఆయన కుమార్తెలలో ఒకరు కందుకూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా రంగంలో ఉంటారని చెప్పారు. చర్చల అనంతరం జగన్ వారికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. పెంచలయ్యతోపాటు ఆయన కుమార్తె అరవింద, మూడవ కుమార్తె డాక్టరు వి.ఐశ్వర్యలు జగన్‌ను కలిశారు. తాను లేకుంటే తన కుమార్తెల్లో ఒకరికి టికెట్ ఇవ్వాలని ఆయన కోరినట్లు తెలిసింది. మహిళా అభ్యర్థిని రంగంలో దింపాలని భావిస్తున్నామని మీ కుమార్తెలు అరవింద, ఐశ్వర్యలలో ఒకరిని మీరే ఎంపిక చేసుకుని రంగంలో దింపాలని జగన్ సూచించినట్లు తెలిసింది. ఆ తర్వాత మహీధరరెడ్డిని కూడా పిలిచి విషయం సూటిగా చెప్పేశారు. పెంచలయ్య కుమార్తెల్లో అరవిందకు వివాహం కాగా ఐశ్వర్యకు ఇంకా వివాహం కాలేదు. దీంతో అరవింద కుటుంబసభ్యులు అంగీకరిస్తే ఆమెను కానిపక్షంలో ఐశ్వర్యను రంగంలో దింపుతానని పెంచలయ్య చెప్పినట్లు తెలిసింది.

మహీధర్‌రెడ్డి దారెటు?

గతంలో ఒకసారి సీఎంను కలిసిన సందర్భంలో మహీధరరెడ్డి తనకు అవకాశం ఇవ్వాలా వేరొకరిని రంగంలోకి దించాలనేది మీ ఇష్టమని, మీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పినట్లు సమాచారం. నెల్లూరు లోక్‌సభ నుంచి పోటీ చేస్తారని భావించిన రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి కందుకూరు మహీధరరెడ్డికే ఇవ్వాలని కోరినట్లు సమాచారం. దీంతో మహీధరరెడ్డికి అవకాశం వస్తుందని భావించారు. తాజా పరిణామాల్లో నెల్లూరు సిటీ స్థానం నుంచి తాను సూచించిన వారికి కాకుండా వేరేవారికి అవకాశం ఇవ్వటంతోపాటు ఆ విషయాన్ని తనకు కూడా చెప్పకపోవటంతో వేమిరెడ్డి అలకబూనారు. ఎంపీ స్థానం నుంచి పోటీ చేయలేనని చెప్పినట్లు తెలిసింది. తన రాజకీయ భవితవ్యంపై మహీధరరెడ్డి ఏ నిర్ణయం తీసుకుంటారనేందుకు వేచిచూడాల్సిందే. విషయం తెలిసిన కందుకూరు నియోజకవర్గంలోని ఆయన అభిమానులు కొందరు మహీధర్‌రెడ్డికి ఫోన్‌చేయగా అందుబాటులో లేడని తెలుస్తోంది.

పర్చూరుపై ఆమంచి హ్యాండ్సప్

మరోవైపు పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ పర్చూరు నుంచి పోటీ చేయకూడదన్న ఆలోచనకు వచ్చినట్లు తెలిసింది. ఆమేరకు ఐప్యాక్ ప్రతినిధులకు ఆయన సమాచారం ఇచ్చినట్లు కూడా తెలిసింది. దీన్ని దృష్టిలో ఉంచుకునే పర్చూరుకు మరో అభ్యర్థికోసం అధిష్ఠానం వెతుకులాట చేపట్టింది. నియోజకవర్గానికి చెందిన గొట్టిపాటి భరత్‌ను పిలిచి ఇప్పటికే జగన్ మాట్లాడి ఉన్నారు. అలాగే దర్శి ఎమ్మెల్యే వేణుగోపాల్, ఒంగోలుకు చెందిన వ్యాపారి కంది రవిశంకర్‌లను కూడా పర్చూరు నుంచి పోటీచేయాలని అధిష్ఠానంలోని నాయకులు సూచించారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి, వ్యాపారి రవిశంకర్‌ల నుంచి సానుకూలత వ్యక్తం కాలేదని సమాచారం. మంత్రి బొత్స ద్వారా పర్చూరుకు చెందిన ఎన్నారై రామాంజనేయులు అవకాశం ఇస్తే పోటీకి సిద్ధమని సమాచారం పంపినట్లు తెలుస్తోంది. సీఎం జగన్ సూచనల మేరకు కాపు సామాజికవర్గం వారినే రంగంలో దించే ఉద్దేశంతో అధిష్ఠానంలోని నాయకులు అన్వేషణ ప్రారంభించారు. సీఎం జగన్ ఢిల్లీ పర్యటన నుంచి వచ్చిన తర్వాత పర్చూరు అభ్యర్థిపై ఓ నిర్ణయానికి రావచ్చని తెలుస్తోంది. ఆమంచి చీరాలలోని తన అనుచరులతో పదేపదే మంతనాలు జరుపుతూ ఉన్నారు. దీంతో ఆయన ఏరూపంలో ముందడుగు వేస్తారనే విషయంపై కూడా వైసీపీ అధిష్ఠానం దృష్టిసారించి ఉంది. ఈనెల 14 తర్వాత ఆమంచి తన నిర్ణయాన్ని బహిరంగపరిచే అవకాశం కనిపిస్తోంది. దీంతో చీరాల, పర్చూరు నియోజకవర్గాల వైసీపీలో కూడా కొన్ని మార్పులు జరిగే అవకాశం కనిపిస్తుండగా శ్రేణుల్లో అలజడి తీవ్రమైంది.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

అద్దంకి, ఫిబ్రవరి 8: రోడ్డు భద్రతా నియమాలు పాటించటం ద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని ఆర్టీసీ అద్దంకి డిపో అసిస్టెంట్ మేనేజర్ మహబూబీ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా గురువారం సాయంత్రం ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది, విద్యార్థులు బస్టాండ్ వద్ద నుండి అంబేడ్కర్ బొమ్మ వరకు ర్యాలీ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది ఏడుకొండలు, నాగేశ్వరరావు, తిరుపతిరెడ్డి, తిమ్మాయపాలెం హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

11న విద్యోన్నతి ఫౌండేషన్ పరీక్ష

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 8: విద్యోన్నతి ఫౌండేషన్ ద్వారా పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శ్రీప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 11వ తేదీ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు స్కాలర్‌షిప్ ఎంపికకై నైపుణ్యత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ డైరెక్టర్ దూళిపాళ్ల వీరనారాయణ తెలిపారు. గురువారం స్థానిక పట్టణ అభివృద్ధి కమిటీ కార్యాలయంలో పరీక్ష కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులకు ఇంటర్మీడియట్‌లో సంవత్సరానికి రూ.10 వేల చొప్పున 15 మందికి ఇస్తామన్నారు. అద్దంకి మండలంలో 11 ఉన్నత పాఠశాలలు, ఇంకొల్లు మండలంలో ఏడు ఉన్నత పాఠశాలలు, పంగులూరు మండలంలో ఆరు ఉన్నత పాఠశాలలు, మొత్తం 24 ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌కై దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఆయా పాఠశాలల విద్యార్థులు ఆరోజు ఉదయం 9 గంటలకు పరీక్ష సెంటర్‌కు రావాలని తెలిపారు. కార్యక్రమంలో బుద్దిష్ట్ జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్ళూరు బాబురావు, హెచ్‌ఎం గంగాధర్, అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కులు అందజేత

ఇంకొల్లు, ఫిబ్రవరి 8: ఇంకొల్లు మండలంలో 1028 గ్రూపులకు నాలుగో విడత ఆసరా నగదు చెక్కు అందజేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ ముఖ్యఅతిథిగా హాజరై రూ.9 కోట్ల 71లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మోహన్, ఆచారి, శ్రీదేవి, బండారు అనూష పాల్గొన్నారు.

కాకాని హనుమంతరావుకు నివాళి



హనుమంతరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకి, ఫిబ్రవరి 8: ప్రముఖ వ్యాపారి కాకాని హనుమంతరావుకు పలువురు నివాళులర్పించారు. పట్టణంలోని కాకానిపాలెంలో హనుమంతరావు దశదిన కర్మ జరిగింది. అద్దంకి, చీరాల ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్, శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య, తదితరులు కాకాని చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు.

రాఘవరావుకు నివాళులర్పించిన టీడీపీ నేతలు

చినగంజాం, ఫిబ్రవరి 8: మండలంలోని కడవకుదురు గ్రామానికి తెలుగు యువత మండల మాజీ అధ్యక్షుడు అనంత రాఘవరావు దశదిన కర్మకు గురువారం టీడీపీ మండల నాయకులు హాజరై నివాళులర్పించారు. ఇటీవల అనారోగ్యంతో ఆయన మృతి చెందాడు. గ్రామంలో రాఘవరావు స్వగృహం వద్ద జరిగిన దశదిన కర్మ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, టీడీపీ బాపట్ల పార్లమెంట్ యాదవ సాధికార కమిటీ కన్వీనర్ నక్కల వీరరాఘవులు, న్యాయవాది కోటిక ఉదయభాస్కరరావు, చినగంజాం, కారంచేడు మండలాల ప్రధాన కార్యదర్శులు అబ్దుల్‌కలాం అజాద్, షేక్ ఖాసీం, నాయకులు వడ్లమూడి సత్యనారామణ, కె.విష్ణు, దండుప్రోలు తిరుపతిరావు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలను నిర్బంధించడం దుర్మార్గం

చినగంజాం, ఫిబ్రవరి 8: ఆశా కార్యకర్తలను నిర్బంధించి వారి హక్కులను కాలరాయడం దుర్మార్గపు చర్యని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.ప్రతాప్‌కుమార్ ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఆశాలకు ఇచ్చిన హామీలను నేరవేర్చకపోగా పోలీసులను అడ్డు పెట్టి నిర్బంధాలకు గురుచేయడం సరైంది కాదని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికైనా వారి సమస్యల పరిష్కారానికి కృషిచేసి కనీస వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశాల డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే పోరాటల ద్వారానే పరిష్కరించుకోవాల్సి వస్తుందని ప్రతాప్‌కుమార్ హెచ్చరించారు.

సాగర్ నీటి సరఫరాలో నిర్లక్ష్యం

- బడ్జెట్‌లో అంచనాలు కొండంత..
- రెట్టింపు అయిన అప్పులు
- గుండ్లకమ్మ ప్రాజెక్టు ముంపు గ్రామాల సమస్యల ప్రస్తావనే లేకపోవటం బాధాకరం
- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్



రవికుమార్

అద్దంకి, ఫిబ్రవరి 8: సాగర్ నీటి సరఫరా ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతుందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవి కుమార్ ధ్వజమెత్తారు. బుధవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన రాష్ట్ర బడ్జెట్ పట్ల జగన్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో వ్యవహరించిందని అన్నారు. ఈమేరకు గురువారం ఆయన ఓప్రకటన విడుదలచేశారు. బడ్జెట్ ప్రసంగంలో అన్ని రంగాలలో రా ష్ట్రం పురోగమిస్తుందని ప్రభుత్వం చెప్పుకోవటం సిగ్గుచేటన్నారు. బడ్జెట్ అంచనాలు కొండంత, ఖర్చులు పిసరంతగా ఉన్నాయన్నారు. రూ.13 వేల కోట్ల రెవెన్యూ లోటును రూ.44 వేల కోట్లకు, రూ.35 వేల కోట్ల ద్రవ్యలోటును రూ.60 వేల కోట్లకు పెంచిన ఘనత బుగ్గనదేనన్నారు. పన్నుల బాదుడు తప్ప బడ్జెట్‌లో కొత్త అంశాలు ఏమి లేవని చెప్పారు.

వైసీపీ హయాంలో అప్పులు రెట్టింపు అయ్యాయన్నారు. రాష్ట్రాన్ని వైసీపీ ప్రభుత్వం అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చిందన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి స్కీమ్ ఓ స్కామ్‌గా మారిందన్నారు. ధరల పెంపు, పన్నులు మోయలేని భారంగా మారాయన్నారు. రైతుల ఆత్మహత్యలలో దేశంలో మన రాష్ట్రం ముందు వరుసలో ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వ తప్పుడు విధానాల వల్ల తెలంగాణ రాష్ట్ర ఆదాయం పెరిగి, ఏపీ ఆదాయం తగ్గిందన్నారు. కేంద్రం నుంచివచ్చిన నిధులను దారి మళ్లించిందన్నారు.

సాగర్ ఆయకట్టు పరిధిలో లక్షలాది ఎకరాలు బీడులుగా వదిలేసి రైతులు కూలీలుగా మారారని ఎమ్మెల్యే రవికుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. వెలుగొండకు నీరు వస్తే పశ్చిమ ప్రకాశం జిల్లా నీటి ఎద్దడి తీరుతుందని ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. అయితే, బడ్జెట్‌లో వెలుగొండ కు కేటాయింపులు తక్కువగా ఉండటంతో పూర్తిగా ప్రాజెక్టు మనుగడకే ముప్పు ఏర్పడిందన్నారు. వెలుగొండను పూర్తి చేయటంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు ముంపు గ్రామాల సమస్యల ప్రస్తావనే లేకపోవటం బాధాకరమని రవి కుమార్ పేర్కొన్నారు.

బడ్జెట్ కొండంత.. విడుదల పిసరంత

- అప్పులాంధ్రప్రదేశ్‌గా మార్చిన వైసీపీ ప్రభుత్వం
- ఎమ్మెల్యే ఏలూరి ధ్వజం



సాంబశివరావు

పర్చూరు, ఫిబ్రవరి 8: ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్లో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అంకెలను మసిపూసి మారేడుకాయ చేసి అంకెల గారడి చేశారని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఈమేరకు గురువారం ఓప్రకటన విడుదలచేశారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం గొప్పలు చెప్పేందుకు కొన్ని అంకెలు పెంచి చూపారన్నారు. ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తున్నామని చాటుకునేందుకు రెవెన్యూ లోటును తగ్గించి చూపారని ఏలూరి మండిపడ్డారు. చేసిన అప్పులను చెల్లించే పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేదన్నారు. రూ.13వేల కోట్ల రెవెన్యూ లోటును రూ.44 వేల కోట్లకు, రూ.35వేల కోట్ల ద్రవ్యలోటును రూ.60వేల కోట్లకు పెంచిన ఘనుడు బుగ్గన అన్నారు. వైసీపీ ప్రభుత్వం 2019-20లో రూ.1.80 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టారని, 2024-25కి రూ.2.86 లక్షల కోట్లు దాటడం అసమర్థ ఆర్థిక నిర్వహణకు నిదర్శనమన్నారు.

అయిదేళ్లలో సగటు రెవెన్యూ ఆదాయం పెరిగినా, వైసీపీ ప్రభుత్వం చేతకాని తనం వల్ల రెవెన్యూ లోటు, ద్రవ్యలోటు భారీగా పెరిగాయని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. వాస్తవ మూలధన వ్యయం తక్కువగా ఉందని, ఆస్తుల కల్పనే లేదని చెప్పారు. అప్పులపై వడ్డీ కట్టలేని దుస్థితికి రాష్ట్రాన్ని తీసుకువచ్చారన్నారు. కార్పొరేషన్‌ల రుణాలు పెరిగినా ఆదాయాలు లేవన్నారు. పన్నుల బాదుడు తప్ప బడ్జెట్‌లో కొత్త అంశాలు ఏమీ లేవన్నారు. ప్రస్తుతం ఏపీ అప్పులు రూ.11.58 లక్షల కోట్లు అన్నారు. మద్యం బాండ్లు రూ.16,000 కోట్లు, కార్పొరేషన్ హామీలు రూ.1,10,603 కోట్లు, కార్పొరేషన్ తనఖాలు రూ.94,928 కోట్లు, డిస్కమ్ బకాయిలు రూ.27,284 కోట్లు, కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు 95,400 కోట్లు, అప్పులు రెట్టింపు అయ్యాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వం తీసుకున్న దానికంటే 4 రెట్ల అప్పు వైసీపీ చేసిందన్నారు. వైసీపీ హయాంలో అప్పుల భారం తప్ప మరీ ఏమీ లేదన్నారు. రిజిస్ట్రేషన్‌లు భారీగా పెంచిన జగన్ సర్కార్, విద్యుత్ చార్జీల వడ్డనలో కూడా ఎక్కడా రాజీపడలేదన్నారు. ఇప్పటికే విద్యుత్ చార్జీలను ఏడుసార్లు పెంచి, సర్‌చార్జీల పేరుతో మరింతగా వడ్డింపు వడ్డించిందన్నారు. మద్యం మీద వచ్చే డబ్బుతో జగన్ ప్రభుత్వం నడుస్తుందన్నారు. ఆరోగ్య శ్రీకి బడ్జెట్‌లో నిధులు అంతంత మాత్రమేనన్నారు. తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను సైకో ప్రభుత్వం రద్దుచేసిందన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం రద్దుచేయటంతోపాటు, 35 లక్షల పొదుపు గ్రూపులకు బడ్జెట్‌లో మొండిచేయి చూపిందన్నారు. రైతు ప్రభుత్వ అని గొప్పలు చెప్పుకుంటూ రైతు భరోసా లబ్ధిదారుల సంఖ్యను తగ్గించి రైతులను నిలువునా మోసం చేశారన్నారు. పేరుకే బీసీ సంక్షేమం అని సబ్‌ప్లాన్ నిధులు రూ.75వేల కోట్లు దారి మళ్లించి, 30 పథకాల రద్దు చేసిన ఘనత జగన్ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. యువకుడు మృతి

మార్టూరు , ఫిబ్రవరి 8: జాతీయ రహదారిపై మండలంలోని బొల్లపల్లి కాలువ సమీపంలో ద్విచక్రవాహనాన్ని వెనుకనుంచి కారు ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతి చెందాడు. మరో ఇద్దరికి గాయాలైన సంఘటన గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఈప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులలో షేక్ నాగూర్ వలి అలియాస్ గాంధి(26) సంఘటనా స్థలంలో మృతి చెందాడు. మరో ఇద్దరు యువకులు ఎస్‌కే నసీర్, టి.హరీష్‌కు గాయాలయ్యాయి. ఈ ముగ్గురు జె.పంగులూరు మండలం రామకూరు గ్రామానికి చెందిన వారు. అందిన సమాచారం మేరకు.. ముగ్గురు యువకులు ద్విచక్రవాహనంపై రామకూరు నుంచి మార్టూరులో సినిమా చూడడానికి వెళ్లేక్రమంలో సాగర్ కాలువ పక్కన రోడ్డు గుండా జాతీయ రహదారిపైకి వచ్చారు. అదే సమయంలో ఒంగోలు వైపు నుంచి బొల్లపల్లి టోల్‌గేట్ దాటిన కారు వేగంగా వస్తూ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈప్రమాదంలో ముగ్గురు యువకులు రోడ్డుపై పడిపోయారు. వారిలో నాగర్ వలి తల రోడ్డు బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నాగూర్ వలి తండ్రి గతంలోనే చనిపోగా, తల్లి దివ్యాంగురాలు. అతను గుంటూరులోని ఒక ప్రైవేట్ బ్యాంక్‌లో పని చేస్తున్నాడు. గాయపడిన నసీర్ అనే యువకుడు ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ప్రమాదానికి గురైన కారులో గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం జగ్రవూరుకు చెందిన ఎన్.జయన్నారాయణ, కొండపి మండలం పోరిరెడ్డిపాలెంకు చెందిన కె.శివన్నారాయణ ప్రయాణిస్తున్నారు.

సమాచారం అందగానే ఏఎస్‌ఐ సైదా, బాషా సంఘటనాస్థలాన్ని పరిశీలించి 108లో మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నాగూరువలి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు దర్యాప్తు చేసున్నారు.

విద్యుత్ అధికారుల తనిఖీలు.. 71 కేసులు నమోదు



వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు

మేదరమెట్ల, ఫిబ్రవరి 8: విద్యుత్ శాఖ అధికారులు తనిఖీలు చేసి 71 కేసులు నమోదు చేసి రూ.5 లక్షల 84 వేలు అపరాధ రుసుం విధించినట్లు ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. కొరిశపాడు మండలంలోని 12 గ్రామాలలో విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఒకరు దొంగతనంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు గుర్తించి రూ.లక్ష, 2 బాక్ బిల్లింగ్ కేసులకు రూ.లక్ష, అదనపు లోడు వాడుతున్న 64 సర్వీసులకు రూ.3 లక్షల నాలుగు వేలు, శాంక్షనేతర కేటగిరీలో విద్యుత్ వినియోగిస్తున్న నలుగురికి రూ.80 వేలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈఈలు సత్యనారాయణ, సురేంద్రబాబు, డివిజన్ పరిధిలోని ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. తాగునీరు వృథా



కుళాయికి ట్యాప్ లేకపోవటంతో వృథాగా పోతున్న నీరు

అద్దంకి, ఫిబ్రవరి 8: చిన్నపాటి శ్రద్ధ వహిస్తే నీటి వృథాను అరికట్టే అవకాశం ఉన్నా స్థానిక అధికారుల నిర్లక్ష్యంతో వృథాగా పోతుందనే విమర్శలు వస్తున్నాయి. మండలంలోని చక్రాయపాలెంకు ధర్మవరం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి నీటి సరఫరా జరగాల్సి ఉండగా పథకం పూర్తిగా అటకెక్కింది. దీంతో ప్రత్యామ్నాయంగా చ క్రాయపాలెం సమీపంలో గుండ్లకమ్మ నదిలో బావిని ఏర్పాటుచేసి అక్కడ నుంచి గ్రామంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌కు పంపింగ్ చేస్తున్నారు. ట్యాంక్ నుంచి నీటిని విడుదల చేసిన సమయంలో కుళాయిల నుంచి నీరు వృథాగా పోతుందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ట్యాప్‌లు మరమ్మతులకు గురైనచోట మరలా కొత్తవి ఏర్పాటు చేయకపోవటంతో నీరు వృథాగా పోతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

నగదు అపహరణ

అద్దంకి, ఫిబ్రవరి 8: కలెక్షన్ బాయ్ వద్ద బ్యాగ్‌ను దొంగ చోరీ చేశాడు. స్థానికుల కథనం మేరకు.. అద్దంకి పట్టణంలోని పాత గాంధీబొమ్మ సెంటర్‌లో చిన్ని ప్రసాద్ దుకాణంలో గుమస్తాగా పనిచేసే గార్లపాటి శ్రీనివాసరావు గురువారం రాత్రి షాపుల వద్ద బకాయిల వసూలు కోసం భవానిసెంటర్‌లో ఓ దుకాణం వద్దకు వెళ్ళాడు. దుకాణం వ్యక్తి వద్ద నగదుకు సంబంధించి ఓచర్ పరిశీలిస్తుండగా వెనుక నుంచి నెత్తిన టోపి పెట్టుకున్న యువకుడు వచ్చి క్యాష్ బ్యాగ్‌ను లాక్కొని మోటార్‌సైకిల్‌పై దర్శి రోడ్డులో వెళ్ళిపోయాడు. వెంటనే కేకలు వేసినప్పటికి అప్పటికే అక్కడ నుంచి వెళ్ళిపోయాడు. దుకాణంలో అమర్చిన సీసీ కెమెరాలలో చోరీకి సంబంధించిన దృశ్యాలు రికార్డు అయ్యాయి. క్యాష్ బ్యాగ్‌లో సుమారు రూ.20 వేలు ఉన్నాయి. ఇదే తరహాలో గత ఏడాది ఆయిల్ మిల్ రోడ్డు, ఎస్‌బీఐ రోడ్డులో కూడా కలెక్షన్ బాయ్స్ వద్ద క్యాష్ బాగ్‌ల చోరీలు జరిగాయి.

అదుపుతప్పి పొలాల్లోకి దూసుకుపోయిన కారు

అద్దంకి, ఫిబ్రవరి 8: కారు అదుపుతప్పి పల్టీలు కొడుతూ పొలాల్లోకి దూసుకుపోయింది. అందులో ఉన్న తల్లీ కొడుకులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. ముండ్లమూరు మండలం మారెళ్లకు చెందిన చుండి విజయభాస్కరరెడ్డి అద్దంకిలో స్థిరపడి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. తల్లి సీతారావమ్మ(94)ను కారులో ఒంగోలులో వైద్యశాలలో పరీక్షలు చేయించుకొని తిరిగి అద్దంకి వస్తున్నారు. ఈక్రమంలో గురువారం సాయంత్రం బలరామకృష్ణాపురం పునరావాసకాలనీ క్రాస్‌రోడ్డు సమీపంలో నామ్ రోడ్డుపై ఒక్కసారిగా కారు అదుపుతప్పి పల్టీలు కొడుతూ రోడ్డు మార్జిన్‌లో గుండా పొలాల్లోకి దూసుకెళ్లి ఆగిపోయింది. కారులో ఉన్న ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వెంటనే స్నేహితులకు సమాచారం ఇవ్వటంతో వేరొక వాహనంలో అద్దంకిలోని ప్రయివేట్ వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందారు. కారు పూర్తిగా దెబ్బతినగా, ఇద్దరికి స్వల్ప గాయాలతో బయటపడటంతో ఊపిరిపీల్చుకున్నారు.

బాధ్యతలు స్వీకరించిన సొసైటీ పాలకవర్గం

పంగులూరు, ఫిబ్రవరి 8: మండలంలోని జాగర్లమూడివారిపాలెం పీఏసీఎస్ అధ్యక్షుడిగా జాగర్లమూడి వెంకటరత్నం బాధ్యతలు స్వీకరించారు. గురువారం ముప్పవరంలోని సొసైటీ కార్యాలయంలో ఇన్‌చార్జ్ సీఈవో మోహనకృష్ణ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. పాలకవర్గ సభ్యులుగా పూసల హనుమంతరావు, బండి ఓబుల్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో పానెం నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ముప్పవరం సర్పంచ్ రౌతు సాంబశివరావు, ఎంపీటీసీ పూసల గంగాధర్, జాగర్లమూడి యల్లమందరావు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు మాత్రలు పంపిణీ

పంగులూరు, ఫిబ్రవరి 8: పిల్లలలో ఉండే నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించే కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంపీడీవో వ్యాద్యుబాబు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివచెన్నయ్య కోరారు. శుక్రవారం పాఠశాలల్లోని బాల బాలికలకు ఈ మాత్రలు మింగించే కార్యక్రమంపై మండల పరిషత్ కార్యాలయంలో గురువారం విద్య, వైద్యాధికారుల సమావేశంలో వారు మాట్లాడారు. 1నుండి 19 సంవత్సరాల వయస్సుగల వారికి విధిగా మాత్రలు మింగించాలని ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ బాల రాజేశ్వరి, ఎంఈవో నాగభూషణం, సూపర్‌వైజర్లు అనూరాధ, హరిబాబు, మదర్షా పాల్గొన్నారు.

ఆశావర్కర్‌ల అక్రమ అరెస్ట్‌లు అన్యాయం

చీరాలటౌన్, ఫిబ్రవరి 8: సమస్యలు పరిష్కరించాలని వేడుకుంటుంటే మహిళలనే సానుభూతి లేకుండా అక్రమ అరెస్టులు చేయించడం అన్యాయమని పలువురు ఆశా వర్కర్‌లు పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ చలో విజయవాడకు చేపట్టిన కార్యక్రమానికి అనుమతులు లేకపోవడంతో పోలీసులు బుధవారం రాత్రి నుండే ముందస్తు నోటీసులు అందజేశారు. చీరాల పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన సుమారు 30 మందిని ఆయా స్టేషన్‌లకు తరలించారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో సత్ఫలితాలు

కొత్తపేట(చీరాల), ఫిబ్రవరి 8: వ్యవసాయంలో మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా సత్ఫలితాలు సాధించవచ్చని శాస్త్రవేత్తలు వీరబాబు, దక్షిణామూర్తి, ప్రేమరంజిత పేర్కొన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రం-1లో గురువారం రైతులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో వారు మాట్లాడారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేవిధంగా కార్యాచరణను రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సలహా మండలి కోఆర్డినేటర్ ఓబయ్య, ఏడీఏ ఎర్రాయం, ఏవో కాశీవిశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

సెయింట్‌ఆన్స్ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్

చీరాల, ఫిబ్రవరి 8: సెయింట్ ఆన్స్ కళాశాల ట్రిపుల్‌ఈ విభాగ అధ్యాపకుడు ఆంతోనిరాజ్ డాక్టరేట్ పొందారు. గురువారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు మాట్లాడుతూ ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించేవిధంగా చేపడుతున్న చర్యలను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణుగోపాలరావు మాట్లాడుతూ ఏ మాగ్జిమమ్ పవర్ హార్వెస్టింగ్ ఫర్ ఫోటో వోల్టాయిక్ సిస్టమ్ అండర్ పేస్టల్ షేడింగ్ కండిషన్స్ యూజింగ్ ఏఐ టెక్నిక్స్ అనే అంశంపై పరిశోధన చేసి ఆంతోనిరాజ్ డాక్టరేట్ పొందారన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి

చీరాల, ఫిబ్రవరి 8: పట్టణ పరిధిలో పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ విజయసారథి అన్నారు. ఎక్కడ కూడా పారిశుధ్య చర్యలు సక్రమంగా లేవనే ఫిర్యాదులు అందకూడదని కార్మికులకు చెప్పారు. స్థానిక కమిషనర్ కార్యాలయంలో గురువారం ఏఐటీయూసీ ప్రతినిధి కోటిదాసు నేతృత్వంలో కమిషనర్ విజయసారథిని పారిశుధ్య కార్మికులు కలసి సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించటమే లక్ష్యంగా పనిచేయాలని చెప్పారు.

బల్లికురవ తహసీల్దార్‌గా సుభద్ర బాధ్యతల స్వీకరణ

బల్లికురవ, ఫిబ్రవరి 8: బల్లికురవ తహసీల్దార్‌గా ఎం.సుభద్ర గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీలలో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న కె.రవిబాబును గుంటూరు జిల్లాకు బదిలీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్న సుభద్రను బల్లికురవ మండలానికి నియమించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం తహసీల్దార్ సుభద్ర మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు. రైతులకు ఏవైన సమస్యలు ఉంటే నేరుగా వచ్చి తెలియజేయాలని కోరారు. ఈసందర్భంగా తహసీల్దార్‌ను డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి

చినగంజాం, ఫిబ్రవరి 8: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్రబాబు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో బూత్‌లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లు, సెక్టార్ అధికారులతో గురువారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సెక్టార్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లోని వసతులను పరిశీలించి, సరైన వసతులు లేకపోతే కల్పించాలన్నారు. బూత్ లెవల్ అధికారులు తుది ఓట్ల జాబితాలో తప్పులులేకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావు, రీసర్వే డీటీ డి.శ్రీకాంత్, సెక్టార్ అధికారులు, సూపర్‌వైజర్లు, బూత్‌లెవల్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పోటీలు

ఇంకొల్లు, ఫిబ్రవరి 8: ఇంకొల్లు రాడికల్ హ్యూమనిస్టు సెంటర్ 33వ వార్షికోత్సవం సందర్భంగా ఇటీవల విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈ పోటీ పరీక్షలు నిర్వహించగా గురువారం విజేతలను ప్రకటించారు. విజేతలకు ఈనెల 11న జరిగే వార్షికోత్సవ సభలో బహుమతులు ప్రదానం చేస్తున్నట్టు హ్యూమనిస్టు సెంటర్ అధ్యక్షుడు మేడూరి సత్యనారాయణ తెలిపారు.

నిరుపయోగంగా నీటిశుద్ధి కేంద్రాలు

తాగునీటి కోసం ప్రజల అవస్థలు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 8: గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధిజలాలు అందించేందుకు ఏర్పాటు చేసిన సామాజిక నీటిశుద్ధి కేంద్రాలు నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. గత ప్రభుత్వ హయాంలో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన కేంద్రాలు ప్రస్తుతం ధ్వంసమై మూలకు చేరాయి. కొన్ని కేంద్రాల్లో మోటార్లు, ట్యాంకులు, ఇతరత్రా పరికరాలు సైతం చోరీకి గురయ్యాయి. అధికారులు వాటిపై దృష్టి పెట్టకపోవడంతో ప్రస్తుతం అవి ఎందుకూ పనికిరాకుండా పోయాయి. దీంతో ప్రజలు తాగునీటిని కొనుగోలు చేసి తాగాల్సిన దుస్థితి నెలకొంది. ప్రధానంగా మండలంలోని జీ.చెర్లోపల్లి, కొండాయపాళెం, వీరారెడ్డిపల్లి గ్రామాల్లో ఒక్కో శుద్ధి జల కేంద్రాన్ని రూ.12.30 లక్షల వ్యయంతో ఏర్పాటు చేశారు. ప్రారంభించిన కొద్ది రోజుల పాటు కేంద్రాలు బాగా పనిచేశాయి. అనంతరం వాటి నిర్వహణ మరిచిపోవడంతో మరమ్మతులకు గురై మూలకు చేరాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శుద్ధిజల కేంద్రాలకు మరమ్మతులు చేపట్టి తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



జీ.చెర్లోపల్లిలో నిరుపయోగంగా ఉన్న శుద్ధిజల కేంద్రం

పవన్ కల్యాణ్‌ను కలిసిన భోగినేని

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 8: జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌ను ఉదయగిరి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు భోగినేని కాశీరావు బుధవారం రాత్రి మంగళగిరి పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులు, స్థానిక సమస్యలను పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషిచేయాలని పవన్‌కల్యాణ్ సూచించినట్లు కాశీరావు తెలిపారు. పవన్‌కల్యాణ్‌ను కలిసిన వారిలో జిల్లా, మండల జనసేన పార్టీ నాయకులు పోలిశెట్టి శ్రీనివాసులు, కల్లూరి సురేంద్ర, బండారు సత్యనారాయణ, తదితరులున్నారు.



పవన్‌కల్యాణ్‌కు సమస్యలు వివరిస్తున్న కాశీరావు

రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓటమి తథ్యం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 8: ప్రజల్లో తెలుగుదేశం పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని, రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తథ్యమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక చెంచలబాబు అతిథిగృహంలో కార్యకర్తలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీలోకి వలసలు అధికమయ్యాయని, ఎన్నికల సమయానికి వైసీపీ ఖాళీ అవుతుందన్నారు. సీఎం జగన్‌రెడ్డి మరలా అధికారం చేజిక్కించుకొనేందుకు ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పి మాయ చేస్తున్నారన్నారు. జనసేన, టీడీపీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో టీడీపీ 160 అసెంబ్లీ సీట్లు కైవసం చేసుకొని చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, నాయకులు ఎల్‌సీ రమణారెడ్డి, సయ్యద్ జాఫర్‌మొహిద్దీన్, ఆవుల వెంకటేశ్వర్లు, శివ, బ్రహ్మారెడ్డి, బాలకృష్ణ, చల్లగొలుసు రమణయ్య, సురేష్, సుమన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న చెంచలబాబు

ఆశా వర్కర్ల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లు

అనంతసాగరం, ఫిబ్రవరి 8: సమస్యల పరిష్కారం కోసం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట గురువారం ఆశా వర్కర్లు ఆందోళన చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దారు నరసింహ రావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అన్వర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

అంకెల గారడీ బడ్జెట్ : బొల్లినేని

ఉదయగిరిరూరల్, ఫిబ్రవరి 8: ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రవేశపెట్టిన బడ్జెట్ లెక్కలు అంకెల గారడీని తలపిస్తున్నాయని మాజీ శాసనసభ్యుడు బొల్లినేని వెంకటరామారావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రజలపై పన్నుల బాదుడు తప్ప ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని దుయ్యబట్టారు. ఆరోగ్యశ్రీ, పొదుపు సంఘాలకు బడ్జెట్‌లో మొండిచేయి చూపించడం ఎంతవరకు సమంజసమన్నారు. అలాగే రైతుభరోసా లబ్ధిదారుల సంఖ్యను తగ్గించడంతో పాటు సున్నావడ్డీ రుణాలు, జగనన్న విద్యాదీవెన, నేతన్న నేస్తం పథకాల్లోనూ కోత విధించారన్నారు. బీసీ సబ్‌ప్లాన్ నిధులను సైతం దారి మళ్లించి 30 పథకాలను రద్దు చేశారన్నారు. ఇలాంటి వికృత చేష్టలతో రాష్ట్రాన్ని అప్పులాంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎద్దేవా చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 8: ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా గురువారం తహసీల్దారు నెప్రహరాబాబు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని గంగిరెడ్డిపల్లి, గానుగపెంటపల్లి, గుడినరవ, వెంగళరావునగర్, గండిపాళెంతోపాటు ఉదయగిరి పట్టణంలోని పోలింగ్ కేంద్రాల పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో విద్యుత్, నీటి వసతి, ర్యాంపులు తదితర వాటిని పరిశీలించారు. వసతుల్లేని పోలింగ్ కేంద్రాల్లో వసతుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సర్వేయరు రవి, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఉదయగిరి, ఫిబ్రవరి 8: నియోజకవర్గంలోని దివ్యాంగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఉదయగిరి నియోజకవర్గ బీజేపీ నాయకుడు రమేష్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సక్షమ్ ఆధ్వర్యంలో దివ్యాంగుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు నూరు శాతం రాయితీతో బస్‌పాసులు, రూ.10 వేలు పింఛన్, ట్రైసైకిళ్లు, అంత్యోదయ బియ్యం కార్డులు అందేలా కృషి చేస్తానన్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తన సొంత నిధులతో దివ్యాంగులను ఆదుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండవ వెంకట్రావు, సక్షమ్ జిల్లా నాయకుడు ఆదోని రమణయ్య, నాయకులు ఆవుల రాజా, సయ్యద్ షాబ్‌జాన్, రోశయ్య, జయసుధ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి

న్యాక్ కేంద్రం తనిఖీ

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 8: పట్టణంలోని న్యాక్ కేంద్రాన్ని గురువారం జిల్లా శిక్షణాధికారి బీ అప్పారావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రంలోని వసతులు, బోధన విధానంపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా వివిధ చేతివృత్తులు చేసుకొనే వారికి ఈ కేంద్రం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కేంద్రం ద్వారా చేతివృత్తుల వారు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్చి 8, 9 తేదీల్లోపు పొగాకు వేలం నిర్వహించాలి

మర్రిపాడు, ఫిబ్రవరి 8: డీసీపల్లి పొగాకు బోర్డులో గురువారం రైతుల ఫ్లోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకుడు మూలి వెంగయ్య మాట్లాడుతూ మార్చి 8, 9 లోపల పొగాకు వేలం నిర్వహించాలని, ఆర్డరు పెట్టిన ప్రతీ కంపెనీల బయ్యర్లు వేలంలో పాల్గొనేలా చూడాలని, ప్రతీ కేజీ ధర రూ. 250 ఉండేలా చూడాలని, కొనుగోలు చేసిన వారంలోపు నగదును రైతు అకౌంట్‌లో జమచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్, రైతు నాయకులు నరసపనాయుడు, బోర్డు పరిధిలోని రైతులు, పాల్గొన్నారు.

ఆర్టీసీ లక్కీడ్రాలో విజేతలకు బహుమతులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 8: ఉదయగిరి ఆర్టీసీ డిపో పరిధిలోని ఉదయగిరి-సీతారామపురం మార్గంలో తిరిగే బస్సుల ప్రయాణికుల ఆదరణ పొందేందుకు లక్కీడ్రా నిర్వహించినట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ జనవరి మాసంలో సీతారామపురం మార్గంలో తిరిగిన బస్సుల్లో లక్కీడ్రా బాక్సులు ఏర్పాటు చేశామన్నారు. కాగా లక్కీడ్రాలో మహేష్, ఝాన్సీరాణి విజేతలుగా నిలిచారన్నారు. వారికి బహుమతులు అందచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగభూషణం, వెంకటేశ్వర్లు, సలాం, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పదిలో నూరు శాతం ఫలితాలకు కృషి

సంగం, ఫిబ్రవరి 8: జిల్లాలో మార్చిలో జరిగే పదవ తరగతి పరీక్షల్లో నూరుశాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నట్లు కావలి డివిజన్ డిప్యూటీ డీఈవో రఘురామయ్య తెలిపారు. గురువారం ఆయన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూరు శాతం ఫలితాల సాధనకు ప్రత్యేక తరగతులతోపాటు స్టడీక్లాస్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా సాయంత్రం సమయంలో ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి నైట్ విజిట్ చేసి వారికి సందేహాలు ఉంటే నివృత్తి చేయాలని సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జానకిరామ్, మల్లయ్య, ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య, పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్నడిప్యూటీ డీఈవో

పీఏసీఎస్ చైర్మన్‌గా శివకుమార్‌రెడ్డి

సంగం, ఫిబ్రవరి 8: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా పెరమన గ్రామానికి చెందిన పందిళ్లపల్లి శివకుమార్‌రెడ్డిని నియమించారు. శివకుమార్‌రెడ్డి పదవీ కాలం జనవరి 31తో ముగియడంతో ప్రభుత్వం గతంలోని త్రిసభ్య కమిటీ సభ్యుల పదవీ కాలాన్ని మరో ఆరు నెలలపాటు పొడిగిస్తూ జీవో విడుదల చేసింది. దీంతో శివకుమార్‌రెడ్డి చైర్మన్‌గా మరో ఆరు నెలలపాటు కొనసాగనున్నారు. దీంతో ఆయన మేకపాటి రాజమోహన్ రెడ్డికి, స్థానిక శాసనసభ్యుడు విక్రమ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

తహసీల్దారుకు సన్మానం

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 8: మండల తహసీల్దారుగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన నెప్రహరాబాబును గురువారం స్థానిక కార్యాలయంలో మండల వైసీపీ నాయకులు సన్మానించారు. మెట్ట ప్రాంత రైతులు, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయనకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముర్తుజాహుస్సేన్, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గడియాల్బీ యస్థానీ, వైసీపీ నాయకులు జీ శ్రీనివాసులురెడ్డి, యస్థానీ, అక్కులరెడ్డి, ఉప్పుటూరి శ్రీనివాసులు, హరి, యస్థానీ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయండి

సంగం, ఫిబ్రవరి 8: సచివాలయాల్లో జరుగుతున్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం వేసి త్వరగా పూర్తిచేయాలని ఆర్డీవో మధులత ఆదేశించారు. గురువారం ఆమె సంగం సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల వివరాలను తహసీల్దారు రమాదేవిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి సచివాలయం పరిధిలో చేయాల్సిన, చేసిన రిజిస్ట్రేషన్లు గురించి ఆరా తీశారు. అనంతరం పల్లిపాలెంలో శ్లాబు పెచ్చులూడి పడుతున్న పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి ప్రత్యామ్నాయంగా అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రమాదేవి, పలువురు అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



తహసీల్దారుతో మాట్లాడుతున్న ఆర్డీవో

కులవివక్ష చూపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

● తహసీల్దార్‌కు ఎమ్మార్పీఎస్ నేతల వినతి

వింజమూరు, ఫిబ్రవరి 8: మండలంలోని మాధవనగర్‌లో మాదిగల పట్ల కులవివక్ష చూపుతూ ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎంఎస్పీ జిల్లా సీనియర్ నాయకుడు పందిటి అంబేద్కర్ మాదిగ స్థానిక తహసీల్దారు రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందచేశారు. గ్రామంలో ఫ్లోరిన్ కారణంగా ఓ దాత సహాయంతో ఏర్పాటుచేస్తున్న వాటర్ ప్లాంట్‌ని కొంతమంది కులంపేరుతో దూషిస్తూ అడ్డుకోవాలని చూస్తున్నారన్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వాటర్ ప్లాంట్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ మండల ఇన్‌చార్జ్ గోచిపాతల ఆనంద్‌మాదిగ, మొలబంటి సుధాకర్‌మాదిగ, మొలబంటి మాధవ, మొలబంటి శ్రీను, కుల్లూరి కొండయ్య, మొలబంటి రామయ్య, మొలబంటి నాగయ్య, మొలబంటి మాల్యాద్రి, పాల్గొన్నారు.

ఆత్మకూరు తహసీల్దారుగా శివనాగిరెడ్డి

ఆత్మకూరు, ఫిబ్రవరి 8 : ఆత్మకూరు తహసీల్దారుగా ఎస్ శివనాగిరెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. శివనాగిరెడ్డికి పలువురు వీఆర్వోలు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

పేదల బియ్యం పక్కదారి !

● మహిళల ద్వారా కొనుగోళ్లు ● అధికారపార్టీ నేతల అండదండలు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 8: మండలంలో రేషన్ బియ్యం అక్రమ దందా జోరుగా సాగుతుంది. ఎండీయూ నిర్వాహకులు కార్డుదారులకు బియ్యం ఇచ్చినట్లే తిరిగి కిలో రూ.8 వంతున కొనుగోలు చేస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో మహిళలకు కూలి ఇచ్చి రేషన్ బియ్యం సేకరిస్తున్నారు. అనంతరం వాటిని నిల్వ చేసి, రాత్రిళ్లు లారీల్లో కావలికి అక్కడ నుంచి చెన్నైకి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దందాకు అధికార పార్టీ నాయకుల అండదండలు ఉండడంతో మండల అధికారులు పట్టించుకోవడం లేదు. కాగా పలు సందర్భాలలో పోలీసులు, విజిలెన్స్ అధికారులు దాడులు చేసి రేషన్ బియ్యం పట్టుకున్నారు. అయినా అధికారుల కళ్లుగప్పి అక్రమార్కులు బియ్యాన్ని సరిహద్దులు దాటిస్తున్నారు. బియ్యం పక్కదారి పట్టకుండా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని మండలంలోని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



వైసీపీ నేత బాబుల్‌రెడ్డి టీడీపీలో చేరిక

కావలి, ఫిబ్రవరి8: కావలి రూరల్ మండలం వైసీపీ మాజీ అధ్యక్షుడు చింతం బాబుల్‌రెడ్డి గురువారం తన అనుచరులతో టీడీపీలో చేరారు. ముసునూరులోని కావ్యక్రిష్ణారెడ్డి నివాసంలో జరిగిన ఓ కార్యక్రమంలో బాబుల్‌రెడ్డికి క్రిష్ణారెడ్డి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ మాజీ సైనికుడితో ప్రారంభమైన టీడీపీలో చేరికలు ఎన్నికల వరకు కొనసాగుతాయన్నారు. కావలిలో దుష్టపాలనను సాగనంపే వరకు పోరాడతామన్నారు.

● జగజ్జీవన్‌రామ్ స్మృతివనం ఏర్పాటుకు కృషి

టీడీపీ అధికారంలోకి వచ్చాక కావలిలో జగజ్జీవన్‌రామ్ స్మృతివనం, అరుంధతీయులకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషిచేస్తానని కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. కావలి అరుంధతీయపాలెం నుంచి అరుంధతీయులు తప్పెట్ల మోతల మధ్య పట్టణంలో ర్యాలీగా ముసునూరులోని ఆయన ఇంటికి వచ్చి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పేదరికం నుంచి వచ్చిన వాడినని పేదల కష్టాలు తెలుసునని, ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో బొమ్మా రామారావు, జానకి, పులి శ్రీను, పులి జయంతి, దావులూరి తిరుపతమ్మ, వసంత్‌కుమార్, కత్తి విజయ్ తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ నేత బాబుల్‌రెడ్డిని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కావ్య క్రిష్ణారెడ్డి

డీ వార్మింగ్‌ను విజయవంతం చేయండి

లింగసముద్రం, ఫిబ్రవరి 8 : మండలంలో శుక్రవారం జరిగే డీ వార్మింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వీ రమేష్ చెప్పారు.గురువారం ఆయన మాట్లాడుతూ స్థానిక ఆరోగ్య కేంద్రంలో డీ వార్మింగ్ కార్యక్రమం మందులను బుధవారమే పంపిణీ చేసినట్టు చెప్పారు. ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలందరికి మధ్యాహ్న భోజనం అనంతరం ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు గణనీయమైన సీట్లు

కావలి,ఫిబ్రవరి8: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గణనీయమైన సీట్లు సాధిస్తుందని కావలి కాంగ్రెస్ ఇన్‌చార్జి చింతల వెంకట్రావు తెలిపారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌లో పదవులు పొందిన రాష్ట్ర అధికార ప్రతినిధి లేళ్లపల్లి సురేష్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి అనుమలశెట్టి వాసు, పట్టణ అధ్యక్షుడు పొదలకూరు కల్యాణ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు మానసలకు ఆయన నియామక పత్రాలు అందచేసి, అభినందించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలన్నా, నిరుద్యోగ సమస్య తీరాలన్నా, కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. కాగా పేద, మధ్య తరగతి వారంతా కాంగ్రెస్‌కు ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.



మాట్లాడుతున్న చింతల వెంకట్రావు

11న కలిగిరి మండల సమావేశం

కలిగిరి, ఫిబ్రవరి 8: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 11న మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మెట్టుకూరు శిరీష అధ్యక్షతన నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ ఎస్ఎన్‌వీ బ్రహ్మచారి తెలిపారు. అన్ని శాఖల ప్రగతిపై సమావేశంలో చర్చిస్తామని, అధికారులు సమగ్ర నివేదికతో రావాలన్నారు.

వివాదాస్పద డొంక దారి పరిశీలన

ఉలవపాడు, ఫిబ్రవరి 8: కరేడు గ్రామంలో రెండు కులాల మధ్య తలెత్తిన వివాదాస్పద డొంక పోరంబోకు దారిని గురువారం తహసీల్దార్ కే రవిబాబు పరిశీలించారు. కర్మకాండలకు వెళ్లే మార్గాన్ని గ్రామంలోని ఓరుగంటి రెడ్లు ఆక్రమించుకున్నారని, ఆది ఆంధ్ర కాలనీ వాసులు గత మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. కాగా గురువారం రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆయన డొంకను పరిశీలించి ఇరువర్గాలతో మాట్లాడారు. సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలని చెప్పారు. సర్వే చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని సర్వేయర్ శ్రీనివాసులను ఆదేశించారు. కాగా రెవెన్యూ అధికారులు మాదిగలకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో న్యాయపోరాటం చేయాల్సి వస్తుందని మహాజన సోషలిస్టు పార్టీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రావినూతల ముత్తుమాదిగ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం

కందుకూరు, ఫిబ్రవరి 8: పేద మహిళలకోసం టీడీపీ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో మూడవ బ్యాచ్‌కు గురువారం నుంచి శిక్షణను పార్టీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బ్యాచ్‌లో ఎక్కువమంది దరఖాస్తు చేసుకోవటంతో మూడు షిఫ్టులలో శిక్షణనిచ్చేలా చేశామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, షేక్ రఫీ, చిలకపాటి మధుబాబు, కూనం నరేంద్ర, వడ్డెళ్ల రవిచంద్ర, షేక్ సలాం తదితరులు పాల్గొన్నారు.



కుట్టు శిక్షణ ప్రారంభిస్తున్న ఇంటూరి

కమ్మపాలెంలో ప్రముఖులు

జలదంకి, ఫిబ్రవరి8: శ్రీకాకుళం పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు గొట్టిపాటి కొండపనాయుడు తల్లి సుబ్బమ్మ ఉత్తరక్రియలు గురువారం మండలంలోని కమ్మపాలెంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, కావలి టీడీపీ ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి, ఉదయగిరి టీడీపీ నేత కాకర్ల సురేష్, ఆయన సోదరుడు సునీల్, కావలి, ఉదయగిరి నియోజకవర్గాలకు చెందిన వివిధ రాజకీయపార్టీల నాయకులు తదితరులు హాజరయ్యారు. కొండపనాయుడును పరామర్శించి ఆయన తల్లి సుబ్బమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

తక్షణ సాయంతో ప్రాణదాతలుగా మారండి



మాట్లాడుతున్న ఆర్టీవో సుధాకర్‌రెడ్డి

కావలి రూరల్, ఫిబ్రవరి 8: ప్రమాద సమయంలో ప్రతి ఒక్కరూ తక్షణ సాయం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఆర్టీవో వై. సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ రహదారి మాసోత్సవాల్లో భాగంగా అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో సుధాకర్‌రెడ్డి, ఎంవీఐ సుందరరావు, అసిస్టెంట్ ఎంవీఐ కరుణాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాలు ప్రమాదానికి గురైనప్పుడు ఇన్సూరెన్స్ రావాలంటే తప్పనిసరిగా రవాణాశాఖ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు రవిప్రకాష్, వాయిస్ ఆఫ్ ముస్లిం మైనారిటీ, ఏడీవీ సంస్థ, అమ్మనాన్న ఫౌండేషన్ సభ్యులు, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు అనధికారిక విక్రయాలపై కఠిన చర్యలు

కందుకూరు, ఫిబ్రవరి 8: వేలం కేంద్రాల వెలుపల పొగాకు కొనుగోళ్లు, అమ్మకాలు నిషిద్ధమని, అనధికారికంగా అమ్మినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని పొగాకు బోర్డు సెక్రటరీ దివి వేణుగోపాల్,ఆర్ఎం ఎం. లక్ష్మణరావులు స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని రెండో వేలంకేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా బోర్డు అధికారులు, రైతు ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పొగాకు రెలుపులు, క్యూరింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలిచ్చారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి రాజగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటారుకు త్వరలో మరమ్మతులు

బిట్రగుంట, ఫిబ్రవరి 8: విద్యుత్ మోటరును పలుమార్లు మరమ్మతు చేయించినా సమస్య పరిష్కారం కాలేదని, ప్రస్తుతం బయట నుంచి నీరు తెప్పించుకుంటున్నామని వైద్యాధికారిని జీ హారిక తెలిపారు. త్వరలో మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటునట్లు తెలిపారు. కోవూరుపల్లి పీహెచ్‌సీలో గురువారం ఆమె మాట్లాడుతూ నెల క్రితం నుంచే సమస్య ఏర్పడిందరన్నారు.

పరీక్ష అట్టల పంపిణీ

ఉలవపాడు : రామాయపట్నం జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు అదే పాఠశాలకు చెందిన పీడీకే జీవన్ కుమార్ గురువారం పరీక్ష అట్టలు అందచేశారు. పీడీ కుమార్తె చిన్నారి రోహిత జీవన్ చేతుల మీదగా అట్టలు అందించి వారికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం. ఎస్ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందుపూరు కుటుంబానికి పలువురి పరామర్శ

బిట్రగుంట, ఫిబ్రవరి 8: బోగోలు మండలం కోవూరుపల్లికి చెందిన టీడీపీ నాయకులు, ఇందుపూరు కుటుంబ సభ్యులను గురువారం పలువురు నేతలు పరామర్శించారు. కావలి టీడీపీ నాయకులు మాలేపాటి సుబ్బానాయుడు, కావ్యకృష్ణారెడ్డి వేర్వేరుగా వచ్చి పరామర్శించారు. మాజీ మండల అధ్యక్షుడు ఇందుపూరు ధనుంజయరెడ్డి పార్టీ కోసం ఎంతగానో పని చేశారని మాలేపాటి అన్నారు. అనంతరం కుటుంబ సభ్యులు ఇదుపూరు రామోహన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, భాస్కర్‌రెడ్డిలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.నాగేశ్వరావు, ఎల్.సుధీర్‌బాబు, కాండ్ర రఘురామ్‌నాయుడు, ఎల్.మాధవరావు, ఎన్.రంగ య్య, నిరంజన్‌రెడ్డి, నేతి పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ తనిఖీ

ఉలవపాడు : కందుకూరు డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఏ శ్రీనివాస్ గురువారం ఉలవపాడు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఎస్సై ఏ బాజీరెడ్డి విధి నిర్వహణలో భాగంగా అందుబాటులో లేరు.

వ్యవసాయానికి ఏడు గంటల విద్యుత్‌ను ఒప్పుకోం..

బిట్రగుంట, ఫిబ్రవరి 8: వ్యవసాయానికి ఏడు గంటల విద్యుత్ ఇస్తే ఊరుకునేదిలేదని టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు అన్నారు. బోగోలు మండలంలో గురువారం రెండు గంటలు విద్యుత్ కోత పెట్టారని రైతులు మొరపెట్టుకోవడంపై ఆయన స్పందించారు. ఈ విషయమై విద్యుత్ శాఖ అధికారిని వివరాలు కోరామని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 7 గంటల విద్యుత్ అందచేస్తున్నామని ఏఈ చెప్పారని అన్నారు. అధికారులు స్పందించి 9గంటల విద్యుత్ ఇవ్వకుంటే ఉద్యమిస్తామన్నారు. ఆయన వెంట కాండ్ర రఘురామ్‌నాయుడు, కోడూరు వెంకటేశ్వర్లురెడ్డి, గద్దె కొండయ్య, యర్రం వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు ఉన్నారు.

ఎస్టీయూ మండల కమిటీ ఎన్నిక

ఉలవపాడు : ఎస్టీయూ మండల కమిటీ ఎన్నిక గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శ్రీహను అభిషేక్ అధ్యక్షతన జరిగింది. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఏవీ నాయుడు, జీ రమేష్‌లను ఎన్నుకోగా, ఉపాధ్యక్షులుగా పీ పిచ్చయ్య, యూ శ్రీనివాసులు, వై రాములు, బీవీ నాగమణి, సీహెచ్ చెంచయ్య, కార్యదర్శులుగా కే జీవన్ కుమార్, ఎం లక్ష్మీ, యూ మురళి, టీవీ రత్తమ్మ, పీ వెంకట్రావు, కోశాధికారిగా ఆర్ భాస్కర్, మైనారిటీ కార్యదర్శిగా ఎస్‌కే బాబ్జి, మహిళా కార్యదర్శిగా ఎం అరుణకుమారిలను ఎన్నుకున్నారు.

బీజేపీ సమన్వయకర్తగా హరిబాబు బాధ్యతలు

కందుకూరు, ఫిబ్రవరి 8: బీజేపీ కందుకూరు నియోజకవర్గ సమన్వయకర్తగా ఆపార్టీ సీనియర్ నాయకుడు ఘట్టమనేని హరిబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆ పార్టీ మండలాల బాధ్యులు, అనుబంధ సంఘాల బాధ్యులు, సీనియర్ నాయకులతో పాటు కార్యకర్తలు, అభిమానులు పాల్గొని హరిబాబును అభినందించారు. సమావేశంలో పార్టీ నాయకులు మన్నేపల్లి వరప్రసాదరావు, ముప్పల భూషయ్య, జొన్నాదుల సురేష్, చిన్ని పాండురంగయ్య, ఉన్నం భాస్కరరావు, జొన్నాదుల మోహనరావు, బెజవాడ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరించిన ఘట్టమనేని హరిబాబు తదితరులు

దోమల నివారణకు చర్యలు

కావలి : పట్టణంలో దోమల నివారణకు మున్సిపల్ అధికారులు గురువారం చర్యలు చేపట్టారు. పట్టణంలోని మురుగు కాలువల్లో స్ప్రేయింగ్, వీధుల్లో ఫాగింగ్‌ను చేపట్టారు. పట్టణంలో దోమలు ఎక్కువగా ఉండటంతో ప్రజలు చర్యలు చేపట్టారు.



దివ్యాంగుల పాఠశాలలో జన్మదిన వేడుకలు

కందుకూరు, ఫిబ్రవరి 8: పట్టణంలోని గోకరాజుపాలెంకు చెందిన చిన్నారి దండే జ్ఞానఖ్యాతి ఆరాధ్య తన జన్మదిన వేడుకలను గురువారం కోవూరు రోడ్డులో ఉన్న స్వర్ణ స్వయంకృషి దివ్యాంగుల పాఠశాలలో జరుపుకున్నారు. చిన్నారులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయటంతో పాటు వారికి అవసరమైన సరుకులు అందజేశారు. కార్యక్రమంలో చిన్నారి తల్లిదండ్రులు రమేష్, మంజూష, గంటా వెంకటరావు, కె. హరిబాబు తదితరులు పాల్గొన్నారు.




తన ఇద్దరు కుమార్తెలతో కలిసి సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన ఆదిశంకర కాలేజీ చైర్మన్ పెంచలయ్య, సీఎం పక్కన కందుకూరు ఎమ్మెల్యే మహీధరరెడ్డి

అన్వేషించి.. చివరికి!

- ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డికి వైసీపీ షాక్
- కందుకూరు టికెట్ బీసీకే
- జగన్‌ను కలిసిన 'ఆదిశంకర' విద్యాసంస్థల చైర్మన్ పెంచలయ్య, ఆయన కుమార్తెలు
- వీరిలో ఒక్కరికి టికెట్ అని చెప్పిన సీఎం

కందుకూరు : కందుకూరు రాజకీయం శరవేగంగా మారుతోంది. ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డికి వైసీపీ అధిష్ఠానం షాక్ ఇచ్చింది. కందుకూరు టికెట్‌ను యాదవ సామాజికవర్గానికి ఇవ్వనున్నట్లు 20 రోజుల క్రితమే మహీధర రెడ్డికి సూచనప్రాయంగా సమాచారం ఇచ్చారు. వైసీపీ బీసీ విభాగంలో బాధ్యుడిగా ఉన్న బొట్ల రామారావు, కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, కందుకూరుకు చెందిన గ్రానైట్ వ్యాపారి అప్పనబోయిన నరసింహం తదితరుల పేర్లు పరిశీలించిన విషయం తెలిసిందే. అయితే మహీధరరెడ్డిని కాదని విజ యం సాధించటం అసాధ్యమన్న ఆలోచనతో కందుకూరు బరిలో నిలిచేందుకు బుర్రా వెనుకాడటం, మిగిలిన ఇద్దరు ఆర్థికంగా సరితూగలేరని నిర్ధారణకు వచ్చిన వైసీపీ అధిష్ఠానం బలమైన అభ్యర్థి కోసం అన్వేషణ ప్రారంభించింది. ఈ క్రమంలో యాదవ సామాజికవర్గం నుంచి బలమైన అభ్యర్థి దొరకనందున తిరిగి మహీధరరెడ్డికే టికెట్ ఇవ్వనున్నట్లు కూడా వార్తలు వచ్చాయి. అయితే అనూహ్యంగా గురువారం తిరుపతి జిల్లా గూడూరులోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ వి.పెంచలయ్య కుటుంబ సభ్యులను పిలిపించుకున్న జగన్ వారిని ఎమ్మెల్యే మహీధరరెడ్డి సమక్షంలోనే పార్టీలో చేర్చుకోవటం, వారే అభ్యర్థని చెప్పడం విశేషం. కాగా, కందుకూరు కోసం పెంచలయ్య కుటుంబాన్ని రంగంలోకి తీసుకురావటంలో నెల్లూరు నగర అనిల్‌కుమార్ యాదవ్ కీలకపాత్ర పోషించినట్లు తెలిసింది. జరుగుతున్న పరిణామాల పట్ల కొంత అవగాహన, సంసిద్ధతతో ఉన్న ఎమ్మెల్యే మహీధరరెడ్డి ఈ పరిణామం పట్ల పెద్దగా ఆశ్చర్యానికి గురికానప్పటికీ తనదైన శైలిలో సీఎంకు సమాధానం చెప్పి వచ్చేసినట్లు తెలిసింది. కందుకూరు నియోజకవర్గంలో బలమైన వర్గం, క్యాడర్‌తోపాటు అన్నివర్గాల ఆదరణ ఉన్న మహీధరరెడ్డి రాజకీయ అడుగులు ఈ కీలకసమయంలో ఎటువైపు పడతాయనేది వేచి చూడాల్సిందే.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి 5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
శుక్రవారం 9 ఫిబ్రవరి 2024







పరిపాలనా భవనానికి తాళం వేస్తున్న దృశ్యం

పునరావాస గ్రామాల పెద్దలు, కాపులతో కలిసి పోర్టు పరిపాలనా కార్యాలయం వద్దకు వెళుతున్న ఎమ్మెల్యే మహీధరరెడ్డి

మహీధర్‌రెడ్డి మండిపాటు!

- పోర్టు నిర్వాసితులకు మద్దతుగా ఆందోళన
- పరిపాలనా కార్యాలయానికి తాళం
- బాధితులు బయట ఆందోళన చేస్తుంటే లోపల కూర్చొంటారా!?
- పూర్తిస్థాయిలో న్యాయం చేయాల్సిందే
- అంతవరకు పనులు జరగనివ్వను : ఎమ్మెల్యే

గురువారం మధ్యాహ్నం శాసనసభా ప్రాంగణం

తిరుపతి జిల్లా గూడూరులోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలల చైర్మన్ వి.పెంచలయ్య తన ఇద్దరు కుమార్తెలు వి.అరవింద, డాక్టరు వి.ఐశ్వర్యలతో కలిసి సీఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డితో కలిశారు. వీరిని పార్టీలో చేర్చుకుంటున్నట్లు ప్రకటించిన జగన్ ఆ వెంటనే ఎమ్మెల్యే మహీధరరెడ్డిని పిలిపించుకుని పరిచయం చేశారు. 'అన్నా.. మీకు గతంలో చెప్పాను కదా అభ్యర్థి ఫైనలయ్యే ముందు మీకు మరలా చెబుతానని.. పెంచలయ్య ఇద్దరు కుమార్తెలలో ఒకరిని అభ్యర్థిగా పోటీకి పెట్టాలని నిర్ణయించాను. వారిద్దరిలో ఎవరు బెటర్ అనేది మీరు ఆలోచించి సూచన చేస్తే తదనుగుణంగానే నిర్ణయం తీసుకుంటాను. వారిని గెలిపించుకుని వచ్చే బాధ్యత తీసుకోండి. మీ భవిష్యత్తు నేను చూసుకుంటా'నని స్పష్టంగా చెప్పినట్లు తెలిసింది. దీంతో మహీధరరెడ్డి 'మళ్లీ ఆ ఆప్షన్ నాకెందుకు మీరే నిర్ణయించండి ఎవరైనా నాకు ఓకే." అని వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

సాయంత్రం ఆరు గంటలు రామాయపట్నం పోర్టు ప్రాంతం

అమరావతి నుంచి నేరుగా రామాయపట్నం పోర్టు నిర్మాణ ప్రాంతానికి వెళ్లి పునరావాస గ్రామాల ప్రజలతో కలిసి ఆందోళనకు దిగారు. పోర్టు నిర్వాసిత గ్రామాలైన కర్లపాలెం, ఆవులవారిపాలెం, మొండివారిపాలెం గ్రామస్థులతో కలిసి రామాయపట్నం పోర్టు పరిపాలనా కార్యాలయానికి వెళ్లారు. కార్యాలయంలో ఉన్న అధికారులు, సిబ్బందిని బయటకు పిలిపించి తాళం వేసేశారు. నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు పోర్టు పనులను జరగనివ్వబోమని హూంకరించారు. బాధితులు బయట ఆందోళన చేస్తుంటే కనీసం పట్టించుకోకుండా మీరు లోపల కూర్చుని పనులు చేసుకుంటుంటారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

● పోర్టు అధికారులపై ఆగ్రహం

పోర్టు అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్వాసితులకు పునరావాస ప్యాకేజి ఇవ్వడంలో ప్రభుత్వం, పోర్టు అథారిటీ తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. పునరావాస ప్యాకేజీ ప్రకటించిన మేరకు ఇవ్వాలని పలుదఫాలు పోర్టు అధికారులను కోరడంతోపాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా చలనం లేదని విమర్శించారు. ఈ సందర్భంగా పోర్టు నిర్మాణ కాంట్రాక్టరు ప్రతినిధులు తగు చర్యలు తీసుకుంటా మని మహీధరరెడ్డికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా బాధితులకు న్యాయం జరిగే వరకు పనులు జరగనివ్వబోమని స్పష్టం చేశారు. పునరావాస గ్రామాల ప్రజల డిమాండ్లకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. రాత్రి పొద్దుపోయేవరకు ఆందోళన కొనసాగింది.

- కందుకూరు

రవాణా శాఖలో మొరాయిస్తున్న సర్వర్

● వారం రోజులుగా నిలిచిన సేవలు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) ఫిబ్రవరి 8 : రవాణా శాఖలో సర్వర్ మొరాయిస్తుండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏళ్ల తరబడి కార్డులు కోసం ప్రజలు ఎదురు చూస్తుంటే కొంతమందికి మాత్రమే ఇప్పటివరకు కార్డులు అందాయి. ఇక ప్రస్తుతం ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ లైసెన్స్‌లకు సంబంధించిన సర్వర్ రాష్ట్రవ్యాప్తంగా పనిచేయక పోవడంతో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. డ్రైవింగ్ లైసెన్సులపై అవగాహన పెరగడంతో వాహనాలు కలిగిన ప్రతి ఒక్కరు లైసెన్సులు పొందేందుకు ముందుకు వస్తున్నారు. ఈ క్రమంలో ప్రతిరోజు జిల్లా వ్యాప్తంగా 100 ఎల్ఎల్ఆర్ టెస్టులు, 80కిపైగా డ్రైవింగ్ టెస్టులు రవాణా శాఖ కార్యాలయాల్లో జరుగుతున్నాయి. అయితే, ఆరు రోజులుగా ఈ టెస్టులకు సంబంధించిన సర్వర్ పూర్తిగా పనిచేయక పోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ లైసెన్స్ కోసం ముందుగా ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న వారు టెస్టుల కోసం కార్యాలయాలకు వస్తున్నారు. గంటల సమయం ఎదురు చూసినా సర్వర్ పనిచేయడం లేదని అధికారులు, సిబ్బంది చెప్పడంతో వెనుదిరుగుతున్నారు. సర్వర్ ఎప్పుడు పనిచేస్తుందో అన్న దానిపై అధికారులకూ స్పష్టత లేకపోవడంతో ప్రజలకు స్పష్టంగా సమాధానం చెప్పలేకున్నారు. ఈ వ్యవహారంపై డీటీసీ చందర్ మాట్లాడుతూ సర్వర్ డౌన్ కారణంగా తమ సిబ్బంది టెస్టులను నిర్వహించలేకపోతున్నట్లు చెప్పారు. పూర్తిస్థాయిలో సర్వర్ ఎప్పుడు వస్తుందో చెప్పలేమని అన్నారు.

జీతం ఎప్పుడొస్తుందో ?

- 9వ తేదీ వచ్చినా జమకాని నగదు
- ఉద్యోగుల్లో కొందరికే చెల్లింపు
- చేతిలో చిల్లిగవ్వ లేక పెన్షనర్ల అవస్థలు



నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 8 : ప్రతి నెలా ఒకటోతేదీన పెన్షన్లు, జీతాలు వస్తాయని ఎదురు చూస్తున్న పెన్షనర్లు, ఉద్యోగులకు నిరాశే మిగులుతోంది. నెలంతా కష్టపడి పని చేసిన ఉద్యోగులకు జీతాలు అందని పరిస్థితి నెలకొంది. ఈ నెల 9వ తేదీ వచ్చినా చాలామంది ఉద్యోగులకు వేతనాలు జమకాలేదు. వివిధ రకాల రుణాలకు ఈఎంఐలు, పిల్లల చదువులు, ఇతరు ఫీజులు, వైద్య ఇతర ఖర్చులకు చేతిలో నగదు లేక అవస్థలు పడుతున్నారు. కొన్ని శాఖల్లో కొంతమంది ఉద్యోగులకు జీతాలు జమ అయితే, అదేశాఖలో ఇంకొందరికి జమ కావడం లేదు.

● 21,331 మంది పెన్షనర్లు

జిల్లాలో 21,331 మంది పెన్షనర్లు ఉండగా, వీరికి ప్రతినెలా రూ.99.5 కోట్ల పెన్షన్ చెల్లించాల్సి ఉంది. పదవీ విరమణ వయసు వరకు ప్రభుత్వానికి, ప్రజలకు సేవలందించిన వీరు ప్రస్తుతం వేతనాల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. వృద్ధాప్యంలో వైద్యం, మందుల కోసం వీరికి ఎక్కువగా ఖర్చులు ఉంటాయి. మందులకు చేసిన అప్పులు తీరిస్తేనే కొత్త మందులు అరువుకు ఇస్తారు. అయితే, పెన్షన్ అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● 27,386 మంది ఉద్యోగులు

వివిధ ప్రభుత్వ శాఖల కింద జిల్లాలో 27,386 మంది ఉద్యోగులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా సుమారు రూ. 204.97 కోట్లను జీతాలుగా చెల్లించాల్సి ఉంది. ఒకటవ తేదీకల్లా వీరికి వేతానాలు అందాల్సి ఉండగా నెల ప్రారంభమై రెండు వారాలు గడిచినా బ్యాంకుల్లో నగదు జమ కావడం లేదు. ఇలాంటి పరిస్థితి ఎన్నడూ లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆశాజనకంగా నిమ్మ ధరలు



పొదలకూరు : వారం రోజుల నుంచి నిమ్మ ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. మంచు ప్రభావంతో ఈశాన్య రాష్ట్రాలకు నిమ్మకాయలు తరలించకున్నా మిగతా చోట్ల డిమాండ్ ఉందని వ్యాపారులు చెబుతున్నారు. పొదలకూరు నిమ్మ మార్కెట్లో గురువారం లూజు బస్తా ధర రూ.4వేలు నుంచి 5200 వరకు, పండు కాయలు లూజు రూ.3200 నుంచి 4వేల వరకు ధర పలుకుతున్నాయి. ఇటీవల మిచాంగ్ తుఫాను కారణంగా నిమ్మతోటలు దెబ్బతిన్నాయి. అయితే, సంక్రాంతి పండుగ తర్వాత కొంత డిమాండ్ పెరిగింది. ఇక్కడి కాయలు కోల్‌కతా, పాట్నా, రాయపూర్, రాంచీలతోపాటు దక్షిణాది ప్రాంతాలైన చెన్నై, మధురై, బెంగళూరు, కేరళ ప్రాంతాలకు తరలిస్తున్నారు. చిన్నసైజు ఉన్నప్పుడే కోసేస్తుండటంతో మార్కెట్ చేరిన కాయలను డిమాండ్ ఉన్న ప్రాంతాలకు తరలిస్తున్నారు.

రిజిస్ట్రేషన్లకూ తిప్పలు



వరికుంటపాడు : మండల పరిషత్ కార్యాలయంలో పడిగాపులు

'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకంలో ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ కోసం లబ్ధిదారులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. సచివాలయాల్లో సర్వర్ సరిగ్గా పని చేయకపోవడంతో గంటల కొద్దీ నిరీక్షించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. లబ్ధిదారులకుతోడు వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులు సైతం రెండు, మూడు సార్లుగా బయోమెట్రిక్ వేయాల్సి వస్తుండటంతో రోజంతా వేచి ఉన్నా పట్టుమని పది మందికి కూడా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో ఇతర పనుల వైపు దృష్టి పెట్టలేక పోతున్నామని ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వరికుంటపాడు, సీతారామపురం మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. వ్యయప్రయాసలు కోర్చి సచివాలయాలకు వెళుతున్న మహిళలు అక్కడ సర్వర్ పని చేయకపోవడంతో వెనుదిరుగుతున్నారు.

- వరికుంటపాడు/సీతరామాపురం



సీతారామపురం బిట్-1 సచివాలయంలో వేచి ఉన్న మహిళలు

పెరంకొండ ఫైళ్లు మాయం!

కోట్ల రూపాయలకుపైగా అవినీతి జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పెరంకొండ ముంపు గ్రామానికి చెందిన ఫైళ్లు లభ్యం కావడం లేదట!. లబ్ధిదారులకు చెల్లించిన పరిహారం వివరాలను ప్రచురించిన నోటిఫికేషన్లూ దొరకడం లేదట! తెలుగుగంగ ఇంజనీరింగ్, భూసేకరణ అధికారులు, జిల్లా, రాష్ట్ర అధికారుల మధ్య జరిగిన ఉత్తర, ప్రత్యుత్తరాలు కూడా అదృశ్యమయ్యాయట. ఫలానా ఫైల్ నంబర్ చెబితే వెతుకుతారట!

ఇదీ ఓ వ్యక్తికి సమాచార హక్కు చట్టం కింద తెలుగుగంగ భూసేకరణ విభాగం రాపూరు యూనిట్ అధికారులు ఇచ్చిన సమాధానం. మూడేళ్ల క్రితమే ముంపు పరిహారం విడుదలైంది. ఏడాది క్రితమే ఈ పరిహారం చెల్లింపులో జరిగిన అవకతవకలపై జాయింట్ కలెక్టర్ విచారణ జరిపారు. మరి ఇంతలోనే పెరంకొండ వ్యవహారానికి సంబంధించిన ఫైళ్లు లభ్యం కావడం లేదని అధికారులు చెబుతున్నారంటే ఎలా అర్థం చేసుకోవాలి. ఈ అవినీతి భాగోతంపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో కొందరు హైకోర్టులో పిల్ వేసేందుకు సిద్ధమవుతున్నారు.

నెల్లూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : కండలేరు ముంపు గ్రామంగా కలువాయి మండలం పెరంకొండ గ్రామాన్ని ఇంజనీరింగ్ అధికారులు నిర్ధారించారు. దీనిని భూసేకరణకు ప్రతిపాదించగా టీజీపీ భూసేకరణ విభాగం అవార్డులు పాస్ చేసింది. అయితే ఇది ముంపు గ్రామం కాకపోయినా పరిహారం చెల్లించారంటూ మొదటి నుంచీ ఫిర్యాదులు అందుతున్నాయి. పరిహారం చెల్లింపులో కూడా అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులున్నాయి. దీనిపై గతేడాది అప్పటి జేసీ రోణంకి కూర్మనాథ్ విచారణ చేపట్టారు. సర్వే, ఆర్అండ్‌బీ అధికారులను ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి పరిశీలన చేయించారు. నిబంధనలకు విరుద్ధంగా సుమారు రూ.33 కోట్లను అధికంగా చెల్లించారని విచారణలో తేల్చారు. 11 మంది వివిధ హోదాల్లో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు బాధ్యులుగా విచారణలో గుర్తించారు. గతంలో టీజీపీలో పనిచేసిన స్పెషల్ కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లను బాధ్యతలను చేసినట్లు సమాచారం. ఇక ఇంజనీరింగ్ విభాగంలో కూడా ఓ ఎస్ఈ, ఈఈ, డీఈ, ఏఈలను బాధ్యులుగా గుర్తించి వారిపై కూడా చర్యలకు సిఫార్సు చేశారు. ఇక పెరంకొండలో పునరావాస పరిహారం తీసుకునే క్రమంలో లబ్ధిదారులు సమ్మతి అని అఫిడవిట్ సమర్పించి ఆ తర్వాత కొందరు పరిహారం పెంపుకై కోర్టును ఆశ్రయించారని కూడా అధికారులు గుర్తించి, ఆ విషయాన్ని కూడా పొందుపరిచారు. ఇటువంటి వారిపై కూడా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక్కడ చెల్లించిన పరిహారంలో గ్రామంలోని లబ్ధిదారుల కన్నా దళారులకే ఎక్కువగా చేరినట్లు కూడా విచారణలో తేలింది. మొత్తం కథ నడిపించిన ఓ న్యాయవాది కుటుంబ సభ్యుల ఖాతాలకు సుమారు రూ.5 కోట్ల వరకు చేరగా, పలువురు అధికారులకు డబ్బులు, బంగారు ఆభరణాలను కానుకలుగా అందించినట్లు విచారణ సందర్భంగా వెలుగు చూసినట్లు తెలిసింది. జాయింట్ కలెక్టర్ తన నివేదికను సమర్పించి ఆరు నెలలు దాటింది. కానీ నేటికీ ఎటువంటి చర్యలు లేకపోవడం గమనార్హం.

- పునరావాసం పేరిట భారీ అవినీతి
- జేసీ విచారణలో అక్రమాలు బట్టబయలు
- టీజీపీ కార్యాలయంలో ఆ ఫైళ్లు దొరకలేదట!
- ఆర్టీఐకు సమాధానమిచ్చిన అధికారులు
- తప్పించుకునేందుకు తెరవెనుక కుట్రలు

ఎన్నికల విధులు సమర్ధవంతంగా నిర్వహించండి

● అధికారుల శిక్షణలో కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), జనవరి 8 : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై అధికారులు పూర్తి అవగాహన కలిగి సమర్థవంతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో ఈఆర్వోలకు, మాస్టర్ ట్రైనర్లకు రెండు రోజుల పాటు జరగనున్న శిక్షణ కార్యక్రమంలో తొలిరోజు గురువారం కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. పొరపాటు జరిగిన తరువాత సరిదిద్దు కోవటం కంటే ముందు గానే పూర్తిగా అర్థం చేసుకొని పోలింగ్ విధులు నిర్వహించాలన్నారు. ఈవీఎంల సీలింగ్ నుంచి మాక్ పోలింగ్ వరకు గత ఎన్నికల కంటే ఇప్పుడు చాలా మార్పులు వచ్చాయని చెప్పారు. ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి బాపిరెడ్డి పోలింగ్ విధులు, ఈవీఎంల పనితీరు, వినియోగం, వీవీప్యాట్లు, బ్యాలెట్ యూనిట్ల పరిశీలన తదితరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ శిక్షణలో జేసీ రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

ఆశలన్నీ 'బుగ్గన'పాలు!

- మెట్ట ప్రాంత ప్రజలను నిరాశ పరిచిన బడ్జెట్
- జలవనరుల అభివృద్ధికి నిధులేవి!?
- పారిశ్రామిక ప్రగతికీ మొండిచేయి

ఆత్మకూరు, ఫిబ్రవరి 8 : సార్వత్రిక ఎన్నికల సీజన్.. పెండింగ్ ప్రాజెక్టులకు.. కొత్త ప్రాజెక్టులకు రాష్ట్ర బడ్జెట్‌లో భారీగానే నిధుల కేటాయింపులు ఉంటాయని సంబరపడిన జిల్లావాసులకు నిరాశే మిగిలింది. ముఖ్యంగా మెట్ట ప్రాంత ప్రజలను, రైతాంగాన్ని నిరాశపరిచింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ. 2.86 లక్షల కోట్ల అంచనాలతో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రవేశపెట్టిన ఓటాన్ బడ్జెట్‌లో జిల్లాకు ప్రాధాన్యం దక్కలేదు. వెనుకబడిన, వ్యవసాయ ఆధారిత ప్రాంతాలకు ప్రత్యేక కేటాయింపులు ఉంటాయనుకుంటే నిరాశే మిగిలింది. కీలకమైన సోమశిల జలాశయం పూర్తిస్థాయిలో అభివృద్ధికి, సోమశిల నుంచి మెట్ట ప్రాంతాలకు సాగు, తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఆనం సంజీవరెడ్డి హైలెవల్ కెనాల్ పనుల ప్రగతికి, ప్రధాన సాగునీటి వనరులకు మొండిచేయి చూపింది. గత ప్రాజెక్టుల్లో నీటి ప్రాజెక్టులకు కేటాయించిన నిధులను పూర్తిగా ఖర్చు చేయకపోవడం అటుంచితే ప్రధానమైన ప్రాజెక్టులను, జలవనరుల అభివృద్ధిని విస్మరించడంపై జిల్లావాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



శిలాఫలకానికే పరిమితమైన నారంపేట వద్ద పారిశ్రామికవాడ

● పారిశ్రామిక ప్రగతి ఇక కష్టమే!

జిల్లాల పునర్వ్యవస్థీకరణతో పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ప్రాంతాలు తిరుపతి జిల్లాలోకి వెళ్లడంతో నెల్లూరు పారిశ్రామికంగా అభివృద్ధి చెందాల్సిన జిల్లాగా మారిపోయింది. కృష్ణపట్నం పోర్టు ప్రాంతంలో పోర్టు అనుబంధ పరిశ్రమలు మినహాయిస్తే మిగిలిన ప్రాంతాల్లో రైస్ మిల్లులు, చిల్లింగ్ సెంటర్లు మినహాయించి మరే పరిశ్రమలు లేవనే చెప్పాలి. బడ్జెట్‌లో జిల్లాలో పారిశ్రామిక ప్రగతికి ప్రాధాన్యం దక్కలేదు. మార్కెట్ రంగాలకు తగ్గట్టుగా ఎంఎస్ఎంఈ రంగంలో ప్రోత్సాహించాల్సి ఉంది. ఎంఎస్ఎంఈ పార్కుల్లో మౌలిక వసతులు కల్పించాలి. ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి పెట్టుబడిదార్లను ఆహ్వానించటం, వారికి పరిపారిశ్రమ స్థానకు కావాల్సిన అన్ని వసతులతో కూడిన భూమిని కేటాయంచ గలిగితే జిల్లా అంతట పారిశ్రామికంగా అభివృద్ధి సమానంగా జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి.



● పడకేసిన ఇండస్ట్రియల్ పార్కు

మెట్టప్రాంతాలైన ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఆత్మకూరు సమీపంలో ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. 2020, సెప్టెంబరు 20న ఆర్భాటంగా ఆత్మకూరు మండలం నారంపేట సమీపంలో జాతీయ రహదారి పక్కనే 173 ఎకరాల్లో నూతనంగా ఇండస్ట్రియల్ పార్కుకు దివంగత రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఎట్టకేలకు ఇండస్ట్రియల్ పార్కులో సెంచరీ ప్లైవుడ్ పరిశ్రమకు శ్రీకారం చుట్టారు. కానీ ఏం జరిగిందో ఏమోగాని ఈ పరిశ్రమ ముఖ్యమంత్రి జగన్ సొంత జిల్లా కడపలోని బద్వేల్ నియోజకవర్గానికి తరలి వెళ్లింది. అప్పటి నుంచి ఆత్మకూరు ఇండస్ట్రియల్ పార్కులో పరిశ్రమల ఏర్పాటు ఊసే లేకపోవడం గమనార్హం. ఈ క్రమంలో ప్రస్తుత రాష్ట్ర బడ్జెట్‌లో సైతం మెట్ట ప్రాంతాల్లో పారిశ్రామికవాడల అభివృద్ధి ఊసేలేక పోవడంతో మెట్టప్రాంత ప్రజలను నిరాశ పరిచినట్లయింది.